www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 13-1-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 269 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 11.12 తదుపరి తదియ; నక్షత్రం: శ్రవణం మ. 12.50 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: సా. 4.25-5.51; దుర్ముహూర్తం: ఉ. 6.53-8.21; అమృతఘడియలు: రా. 1.02-2.28; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.56 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రహదారులపై సంక్రాంతి రద్దీ



వాహనాలతో కిక్కిరిసిన టోల్ గేట్లు

హైదరాబాద్ నుంచి ఏపీకి భారీగా రాక

ఓఆర్ఆర్‌పైనా వాహనాల బారులు

పండగ వేళ విమాన చార్జీలకు రెక్కలు

నేడు, రేపు.. విజయవాడ, రాజమండ్రికి నేరుగా సర్వీసుల్లేవు

హైదరాబాద్-విశాఖ టికెట్ 18వేల పైనే

2

చౌటుప్పల్‌లో కిక్కిరిసిన వాహనాలు

బడుగులపై పెత్తనం!

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో షాడో ఎమ్మెల్యేల తిష్ఠ!

పగ్గాలన్నీ వారి చేతుల్లోనే

వైసీపీకి సభలో 28 ఎస్సీ, 7 ఎస్టీ సీట్లు

పేరుకే దళిత, గిరిజన ఎమ్మెల్యేలు

అజమాయిషీ అంతా ఆ నలుగురిదే!

ఎమ్మెల్యేల మాటున యథేచ్ఛగా ఖనిజ సంపద దోపిడీ

లేటరైట్, బాక్సైట్ అక్రమ తవ్వకం

రంగురాళ్లు, క్వార్ట్జ్ కూడా

మంత్రులు, ఉపముఖ్యమంత్రులపైనా పెద్దల అజమాయిషీ

జగన్ జమానాలో దళిత, గిరిజన ఎమ్మెల్యేలను డమ్మీలుగా మార్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి సంక్షేమ పథకాలు రద్దు చేయడమే కాదు.. చట్ట సభకు ఎన్నికైన ఆ వర్గాల ఎమ్మెల్యేల స్వేచ్ఛనూ హరిస్తున్నారు. జగన్ సొంత సామాజికవర్గ ఎమ్మెల్యేలకున్న స్వాతంత్ర్యం, ప్రాధాన్యం.. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు ఇవ్వడం లేదు. సీఎం దగ్గర ఉండే నలుగురు కోర్ టీం సభ్యులు.. మొత్తం 35 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలనూ చెప్పుచేతుల్లో పెట్టుకున్నారన్న ఆరోపణలున్నాయి. నలుగురు నేతలు నాలుగు దిక్కులనూ పంచుకుని అక్కడ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకు అధికారాలు లేకుండా చేశారని విమర్శలు రేగుతున్నాయి.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నా ఎస్సీ, నా ఎస్టీ అని చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్.. ఆ వర్గ ఎమ్మెల్యేలపైకి షాడో ఎమ్మెల్యేలను ఉసిగొల్పుతున్నారు. వారు చట్ట సభలకు ఎన్నికైన బడుగు వర్గాల ఎమ్మెల్యేలను చిన్నచూపుతో చూడడమే కాకుండా జగన్ దర్శనం సైతం దొరక్కుండా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్, లేటరైట్, రంగురాళ్లు, క్వార్ట్జ్ ఖనిజాల అక్రమ తవ్వకంలో ఈ నలుగురు నేతలూ భాగస్వాములుగా మారి.. దోచుకుంటున్నారన్న విమర్శలున్నాయి. రాష్ట్ర స్థాయిలో, సీఎం స్థాయిలో ఏ పని కావాలన్నా ఈ నలుగురి చలువతోనే

మిగతా 3వ పేజీలో...



చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కొలుసు పార్థసారథి

ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి!

సీఎం జగన్ ప్రతిపాదన.. ఎమ్మెల్యే ఓకే

మాగుంట, బాలినేనికి చెక్ చెప్పడానికే!

హుటాహుటిన భాగ్యనగరికి భాస్కర్‌రెడ్డి

మద్దతివ్వాలని బాలినేనికి వినతి

అసెంబ్లీ బరిలో దిగాలని సూచన

ససేమిరా అన్న మాజీ మంత్రి

మాగుంటకు ఎంపీ టికెట్ ఇస్తేనే పోటీ చేస్తానని స్పష్టీకరణ

అభ్యర్థుల కోసం జగన్ తిప్పలు

ఎవరూ దొరకకే స్థానికేతరులకు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సర్వేలన్నారు.. పనితీరన్నారు.. ప్రజాభిప్రాయం అన్నారు.. చివరకు సంబంధం లేని స్థానికేతరులను సీఎం జగన్ అభ్యర్థులుగా ఖరారు చేస్తున్నారు. ఒంగోలుతో ఏ మాత్రం సంబంధం లేని చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్కడ లోక్‌సభ అభ్యర్థిగా రంగంలో దింపాలని ప్రతిపాదించారు. దీనిని చెవిరెడ్డి

మిగతా 11వ పేజీలో...

వైసీపీలో బీసీలకు గుర్తింపు ఒట్టిమాటే!

11

నన్ను గన్నవరం వెళ్లమన్నారు.. బీసీని కాబట్టి ఓడినా పర్లేదనుకున్నారు

ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు, దూషణలు చేయకపోవడమే నా అసమర్థతా?

వైసీపీ నాయకత్వంపై పార్థసారథి ఫైర్.. టీడీపీలో చేరతానని ప్రకటన

తరలింపు లెక్కలివ్వండి

దేనికెంత స్థలం కేటాయించారు?



క్యాంపు ఆఫీసులకు ఎంత సేకరిస్తున్నారు?

ఎంతమంది ఉద్యోగులు అక్కడికి వెళ్లాలి?

వారు అక్కడ ఎన్ని రోజులు ఉంటారు?

పూర్తి వివరాలను కోర్టు ముందుంచండి.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

త్రిసభ్య ధర్మాసనం వద్దకు పంపాలో, సింగిల్ జడ్జి విచారించాలో ఉత్తర్వులిస్తాం

మధ్యంతర ఉత్తర్వులు సవరించలేం: ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు ముసుగులో అమరావతి నుంచి ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలిస్తున్నారంటూ దాఖలైన వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం విచారించాలా లేక సింగిల్ జడ్జి విచారణ జరపాలా అనే విషయంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ప్రకటించింది. వ్యాజ్యాలను తగిన బెంచ్ విచారణ చేపట్టేవరకు ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించవద్దని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సర్కారు వేసిన అప్పీల్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. కార్యాలయాల ఏర్పాటు కోసం ప్రభుత్వం లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సేకరించడంతో ఆఫీసులు తరలిస్తున్నారన్న భావనతో సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి ఉండవచ్చని, ఈ దశలో వాటిని సవరించలేమని పేర్కొంది. పిటిషన్లను త్రిసభ్య ధర్మాసనం వద్ద విచారణకు ఉంచాలన్న ప్రభుత్వ అభ్యర్థనను అంగీకరిస్తూనే.. సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారని సర్కారు అభ్యంతరం తెలుపుతోందని, ఈ పరిస్థితుల్లో ద్విసభ్య ధర్మాసనం ఎలాంటి ఆదేశాలు ఇచ్చినా తమను నిందించే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఒకవేళ వ్యాజ్యాలు విచారణ నిమిత్తం త్రిసభ్య ధర్మాసనం వద్దకు చేరితే

మిగతా 2వ పేజీలో...



ఎంపీ రఘురామకు ఊరట

చట్టనిబంధనలు పాటించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

కొత్తపల్లి గీత ఎస్టీ కుల ధ్రువపత్రం రద్దు జీవో నిలిపివేత

3

అమూల్.. అభాసు'పాలు'!

Amul
The Taste of India

"రాష్ట్రంలో రోజుకు నాలుగు కోట్ల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతాయి. అందులో సగం గృహ అవసరాలకు పోతే, మిగతా సగంలో 26% ఆర్గనైజింగ్ సెక్టార్‌కు వెళ్తున్నాయి. మరో కోటీ 40 లక్షల లీటర్ల పాలను పాడి రైతులు అసంఘటిత రంగంలో తక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు" అంటూ పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు లెక్కలు కట్టారు. ఆయన, ప్రభుత్వం ఇచ్చిన ఇలాంటి అంకెలను నమ్ముకుని రోజుకు ఎంతలేదన్నా కోటి లీటర్ల పాలు సేకరించవచ్చని అమూల్ అంచనాలు వేసుకుని రాష్ట్రంలోకి అడుగుపెట్టింది. కోట్లు మాట దేవుడెరుగు.. వ్యాపారం చేస్తున్న రాష్ట్రంలోని 19 జిల్లాల్లో రోజుకు మూడు లక్షల లీటర్లు సేకరించడమే ఆ సంస్థకు గగనమై పోతోంది.

యంత్రాంగాన్నంతా కదిలించినా నిండని కడవ

రోజుకు 1.40 కోట్ల లీటర్ల టార్గెట్‌తో ఏపీలోకి

మూడేళ్లు గడిచినా 3 లక్షలు దాటని సేకరణ

సర్కారు, పశు శాఖ మంత్రి లెక్కలు నమ్మి బోల్తా

19 జిల్లాలకుగాను 4 జిల్లాల్లోనే కొంత వ్యాపారం

తుస్సుమన్న జగనన్న పాల వెల్లువ

అటు.. రూ.4 బోనస్‌పై పాడిరైతులకు మోసం

గత ఐదేళ్లలో ఆచరణలోకి రాని 'కిస్లే' కబుర్లు

దీంతో అమూల్‌కు సహకరించని రైతాంగం



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో రోజుకు 4 కోట్ల లీటర్ల పాల ఉత్పత్తి! అందులో కోటీ 40 లక్షల లీటర్లు అసంఘటిత రంగంలోనే సేకరణ! ప్రభుత్వ పెద్దలు చెప్పిన ఈ మాటలు నిజమని నమ్మి ఏపీలో పాల సేకరణ చేపట్టిన అమూల్ అభాసుపాలవుతోంది. రాష్ట్రంలో రోజుకు 3 లక్షల లీటర్ల పాలు కూడా అమూల్ సేకరించలేకపోవడం గమనార్హం. మన రాష్ట్రంలో అమూల్‌కు సొంత లాజిస్టిక్స్ లేవు. ప్రభుత్వ యంత్రాంగం సహకారంతో చిన్న డెయిరీ స్థాయిలో ప్రారంభమైంది. అలాంటి సంస్థ కోసం దాదాపు రూ.3,600 కోట్ల ప్రజాధనాన్ని జగన్ సర్కారు వెచ్చించింది. నామమాత్రపు లీజులతో రూ.వేల కోట్ల విలువైన సహకార డెయిరీల ఆస్తులను ధారాదత్తం చేసింది. అనేక కారణాలతో మూతపడ్డ సహకార డెయిరీలను రెండేళ్లలో పునరుద్ధరిస్తామని హామీలిచ్చి, అమూల్ కోసం

మిగతా 12వ పేజీలో...

ఆ ఊరి పేరులోనే 'ధర్మం' ఉంది కానీ స్థానిక ఎమ్మెల్యే 'వ్యవహారం' మాత్రం అంతా అధర్మమే! భూకబ్జాలు, బెదిరింపులు, వాటాలు, కమీషన్లతో అవినీతి కంపు కొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాలోనే కోట్లు కొల్లగొట్టారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు దాదాపు రూ.5 కోట్లు మాత్రమే! ఈ నాలుగున్నరేళ్లలోనే ఏకంగా రూ.500 కోట్లకుపైగా అక్రమంగా సంపాదించినట్టు సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే అవినీతి బాగోతమిది!

● ఇసుక మేసేశారు

నియోజకవర్గంలో దాదాపు 60 కి.మీ. మేర నదీ పరీవాహక ప్రాంతం ఉంది. తన అనుచరుల ద్వారా ప్రతి రోజూ రూ.50 లక్షల విలువైన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎమ్మెల్యేకు ఎప్పటికప్పుడు వాటా సొమ్ము చేరుతోంది.



● బెదిరించి భూములు కొట్టేశారు

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఓ సోలార్ కంపెనీ యజమానులను బెదిరించి ఎకరా రూ.5 లక్షల చొప్పున 106 ఎకరాలను తన కుటుంబ సభ్యులు భాగస్వాములుగా ఉన్న సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి విలువ ఎకరా రూ.80 లక్షల నుంచి రూ.కోటి దాకా పలుకుతోంది.

● ఫామ్‌హౌస్‌లు.. రేసింగ్ ట్రాక్

సొంత నియోజకవర్గంతో పాటు ఇతర నియోజకవర్గాల్లో విలువైన వందలాది ఎకరాల భూములను సంపాదించారు. సామంతరాజులా విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారు. గుర్రపు స్వారీ కోసం ఏకంగా రేసింగ్ ట్రాక్ ఏర్పాటు చేసుకున్నారు.

అధర్మ సామంతరాజు

'గుడ్‌మార్నింగ్' ఎమ్మెల్యే దందా 500 కోట్లు!

ఇసుక తవ్వకాల్లోనే రూ.కోట్లు అక్రమార్జన

భూ ఆక్రమణలు, బెదిరింపులకు లెక్కేలేదు

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిలోనూ వాటా

రియల్ వెంచర్లు, కాంట్రాక్టుల్లోనూ కమీషన్లు

కుటుంబ సభ్యుల పేరిట వందల ఎకరాలు

విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు, రేసింగ్ ట్రాక్

ఎన్నికల ముందు కుటుంబ ఆస్తి రూ.5 కోట్లే

నాలుగున్నరేళ్లలోనే ఎడాపెడా దోపిడీ

ఎమ్మెల్యే అండతో అనుచరులూ అక్రమార్జన




(పుట్టపర్తి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ ఎమ్మెల్యేలలో ఆయనది ప్రత్యేక స్టైల్! 'గుడ్ మార్నింగ్' అంటూ రోజూ ఉదయమే ప్రజల ఇళ్ల తలుపులు తడతారు. కష్టాల్లో తోడుంటానని, ఇంటికి పెద్ద కొడుకునని చెబుతారు. అందరూ నిజాయితీగా ఉండాలని హితోపదేశం చేస్తారు. తన 'మార్క్' రాజకీయంతో ఆయన యూట్యూబ్ స్టార్‌గా కూడా గుర్తింపు పొందారు. ఇదంతా నాణేనికి ఓ పార్శ్వం

మిగతా 12వ పేజీలో...

అటల్ సేతును ప్రారంభించి, దానిపై నడుస్తున్న ప్రధాని మోదీ





2 గంటల ప్రయాణ కాలం.. నిమిషాలే

అటల్ సేతును ప్రారంభించిన ప్రధాని

ముంబై-నవీ ముంబైల మధ్య నిర్మాణం

21.8 కిలో మీటర్ల పొడవుతో దేశంలోనే అతి పెద్ద సముద్ర వంతెనగా గుర్తింపు

17,840 కోట్ల వ్యయం.. ఏడేళ్ల నిర్మాణం

2

నేలపై నిద్ర.. సాత్వికాహారం

2

11 రోజుల అనుష్ఠానం ప్రారంభించిన మోదీ

రామాలయం ప్రారంభోత్సవం దాకా దీక్షలోనే..

నాసిక్‌లోని కాలారామ్ గుడిలో ప్రధాని శ్రమదానం

రామాయణ పారాయణం.. ప్రజలకు సందేశం

16న శ్రీసత్యసాయి జిల్లాకు ప్రధాని

నాసిన్ అకాడమీని ప్రారంభించనున్న మోదీ

3



కడప జిల్లా కొండాపురంలో గుంజీలు తీస్తున్న అంగన్వాడీలు

వేతనాల పెంపుపైనే పీటముడి

అంగన్వాడీలతో చర్చలు మళ్లీ విఫలం

2

'తోపు' ధనదాహం

అక్రమార్జన కోసం అడ్డదారులు

జగనన్న లే అవుట్ కాంట్రాక్టర్‌కు బెదిరింపులు.. డబ్బుల డిమాండ్

కప్పం కట్టలేమని చెప్పిన కాంట్రాక్టర్

జగనన్న లే అవుట్ కార్మికుల నిర్బంధం

11



శ్రీసత్యసాయి జిల్లాలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఎస్మా జీవో ప్రతుల నిమజ్జనం

అంగన్వాడీలతో చర్చలు మళ్లీ విఫలం

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): "మీ తాటాకు చప్పుళ్లకు బెదిరిపోం. ఎస్మా చట్టం ప్రతులను భోగి మంటల్లో కాల్చేస్తాం... మా డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగించి తీరుతాం" అని అంగన్వాడీ యూనియన్ నేతలు తేల్చి చెప్పేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఎంత వరకైనా వెళ్లడానికి సిద్ధమని స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో అంగన్వాడీ యూనియన్లతో మంత్రుల కమిటీ ఐదోసారి జరిపిన చర్చలు విఫలమయ్యాయి. జీతాలు పెంచాలని కోరగా జూలైలో పెంచుతామని ప్రభుత్వం చెప్పడాన్ని అంగన్వాడీలు తీవ్రంగా వ్యతిరేకించారు. వేతనాలు పెంచే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాగా, అంగన్వాడీలతో మంత్రుల కమిటీ జరిపిన చర్చలకు ఆ శాఖా మంత్రి ఉషశ్రీచరణ్ డుమ్మా కొట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ల నేతలు బేబిరాణి, సుబ్బరావమ్మ, లలిత, జ్యోతి పాల్గొన్నారు. చర్చల అనంతరం అంగన్వాడీ నేతలు మీడియాతో మాట్లాడారు.

సమ్మె యథాతథంగా కొనసాగుతుంది: సుబ్బరావమ్మ

"రాష్ట్ర ప్రభుత్వానికి మహిళల పట్ల సానుకూల దృక్పథం లేదు. ఈ రోజు జరిగిన చర్చల్లో పది డిమాండ్లలో నాలుగు అంశాలపై మాత్రమే స్పష్టత ఇచ్చారు. ఎస్మా ప్రయోగిస్తే భయపడేది లేదు. విధుల్లో చేరకపోతే కొత్తవారిని తీసుకుంటామని ప్రభుత్వం బెదిరిస్తోంది. ఈ తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదు. ఎస్మా ప్రతులను భోగి మంటల్లో కాలుస్తాం. సమ్మె యథాతథంగా కొనసాగుతుంది. పండగ లోపు వేతనాల పెంపుపై ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక దీక్ష చేస్తాం. లక్ష మంది మహిళలు రోడ్ల మీద ఉంటే సీఎం స్పందించరా. ఇప్పటికైనా సీఎం స్పందించి వేతనాలు పెంచాలి."

ఇప్పటికి 9మంది చనిపోయారు: లలితమ్మ

"ఐదేళ్లకు ఒకసారి వేతనాలు పెంచుతామంటున్నారు. ఈ ఐదేళ్లలో నిత్యావసరాల ధరలు ఎన్నిసార్లు పెరిగాయి. సమ్మె వల్ల ఇప్పటికే 9మంది అంగన్వాడీలు చనిపోయారు. కోటి సంతకాలు పెట్టించి సజ్జలకు ఇవ్వం... జగన్‌కు ఇస్తాం. జగన్ తీసుకునే దాకా అక్కడే ఉంటాం. దీక్షలు కొనసాగిస్తాం."

ఎంత పెంచుతారో చెప్పడంలేదు: జ్యోతి

"మంత్రుల కమిటీతో చర్చలు విఫలమయ్యాయి. జూలైలో వేతనాలు పెంచుతామన్నారు. ఎంతో చెప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలి."

కొత్తవారిని తీసుకుంటామని బెదిరిస్తున్నారు: బేబిరాణి

"ప్రభుత్వం దగ్గర డబ్బు ఉంది కానీ వేతనాలు పెంచమని చెబుతున్నారు. ఉంటే ఎందుకు ఇవ్వరు. ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారు. కొత్త ఉద్యోగాలు వేసేస్తాం అంటే చూస్తూ ఊరుకోం. ఇంటర్వ్యూలను అడ్డుకుంటాం."

ఎల్లకాలం సమ్మె చేస్తామంటే కుదరదు: సజ్జల

"సమ్మె విరమించి విధుల్లో చేరండి. సమ్మె చేయడానికి ఇదేమీ ఫ్యాక్టరీ కాదు. ఎల్లకాలం సమ్మె చేస్తామంటే కుదరదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక తప్పదు. కొత్తగా రిక్రూట్ చేసుకోవాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారు. తెగేదాకా లాగొద్దు. ఈ సమ్మె వెనుక పొలిటికల్ ఎజెండా ఉంది. 2024 జూలైలో ఎంతో కొంత వేతనం పెంచుతాం. ఎంతపెంచుతామో ఇప్పుడే ఎందుకు చెప్పాలి. పెంచకపోతే అప్పుడు సమ్మె ఆప్షన్ ఉంది కదా. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల డిమాండ్లపై పలు దఫాలుగా ప్రభుత్వం చర్చలు జరిపింది. వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి 11 డిమాండ్లలో 10 పరిష్కరించింది. వేతనం పెంపుపైనే అంగన్వాడీలు పట్టుపడుతున్నారు. ఉద్యోగ విరమణ సమయంలో ఇచ్చే ప్రయోజనాన్ని రూ.50వేల నుంచి లక్షా 20 వేలకు, హెల్పర్లకు రూ.50వేలకు పెంచాలని, మట్టి ఖర్చులు రూ.20వేలకు పెంచాలని నిర్ణయం తీసుకున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వేతనం పెంచుతామని హామీ ఇచ్చాం. చర్చల మినిట్స్‌లో కూడా నమోదు చేస్తామన్నాం. ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62కు పెంచాం. మినీ అంగన్వాడీల స్థాయిని పెంచడానికి ఆమోదం తెలిపాం. అంగన్వాడీలు అత్యవసర సేవల పరిధిలోకి వస్తారు. కాబట్టి ఎస్మా కింద నోటీసులు జారీ చేస్తున్నాం. ఏది చేయగలమో అది చేస్తాం. సమ్మె చేస్తే డిమాండ్లు నెరవేరితే అందరూ అదే చేస్తారు. సమ్మె చేస్తారని ప్రతి డిమాండ్‌ను నెరవేర్చుకుంటూ పోతామా? వేతనం పెంచకపోవడం ఆర్థికపరమైన ఇబ్బందుల వల్ల కాదు. ఒక విధానం అంటూ ఉండాలి. సమ్మె విరమిస్తే జీవోలు వస్తాయి."

32వ రోజూ కొనసాగిన సమ్మె

అంగన్వాడీల సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ప్రకాశం జిల్లా ఒంగోలు హౌసింగ్ బోర్డు కాలనీలో తెరిచి ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని యూనియన్ నాయకులు మూయించారు. కడప జిల్లా పోరుమామిళ్లలో ఖాళీ చాటలతో నిరసన వ్యక్తం చేశారు. జగన్‌కు ఓటేసి తప్పు చేశామంటూ కొండాపురంలో గుంజీలు తీశారు. అనంతపురం జిల్లా గార్లదిన్నెలో షోకాజ్ నోటీసులను దహనం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో ఎస్మా జీవో ప్రతులను నిమజ్జనం చేశారు. కర్నూలు జిల్లా కేంద్రంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన పార్టీలు నేతలతో కలసి వందలాదిగా అంగన్వాడీలు కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు.అయితే భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు.


ఒంగోలులో మరో కొవిడ్ కేసు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో కొవిడ్ కేసు నమోదైంది. బాపట్ల జిల్లా తెనాలికి చెందిన మహిళ మహారాష్ట్రకు వెళ్లి వచ్చారు. అనంతరం ఇంకొల్లులోని తల్లి ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌లో పరీక్ష చేయించుకున్నారు. శుక్రవారం ఆమెకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తన తల్లి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండి చికిత్స పొందుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంవో డాక్టర్ బి.తిరుమలరావు తెలిపారు.

రామాలయ ప్రతిష్ఠాపనకు..

నలుగురు శంకరాచార్యులూ దూరం!

గుడి నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభిస్తున్నారని ఆక్షేపణ



అవిముక్తేశ్వరానంద | నిశ్చలానంద సరస్వతి | సదానంద సరస్వతి | భారతీ తీర్థ

బెంగళూరు-ఆంధ్రజ్యోతి/అయోధ్య జనవరి 12: అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపనకు హాజరు కాకూడదని నాలుగు కీలక మఠాలకు చెందిన నలుగురు శంకరాచార్యులు నిర్ణయించుకున్నారు. రామాలయ నిర్మాణం ఇంకా పూర్తి కాకముందే ప్రారంభిస్తున్నారని వారు ఆక్షేపిస్తున్నారు. అందుకే హాజరు కారాదని నిశ్చయించారు. అయితే, రామాలయ ప్రతిష్ఠను శృంగేరి, ద్వారకా పీఠాధిపతులు స్వాగతించారని.. పూరి శంకరాచార్య కూడా అనుకూలంగా ఉన్నారని.. జ్యోతిర్‌పీఠానికి చెందిన శంకరాచార్య మాత్రమే ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించారని వీహెచ్‌పీ సీనియర్ నేత అలోక్‌కుమార్ వెల్లడించారు. తగు సమయంలో రామచంద్రుడిని దర్శించుకోవడానికి అయోధ్య వస్తామని వారు పేర్కొన్నారని తెలిపారు. అయోధ్యలో శ్రీరామ విగ్రహావిష్కరణను శృంగేరి మఠం వ్యతిరేకిస్తున్నట్లు రెండ్రోజులుగా సాగుతున్న ప్రచారాలను శంకరాచార్య భారతీతీర్థ స్వామీజీ ఖండించారు. ఇది హిందూ వ్యతిరేక భావాలు కలిగిన వారి కుట్రగా అభివర్ణించారు. రామాలయ ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం అందిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మహోత్సవంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారని తెలిపారు. అయోధ్యలో విగ్రహావిష్కరణను తాము వ్యతిరేకిస్తున్నట్లు వస్తున్న వదంతులను నమ్మవద్దని చిక్కమగళూరు జిల్లా హరిహరపుర మఠం శంకరాచార్య సచ్చిదానంద సరస్వతి కోరారు. రామాలయ ప్రతిష్ఠ సనాతన ధర్మం అనుసరించేవారికి ఆనందదాయకమైన విషయంగా ద్వారక స్వామి సదానంద సరస్వతి స్పష్టం చేశారు.

మోదీ ప్రారంభిస్తే చప్పట్లు కొట్టాలా?

నిర్మాణం పూర్తికాకుండా ప్రారంభిస్తున్నారనే నలుగురు శంకరాచార్యులూ అయోధ్య ఆలయ ప్రాణప్రతిష్ఠకు వెళ్లడం లేదని జోషీ మఠాధిపతి, జ్యోతిర్‌పీఠం శంకరాచార్య అవిముకుటేశ్వరానంద సరస్వతి ఓ ప్రకటనలో తెలిపారు. 'ప్రధానిమోదీ ఆలయాన్ని ప్రారంభిస్తారు. ఆయన విగ్రహాన్ని స్పృశిస్తే నేనేం చేయాలి? నిలబడి చప్పట్లు కొట్టాలా' అని ప్రశ్నించారు. ఈయన బీజేపీని, మోదీని తీవ్రంగా వ్యతిరేకిస్తారు. 2019 ఎన్నికల్లో వారాణసీలో మోదీపై పోటీచేసిన రామరాజ్య పరిషత్ అభ్యర్థికి బహిరంగంగా మద్దతు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించినందుకు ఆయన ధర్నాకు కూడా దిగారు. ఇదిలా ఉండగా, ఆతిథ్య రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు తప్ప.. ఇతర రాష్ట్రాల సీఎంలెవరికీ అయోధ్య ఆలయ ప్రతిష్ఠకు ఆహ్వానం పంపలేదని యూపీ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే దళిత ప్రముఖులైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, కాన్షీరాంల కుటుంబ సభ్యులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. అలాగే రామజన్మభూమి ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన కరసేవకుల కుటుంబాలకు, వివిధ రంగాల ప్రముఖులకు ఆహ్వానాలు అందాయి.


ప్రాణ ప్రతిష్ఠకు రాష్ట్రపతికి ఆహ్వానం

అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మునకు ఆహ్వానం అందింది. రామ మందిర ట్రస్టు సభ్యులు రాష్ట్రపతిని శుక్రవారం స్వయంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. తనను కార్యక్రమానికి ఆహ్వానించడంపై సంతోషం వ్యక్తం చేసిన రాష్ట్రపతి.. అయోధ్య పర్యటనపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కాగా, రామాలయ ప్రతిష్ఠాపనకు ముందు కోదండరాముడికి 2.5 కిలోల భారీ ధనుస్సు సమర్పించనున్నారు. అయోధ్యలోని అమావా రామాలయం ట్రస్టు ఈ నెల 19న 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర' ట్రస్టుకు అందించనుంది. చెన్నైకి చెందిన కళాకారులు ఈ అద్భుత ధనుస్సును, బాణాలను రూపొందించారు. వాల్మీకి రామాయణంలో చెప్పిన విధంగా వీటిని తీర్చిదిద్దారు. 23 క్యారెట్ల బంగారంతో ధనుస్సును రూపొందించారు.

రాజకీయ తంతుగా మార్చారు


అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఒక రాజకీయ తంతుగా అధికార పార్టీ మార్చివేసిందని కాంగ్రెస్ విమర్శించింది. "శ్రీరాముని భక్తులు ఎప్పుడైనా ఆయన దర్శనం చేసుకోవచ్చు. దర్శనం కోసం అందిన ఆహ్వానాన్ని మేం తిరస్కరించడాన్ని ఒక కుట్రగా బీజేపీ ప్రచారం చేయడం సరికాదు. ఈ వ్యవహారంలో బీజేపీ ఉచ్చులో మేం పడదలుచుకోలేదు. నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం వంటి ప్రజల సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలనే బీజేపీ ఎత్తుగడను సాగనీయం" అని ఖర్గే పేర్కొన్నారు. మత సంప్రదాయాలను పక్కనబెట్టి, శంకరాచార్యులు తదితర ధార్మిక ప్రముఖులను కనీసం సంప్రదించకుండా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బీజేపీ తలపెట్టిందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధ్యక్షుడు పవన్ ఖేరా ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని రాజకీయమయం చేయడంవల్లే తమకు అందిన ఆహ్వానాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు తిరస్కరించారన్నారు.

లోకం తీరు



దివ్య స్వప్నం సాకారం

రామమందిర ప్రతిష్ఠపై అడ్వాణీ హర్షం



న్యూఢిల్లీ, జనవరి 12: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవంతో ఒక దివ్యమైన స్వప్నం సాకారమవుతుందని బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అడ్వాణీ అన్నారు. "అయోధ్యలో భవ్య రామాలయ నిర్మాణం జరగాలన్నది విధి నిర్ణయం. ఈ సత్కార్య సాధనకు ప్రధాని మోదీని విధి ఎంపిక చేసుకొంది" అని వ్యాఖ్యానించారు. హిందీ సాహిత్య పత్రిక రాష్ట్రధర్మలో ఆయన రాసిన వ్యాసంలో ఈ వ్యాఖ్యలు చేశారు. "రామ మందిర నిర్మాణం - ఒక దివ్య స్వప్నం సాకారం" శీర్షికతో ఆయన ఒక వ్యాసం రాశారు. 22న అయోధ్యలో జరిగే బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి అడ్వాణీ వస్తారని విశ్వ హిందూ పరిషత్ ప్రకటించింది. రామ జన్మభూమి ఉద్యమానికి నాయకత్వం వహించిన బీజేపీ నేతల్లో 96 ఏళ్ల అడ్వాణీ కూడా ఒకరు.

కటిక నేలపై నిద్ర...సాత్విక ఆహారం

» 11 రోజుల అనుష్ఠానం ప్రారంభించిన ప్రధాని



న్యూఢిల్లీ, జనవరి 12: అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఘట్టం వేళ ప్రధాని మోదీ భావోద్వేగానికి గురయ్యారు. "ఇంతటి భావోద్వేగానికి లోనవడం ఇదే మొదటిసారి. నా జన్మ ధన్యమైనట్టు భావిస్తున్నాను" అని దేశ ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక సందేశంలో ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో జరిగే ప్రధాన కార్యక్రమానికి సన్నాహంగా శుక్రవారం నాసిక్‌లో ఆయన కొన్ని ధార్మిక క్రియల్లో పాల్గొన్నారు. నాసిక్‌లోని పంచవటికి శ్రీరాముని జీవితంలో కీలక ప్రాధాన్యత ఉంది. సీతాసమేతంగా ఇక్కడ కొంతకాలం శ్రీరాముడు వనవాసం చేశారని పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో నాసిక్‌లోని శ్రీ కాలారామ్ మందిర్‌ను ప్రధాని దర్శించుకున్నారు. రామాయణ పారాయణం చేశారు. రానున్న 11 రోజులు తాను అనుష్ఠాన దీక్ష చేపడతానని వెల్లడించారు. ఈ కాలమంతా యజ్ఞయాగాదులు చేస్తూ, కఠిన నియమాలను ఆయన పాటించనున్నారు. అనుష్ఠాన సమయంలో మోదీ కటిక నేలపై నిద్రిస్తారు. సూర్యోదయానికి ముందే మేల్కొని భగవంతుని పూజలు చేస్తారు. జపం ఆచరిస్తారు. కొద్దిగా సాత్విక ఆహారం తీసుకుంటారు. రోజులో ఎక్కువ సమయం మౌనముద్రలో ఉంటారు. పురాణ పారాయణం వింటారు. శుభ్రమైన పరిసరాల్లో ఉంటారు. గురువులు, ధార్మిక ప్రముఖులను దర్శించుకుంటారు.

2 గంటల ప్రయాణకాలం.. 20 నిమిషాలే

» అటల్ సేతును ప్రారంభించిన ప్రధాని.. ముంబై-నవీ ముంబైల మధ్య నిర్మాణం

ముంబై, జనవరి 12: దేశంలోనే అతి పెద్ద సముద్ర వంతెన అటల్ సేతును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించారు. మొత్తం 21.8 కిలో మీటర్ల పొడవైన ముంబై ట్రాన్స్ హార్బర్ లింక్(ఎంటీహెచ్‌ఎల్) వంతెనను ముంబై-నవీ ముంబైల మధ్య నిర్మించారు. ఈ వంతెన నిర్మాణంతో ఇరు ప్రాంతాల మధ్య దూరం, ప్రయాణ కాలం కూడా తగ్గనుంది. ఇప్పటి వరకు ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణానికి 2 గంటల సమయం పడుతుండగా.. ఈ వంతెన అందుబాటులోకి రావడంతో ప్రయాణకాలం 20 నిమిషాలకు తగ్గనుంది. ఈ నిర్మాణానికి రూ.17,840 కోట్లు ఖర్చు చేశారు. ముంబైలోని సేవ్రి ప్రాంతం నుంచి రాయ్‌గఢ్ జిల్లాలోని నహవాసేవా ప్రాంతాలను ఈ వంతెన కలపనుంది. మొత్తం ఆరు లేన్ల ఈ వంతెన సముద్రంపైనే 16.5 కిలోమీటర్లు ఉందని అధికార వర్గాలు తెలిపాయి. 2016లో ఈ వంతెనకు ప్రధాని మోదీ శంకు స్థాపన చేశారు. కాగా, అటల్ సేతుపై టోల్ చార్జీలను వసూలు చేయనున్నారు. కార్లు, తేలికపాటి వాహనాలకు రూ.250 చొప్పున టోల్ చార్జీ నిర్ణయించారు. ఈ వంతెనపై ద్విచక్ర వాహనాలు, ఆటోలకు అనుమతి లేదు.

రహదారులపై
సంక్రాంతి రద్దీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్‌తోపాటు శివారు పట్టణాల్లో ఉంటున్న ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరడంతో జాతీయ రహదారులపై రద్దీ నెలకొంది. హైదరాబాద్-విజయవాడ, హైదారాబాద్-వరంగల్ రహదారులపై ఉదయం నుంచే మొదలైన వాహనాల రద్దీ మధ్యాహ్నానికి భారీగా పెరిగి రాత్రి వరకు కొనసాగింది. మరోవైపు.. పండుగకు వెళ్లే వాహనాలు ఔటర్‌రింగ్ రోడ్డుపై బారులుదీరాయి. సాధారణ రోజుల్లో ఔటర్ మీదుగా 1.80లక్షల వాహనాలు ప్రయాణిస్తుండగా.. శుక్రవారం ఒక్కరోజే 2.20 లక్షలకు పైగా వాహనాలు ఔటరింగ్ రోడ్డు పైకి వచ్చినట్లు తెలిసింది.

భారీగా పెరిగిన విమాన చార్జీలు

సంక్రాతి పండుగ వేళ సొంతూర్లకు వెళ్లే ప్రయాణికులతో విమాన సర్వీసులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్టణం సహా తిరుపతికి విమాన చార్జీల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు శనివారం అతి తక్కువ సర్వీసులు మాత్రమే ఉన్నాయి. వీటిలో టికెట్ల ధరలు కనిష్ఠంగా రూ.18వేల నుంచి గరిష్ఠంగా రూ.19వేల వరకు ఉన్నాయి. శని, ఆదివారాల్లో విజయవాడ, రాజమండ్రికి సర్వీసుల్లేవు. కాగా, మరోవైపు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి.

హౌతీలపై అమెరికా, బ్రిటన్ దాడులు

అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డొస్తే ఊరుకోబోం.. దేనికైనా సిద్ధం: బైడెన్



అమెరికా దాడులను వ్యతిరేకిస్తూ యెమెన్‌లో భారీ ర్యాలీ

న్యూఢిల్లీ, జనవరి 12: ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం నేపథ్యంలో.. ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు చేస్తున్న హమాస్ అనుకూల హౌతీ గ్రూపుపై అమెరికా, బ్రిటన్ సైన్యాలు తీవ్రస్థాయిలో ప్రతిదాడులకు దిగాయి. శుక్రవారం తెల్లవారుజామున హౌతీల లాజిస్టిక్ హబ్స్‌ను, గగనతల రక్షణ వ్యవస్థలను, ఆయుధాలను భద్రపరుచుకునే ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని రెండు దేశాలూ తొమహాక్ క్షిపణులు, యుద్ధవిమానాలతో విరుచుకుపడ్డాయి. హౌతీల తీరు ఇలాగే ఉంటే.. ఎర్రసముద్రంలో స్వేచ్ఛాయుత నౌకాయానానికి విఘాతం కలిగితే.. కఠినచర్యలు తప్పవని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ గురువారం హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయితే.. దౌత్యమార్గాల్లో చర్చలు జరపడానికి పలు ప్రయత్నాలు చేసిన తర్వాతే ఈ దాడులు చేస్తున్నామని బైడెన్ వివరణ ఇచ్చారు. "చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ఎర్ర సముద్రంలో అంతర్జాతీయ వాణిజ్యనౌకలపై యాంటీ షిప్ బాలిస్టిక్ క్షిపణులతో సైతం హౌతీలు చేస్తున్న దాడులకు ప్రత్యక్ష స్పందనే ఈ ప్రతీకార దాడులు" అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హౌతీల దాడులు అమెరికా సిబ్బంది, ఇతర సామాన్య నావికుల ప్రాణాలకు ప్రమాదకరంగా పరిణమించాయని.. అంతర్జాతీయ వాణిజ్యాన్ని స్తంభింపజేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. "అమెరికా ప్రజలను కాపాడడానికి, అంతర్జాతీయ వాణిజ్యం సజావుగా జరిగేలా రక్షించేందుకు ఎలాంటి ప్రత్యక్ష చర్యలు తీసుకోవడానికైనా సందేహించబోను" అని హెచ్చరించారు. మరోవైపు యూకే ప్రధాని రిషి సునాక్ కూడా ఈ ప్రతీకార దాడుల గురించి ఒక ప్రకటన చేశారు. హౌతీల సైనిక స్థావరాలే లక్ష్యంగా బ్రిటన్ 'రాయల్ ఎయిర్‌ఫోర్స్' దాడులు జరిపినట్టు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఆ దాడులను ఆత్మరక్షణలో భాగంగా తప్పనిసరి పరిస్థితుల్లో జరిపిన పరిమిత దాడులుగా అభివర్ణించారు. సైప్రస్‌లో ఉన్న తమ వైమానిక దళానికి చెందిన నాలుగు యుద్ధవిమానాలు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు యూకే రక్షణ శాఖ వెల్లడించింది. అమెరికాతో కలిపి జరిపిన ఈ ప్రతీకార దాడులకు.. నెదర్లాండ్స్, కెనడా, బహ్రెయిన్ మద్దతు తెలిపాయి

మూల్యం తప్పదు.. జర సిద్ధం

అమెరికా, బ్రిటన్ కలిపి తమపై చేస్తున్న దాడులను ఆటవిక దాడులుగా హౌతీలు అభివర్ణించారు. ఎవరేం చేసినా సరే.. ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్ దిశగా వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకోవడాన్ని కొనసాగించి తీరుతామని తేల్చిచెప్పారు. తమ మీద ప్రతీకార దాడులకు దిగితే తమ దాడులను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అమెరికా, బ్రిటన్ ప్రయోగించిన క్షిపణులు, బాంబులు యెమెన్‌లో తమ అధీనంలో ఉన్న ఐదు ప్రాంతాల్లో 73 చోట్ల పడ్డాయని.. ఈ దాడుల్లో ఐదుగురు మరణించగా, ఆరుగురు గాయపడ్డారని హౌతీల సైనిక ప్రతినిధి యాహ్యా సరీ వెల్లడించారు. "ఇక యుద్ధం మరింత భారీగా.. అమెరికన్లు, బ్రిటిషర్ల ఊహలకు, అంచనాలకు మించి ఉండబోతోంది." అని హౌతీలో ఉన్నత స్థానంలో ఉన్న అలీ అల్ క్వాహోం ట్వీట్ చేశారు. ఈ తరహా దాడులు చేయడం ద్వారా.. పాలస్తీనాకు, గాజాకు మద్దతివ్వకుండా యెమెన్‌ను ఆపగలమని ఆ రెండు దేశాలూ అనుకుంటే అది తప్పని పేర్కొన్నారు. "ఎర్ర సముద్రం గుండా ఇజ్రాయెల్‌కు, ఆక్రమిత పాలస్తీనాలోని రేవులకు వెళ్లే నౌకలే లక్ష్యంగా దాడులను కొనసాగించి తీరుతాం" అని చెప్పారు.

నక్సలైట్లతో వీడియో కాన్ఫరెన్స్!

చర్చలకు ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్ శర్మ పిలుపు



» కాదంటే గట్టి చర్యలుంటాయని హెచ్చరిక

రాయ్‌పూర్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు రావాలని మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి విజయ్‌శర్మ పిలుపునిచ్చారు. ప్రత్యక్షంగా రావటానికి వీలుగాకపోతే, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అయినా సరేనని ఆయన ప్రతిపాదించారు. ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన దీనిపై వివరంగా మాట్లాడారు. 'ఎటువంటి షరతులు లేకుండా ఏ రోజైనా, ఏ సమయంలోనైనా మావోయిస్టుల నవతరంతో చర్చలు జరపటానికి సిద్ధంగా ఉన్నా. ఏ అంశం మీదనైనా వారు నాతో మాట్లాడవచ్చు. ప్రత్యక్షంగా కలవటానికి ఇష్టం లేకపోతే వీడియో కాల్‌లోనైనా చర్చలు జరపవచ్చు. తమ సమస్యలు, సిద్ధాంతాలు, లక్ష్యాల గురించి చెప్పుకోవటానికి నక్సలైట్లకు ఒక ఆన్‌లైన్ వేదిక కల్పించటానికి మేం సిద్ధంగా ఉన్నాం. జనజీవన స్రవంతిలోకి కలిసేందుకు వారు ముందుకొస్తే నేను వారికి పూర్తి సహకారం అందిస్తా. శాంతియుత జీవనాన్ని గడపాలని, సమాజానికి సేవ చేయాలని వారిని నేను కోరుతున్నా' అని విజయ్‌శర్మ చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధిని మావోయిస్టులు ఎందుకు అడ్డుకుంటున్నారో తాము తెలుసుకోవాలని అనుకుంటున్నామన్నారు. 'ఆస్పత్రులు, పాఠశాలలు, తాగునీటి సదుపాయాలు, అంగన్‌వాడీల ఏర్పాటును వారు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ప్రజలను ఎందుకు పక్కదారి పట్టించి సమస్యలు సృష్టిస్తున్నారు? ఆయుధాలను ఎందుకు తమ వెంట ఉంచుకుంటున్నారు? వీటితోపాటు వారేం కోరుకుంటున్నారో కూడా తెలుసుకోవాలనుకుంటున్నాం' అని పేర్కొన్నారు. తాము స్నేహహస్తం చాచినా మావోయిస్టులు తిరస్కరిస్తే ఊరుకోబోమని హోంమంత్రి హెచ్చరించారు. ప్రజలను పెట్టిన బాధలకు వారు తప్పకుండా మూల్యం చెల్లించాల్సే ఉంటుందన్నారు. బుల్లెట్లు, తుపాకులతో శాంతి చర్చలు సాధ్యం కావని, ఒక నాగరిక సమాజాన్ని ఆయుధాలతో నియంత్రించలేమని చెప్పారు.

చర్చల్లో ముందంజ కష్టమే

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచీ పలు ప్రభుత్వాలు నక్సల్స్‌తో చర్చలకు పిలుపునిచ్చాయి. అయితే ఆయుధాలను వదిలి వేయాలని, రాజ్యాంగం పరిధిలోనే చర్చలు జరుపుదామని ప్రభుత్వాలు షరతులు విధించటం, మావోయిస్టులు తమవైన షరతులు పెట్టడంతో.. ఈ విషయంలో ఇప్పటి వరకూ ముందడుగు పడలేదు.

రాజ్యాంగం పరిధిలోనే..

రాష్ట్రంలోని గత ప్రభుత్వాలు చర్చల ప్రతిపాదన తెచ్చినప్పుడు నక్సలైట్లు కొన్ని షరతులు పెట్టారు. ముఖ్యంగా, మావోయిస్టుల పేరుతో అమాయక గిరిజనులను జైళ్లలో నిర్బంధించారని, వారిని విడుదల చేయాలన్నది వారి ముఖ్యమైన షరతుల్లో ఒకటి. దీని గురించి ప్రస్తావించగా, 'జైళ్లలో ఉన్న వారికీ చట్టం వర్తిస్తుంది. ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగం పరిధిలోనే పని చేస్తుంది. కాబట్టి చర్చలకు సంబంధించిన నిబంధనలు మారవు' అని విజయ్‌శర్మ తెలిపారు. సమాజానికి ఏమైనా చేద్దామని అనుకుంటే, ముందుకొచ్చి సమాజంతో మాట్లాడాలని, అంతేగానీ అడవుల్లో ఉండి కష్టాలతో సహవాసం చేయటం ఎందుకని నక్సలైట్లను ప్రశ్నించారు. మావోయిస్టులతో సాధ్యమైనంత సమగ్రంగా చర్చలు జరగాలని, ప్రభుత్వ వైఫల్యాలపైనా తమ అభిప్రాయాలను వాళ్లు తెలియజేయవచ్చని చెప్పారు. సమాజానికి దూరమైపోయామని భావించవద్దని యువ నక్సల్స్‌కు సూచించారు. జల్-జంగల్-జమీన్ (నీళ్లు, అడవి, భూమి) పేరుతో నక్సలైట్లు, గిరిజన ప్రాంతాల్లో గనుల తవ్వకాలను వ్యతిరేకించటంపై స్పందిస్తూ.. మైనింగ్ వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని తగ్గించటానికి, పర్యావరణ పరిరక్షణకు మావోయిస్టుల వద్ద ఏవైనా ప్రత్యామ్నాయ ఆలోచనలుంటే పంచుకోవచ్చని విజయ్ శర్మ తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో పరిస్థితులను మెరుగుపరచటానికి కట్టుబడి ఉన్నామన్నారు.

తరలింపు లెక్కలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించాలా? లేక ఎత్తివేయాలా? అనే విషయంపై ఫుల్‌బెంచ్ నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేసింది. క్యాంపు ఆఫీసుల ఏర్పాటు కోసం ఎంత విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్‌ను సేకరిస్తున్నారు? ఎన్ని శాఖలను విశాఖకు తరలిస్తున్నారు? మొత్తం ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు? వీరిలో ఎంతమంది విశాఖకు వెళ్లాలి? వారు అక్కడ ఎన్ని రోజులు ఉంటారు? తదితర వివరాలు కోర్టు ముందు ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. క్యాంపు కార్యాలయం ఏర్పాటు పేరుతో అమరావతి నుంచి ప్రభుత్వ కార్యాలయాలను తరలించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునకు భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంది. త్రిసభ్య ధర్మాసనం తీర్పుతో నేరుగా సాధ్యపడని కార్యాలయాల తరలింపును ప్రభుత్వం పరోక్షంగా చేసేందుకు ప్రయత్నిస్తోందని పిటిషనర్లు ఆందోళన చెందుతున్నారని గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో పిటిషన్లను విచారణ కోసం త్రిసభ్య ధర్మాసనం ముందు ఉంచాలా? లేక సింగిల్ జడ్జి విచారణ జరపాలా? అనే విషయంపై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ ధర్మాసనం నిర్ణయాన్ని వాయిదా వేసింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ పేరుతో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు ముసుగులో ప్రభుత్వ కార్యాలయాల విశాఖకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటూ అమరావతి పరిరక్షణ సమితి మేనేజింగ్ ట్రస్టీ గద్దె తిరుపతిరావు, రాజధాని రైతులు మాదాల శ్రీనివాసరావు, వలపర్ల మనోహరం పిటిషన్ దాఖలు చేశారు. ఇదే వ్యవహారంపై రాజధాని రైతు పరిరక్షణ సమితి కార్యదర్శి ధనేకుల రామారావు, అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య సొసైటీ ఉపాధ్యక్షుడు కల్లం రాజశేఖర్‌రెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై ఇటీవల విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. వ్యాజ్యాలపై తగిన బెంచ్ విచారణ చేపట్టేవరకు ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలించవద్దని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన అప్పీల్ శుక్రవారం విచారణకు రాగా అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యాలను విచారణ కోసం త్రిసభ్య ధర్మాసనం ముందు ఉంచాలన్న తమ అభ్యర్థనను అంగీకరిస్తూనే సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను అమరావతి నుంచి విశాఖకు తరలించడం లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని సమీక్షించేందుకు సీఎంవోను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమీక్షల నిమిత్తం విశాఖకు వెళ్లే అధికారుల వసతి, ఆఫీసుల కోసం స్థలాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలను విశాఖకు తరలిస్తున్నామని పిటిషనర్లు తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సడలించాలని అభ్యర్థించారు. రాజధాని రైతుల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ... వ్యాజ్యాలపై సింగిల్ జడ్జి లేదా త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపినా తమకు అభ్యంతరం లేదన్నారు. మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించాలని అభ్యర్థించారు.



ఎస్టీయూ వజ్రోత్సవ సభలో ప్రసంగిస్తున్న జస్టిస్ ఎన్.వి.రమణ

గురువులు జాతి నిర్మాణానికి తోడ్పడాలి

- విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలి
- తల్లిదండ్రులు కార్పొరేట్ విద్య నుంచి బయటపడాలి
- ఎస్టీయూ వజ్రోత్సవ సభలో జస్టిస్ ఎన్.వి.రమణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 12: బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ పేర్కొన్నారు. ఉత్తమ జాతి నిర్మాణానికి గురువులు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. కర్నూలు ఎగ్జిబిషన్ మైదానంలో శుక్రవారం జరిగిన ఎస్టీయూ వజ్రోత్సవాలకు జస్టిస్ ఎన్.వి.రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సామాజిక స్పృహ, సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలను చైతన్యవంతులను చేసి వారిలో ఎస్టీయూ ఉద్యమస్ఫూర్తిని చాటిందన్నారు. అందుకే ఈ సంఘానికి ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. వీధి బడిలో చదువుకుని దేశ అత్యున్నత న్యాయమూర్తి స్థానానికి ఎదగడం పట్ల గర్వపడుతున్నట్టు జస్టిస్ ఎన్.వి.రమణ తెలియజేశారు. ప్రస్తుతం ప్రపంచమంతా కార్పొరేట్ వ్యవస్థగా మారిందని.. తల్లిదండ్రులు తమ బిడ్డలను ఇంజనీరుగానో, డాక్టర్‌గానో చూడాలని తాపత్రయపడుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్య ప్రవేశంతో ప్రభుత్వ విద్యకు ప్రాముఖ్యం తగ్గిందని, ఈ క్రమంలో ప్రభుత్వ బడులను మూసివేసే దౌర్భాగ్యస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ బడుల్లో ఐదోతరగతి చదివే పిల్లలు రెండంకెల సంఖ్య కూడా సక్రమంగా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఆంగ్ల మాధ్యమంలో చదివితేనే ఇతర దేశాల్లో రాణిస్తారనే అపోహ విడనాడాలని సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు వేమన, సుమతి శతకాలు కంఠస్థం చేయించాలని కోరారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే పవిత్ర బాధ్యత ఉన్న సేవకులు ఉపాధ్యాయులని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఉపాధ్యాయులకు పాఠ్యాంశాల సిలబస్‌ను తయారు చేయడం లేదన్నారు. సిలబస్‌ను అపరమేధావులు తయారు చేస్తే వీరు బోధిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం విక్రయానికి మరోసారి వేలం

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న 381.377 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం దుంగలను విక్రయించడానికి ఈనెల 24న గ్లోబల్ టెండర్ల ద్వారా అటవీ శాఖ తొలి విడత ఈ-ఆక్షన్ నిర్వహించనుంది. వేలంలో దుంగలు మిగిలితే ఈనెల 31న మరోసారి వేలం నిర్వహించడానికి అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

బడుగులపై పెత్తనం!

(మొదటి పేజీ తరువాయి)

దళిత, గిరిజన నేతలు చేయించుకోవలసి వస్తోంది. సీట్ల సర్దుబాట్లలో ఈ వర్గాల ఎమ్మెల్యేలు, మంత్రుల అభిప్రాయాలకు విలువివ్వకపోవడంతో వారు బయటకు వచ్చి అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. మంత్రులు కూడా జీ హుజూర్ అన్న పరిస్థితి ఏర్పడిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అసెంబ్లీలో 29 సీట్లు ఎస్సీలకు, 7 ఎస్టీలకు రిజర్వు అయి ఉన్నాయి. గత ఎన్నికల్లో ఎస్టీ స్థానాలు మొత్తం వైసీపీ గెలుచుకోగా.. ఎస్సీ స్థానాల్లో వైసీపీ 27, టీడీపీ, జనసేన చెరొకటి గెలుచుకున్నాయి. రాజోలు జనసేన ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వైసీపీ చెంతకు చేరారు. దీంతో ఆ పార్టీకి 28 ఎస్సీ స్థానాలు ఉన్నట్లు లెక్క.

వారు సూపర్ ఎమ్మెల్యేలు..

జగన్‌కు దగ్గరగా ఉన్న నలుగురు పెద్దలే ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్టీ నియోజకవర్గాలకు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తున్నారు. విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అయన తనయుడు విక్రాంత్‌రెడ్డితో పాటు ఆయా ప్రాంతాల్లో ఇతర నాయకులు సూపర్ ఎమ్మెల్యేలుగా ఉన్నారని వాపోతున్నారు. మన్యం జిల్లా పార్వతీపురంలో ఎమ్మెల్యే పాత్ర నామమాత్రంగా మారింది. అక్కడ విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఏం చెబితే అదే జరగాలి తప్ప ఎమ్మెల్యేకు ఎలాంటి అధికారాలు ఉండవని చెబుతున్నారు. అరకు లోయ నియోజకవర్గంలోనూ విక్రాంత్‌రెడ్డి, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుంభా రవిబాబు పెత్తనమే సాగుతోందని సమాచారం. విక్రాంత్‌రెడ్డి హవా పాడేరు, పాలకొండలోనూ కొనసాగుతోంది. కురుపాం స్థానంలో మాజీ మంత్రి పుష్పశ్రీవాణి భర్త శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, వైవీ సుబ్బారెడ్డి కనుసన్నల్లో పాలన జరుగుతోందంటున్నారు. రంపచోడవరంలో విజయసాయిరెడ్డి, ఇటీవల దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబులదే పెత్తనం. సాలూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉపముఖ్యమంత్రి రాజన్నదొర సైతం విక్రాంత్‌రెడ్డి కనుసన్నల్లో పనిచేయాల్సి వస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పోలవరంలో మిథున్‌రెడ్డి ఆధిపత్యమే కొనసాగుతోంది.

ఆ మూల నుంచి ఈ మూల దాకా..

ఎస్సీ స్థానాల్లో రాజాంలో వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి పెత్తనమే సాగుతోంది. తాడికొండలో సైతం మొన్నటి వరకు ఉండవల్లి శ్రీదేవి కూడా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో మెలగాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పటికీ ఆ నియోజకవర్గంలో ఏ పనులు జరగాలన్నా ఆయన చేతుల మీదుగానే జరగాలి. సంతనూతలపాడు నియోజకవర్గంలోనూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పెత్తనం నడుస్తోంది. మంత్రి మేరుగ నాగార్జున ప్రాతినిధ్యం వహిస్తున్న వేమూరులో కూడా సజ్జల, విజయసాయిరెడ్డి హవాయే నడుస్తోంది. పురపాలక మంత్రి ఆదిమూలపు సురేశ్ యర్రగొండపాలెం ఎమ్మెల్యే ఆయన బాలినేని, ఉడుముల శ్రీనివాసరెడ్డి కింద పనిచేయాల్సి వస్తోంది. నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఓ మాజీ సీనియర్ పోలీసు అధికారి ఉన్నప్పటికీ అక్కడ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హవా సాగుతోంది. కోడుమూరు నియోజకవర్గంలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, శింగనమల, మడకశిరలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనం చేస్తున్నారు. బద్వేల్‌లో అజమాయిషీ మొత్తం ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డిదే. గూడూరు ఎమ్మెల్యేగా రిటైర్ ఐఏఎస్ అధికారి వరప్రసాదరావు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో సైతం వైసీపీ నేతలు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, శివరామిరెడ్డి స్వారీ చేస్తున్నారు. సత్యవేడులో పెద్దిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, విజయానందరెడ్డి మాటకు తిరుగులేదు. సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్యపై పెద్దిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పెత్తనం సాగుతోంది. రైల్వేకోడూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్న కొరుముట్ల శ్రీనివాసులు సీనియర్ ఎమ్మెల్యే. ఆయన కూడా ఎంపీ మిథున్‌రెడ్డి సలహా తీసుకోవలసి వస్తోంది. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేగా ఉన్న ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి సైతం స్వతంత్రుడేమీ కాదు. ఈ నియోజకవర్గంలో పెద్దిరెడ్డి, ఎన్ఆర్ఐ సలహాదారు జ్ఞానచంద్రారెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి హవానే నడుస్తోంది. పూతలపట్టులోనూ పెద్దిరెడ్డి పెత్తనమే. గొల్ల బాబూరావు ఎమ్మెల్యేగా ఉన్న పాయకరావుపేటలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి చెప్పినట్లే జరగాలి. మంత్రి పినిపె విశ్వరూప్ ప్రాతినిధ్యం వహిస్తున్న అమలాపురంలో, తూర్పుగోదావరి జిల్లా పి.గన్నవరం, రాజోలులోనూ మిథున్‌రెడ్డి హవా సాగుతోంది. కొవ్వూరు నియోజకవర్గానికి హోం మంత్రి తానేటి వనిత ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఇక్కడ, గోపాలపురం, చింతలపూడిలో కూడా మిథున్‌రెడ్డి పెత్తనమే. పామర్రు, నందిగామ, తిరువూరు, ప్రత్తిపాడులో సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో పాలన సాగుతోంది. ప్రత్తిపాడులో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి కీలక భూమిక పోషిస్తున్నారు.

ఆ ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలే

- కాళ్ల దగ్గర పడిఉండేవాళ్లకే జగన్ దన్ను: ఆనంద్‌బాబు

రాష్ట్రంలో 36 ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో జగన్ నియమించిన షాడోలే పెత్తనం చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీలోని దళిత, గిరిజన ఎమ్మెల్యేలు, ఆఖరుకు మంత్రుల పరిస్థితి కూడా ఉత్సవ విగ్రహాల మాదిరిగానే ఉందన్నారు. గోదావరి జిల్లాల్లో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తానే సర్వం అంటున్నారని, ఉత్తరాంధ్ర దళిత, గిరిజన ఎమ్మెల్యేలపై విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి అజమాయిషీ ఎక్కువైందన్నారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల పరిధిలో అటవీ, ఖనిజ సంపద దోచేసే పనిలో విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి ఉన్నారని పేర్కొన్నారు. శింగనమల ఎమ్మెల్యే పద్మావతి ఇటీవల తన నియోజకవర్గంలో పెద్దిరెడ్డి పెత్తనమేంటని వాపోయారన్నారు. టీడీపీలో దళిత, గిరిజన నాయకులు తలెత్తుకుని తిరుగుతుంటే వైసీపీలో చేతులు కట్టుకుని తలదించుకుని బతుకుతున్నారని తెలిపారు. వైసీపీలోని దళిత, గిరిజనులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని పిలుపునిచ్చారు. నోటిదూల ఉన్నవాళ్లను, కాళ్ల దగ్గర పడి ఉన్న వాళ్లనే జగన్ వచ్చే ఎన్నికల్లో కొనసాగిస్తారని పేర్కొన్నారు.

ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా

- అమ్మ మొగుడు అన్నది కడపలో బూతు కాదు
- పోలీస్ ఎస్పీని కాదు... ఎక్సైజ్ ఎస్పీని ఉద్దేశించి అన్నా: రాచమల్లు

ప్రొద్దుటూరు, జనవరి 12: 'ఎస్పీ అమ్మ మొగుడికి చెప్పుకో' అని ఎస్ఈబీ అధికారులపై చేసిన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "మూడు బాటిళ్లకంటే ఎక్కువ మద్యం తీసుకెళుతుంటే నేరంగా పరిగణించి కేసు పెట్టడం తప్పు అన్నది నా ఉద్దేశం. దానిపై నిన్న మాట్లాడినదానికీ, ఈ రోజుకూ ఏ మార్పూ లేదు. ఆ చట్టమే తప్పు. దాన్ని సవరించాలి. అది పేద ప్రజలను, మద్యం ప్రియులను అసౌకర్యానికి గురిచేస్తోంది. కేసులు పెట్టాలని ఉన్నతాధికారులైన ఎస్పీ, ఏఎస్పీ నుంచి ఒత్తిళ్లు ఉన్నాయని ఎస్ఐ ఆలీబేగ్ అన్న మాటకు స్పందనగా.. 'ఎస్పీకి కాదు... వాళ్లమ్మ మొగుడు చెప్పినా నేను ఇలాంటి కేసులు పెడితే ఊరుకోను. మీ స్టేషనుకు వచ్చి ప్రశ్నిస్తా' అని అన్నాను. అమ్మ మొగుడు అన్న పదం కడప జిల్లాలో బూతు కాదు. అయినా సామాన్యుడు మాట్లాడితే తప్పులేదు కానీ బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి అనడం సరికాదు. నా వ్యాఖ్యలతో వారు బాధపడి ఉంటే మనఃస్ఫూర్తిగా మన్నించమని కోరుతున్నా. అదికూడా పోలీసు శాఖ ఎస్పీని కాదు... ఎక్సైజ్ ఎస్పీని ఉద్దేశించి అన్నా. ఈ అంశంపై అసెంబ్లీలోనూ మాట్లాడతా" అని రాచమల్లు అన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన

- ప్రభుత్వానికి ఏపీ రెవెన్యూ జేఏసీ హెచ్చరిక

విజయవాడ(ధర్నాచౌక్), జనవరి 12: వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని ఏపీ రెవెన్యూ జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సీసీఎల్ఏ అడిషనల్ కమిషనర్ ఇంతియాజ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ మాట్లాడుతూ.. వీఆర్‌ఏలకు పే స్కేల్ లేదా రూ.21 వేల వేతనం ఇవ్వాలని, నామినీ అర్హత మేరకు వీఆర్వోగా ప్రమోషన్లు ఇవ్వాలని ఆయన కోరారు.



సంక్రాంతి వేడుక సభలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

ప్రకృతి సంరక్షణే నిజమైన దేశభక్తి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ఉంగుటూరు, జనవరి 12: ప్రకృతిని కాపాడుకోవడమే నిజమైన దేశభక్తి అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ప్రకృతిని ప్రేమించటం, ప్రకృతితో కలిసి జీవించటమే మన సంస్కృతి అని స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్‌ట్రస్ట్ విజయవాడ చాప్టర్‌లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో సంబరాలను ప్రారంభించారు. కుటుంబసభ్యులు, ఆత్మీయులు, సన్నిహితులు, మిత్రులతో కలసి ఆయన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ప్రాంగణంలోని వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అయన మాట్లాడుతూ, ప్రకృతి వనరులను భావితరాలకు సుసంపన్నంగా అందించాల్సిన అవసరం వుందని, ఇదే నిజమైన దేశభక్తి అని చెప్పారు. తెలుగువారి పెద్దపండుగ అయిన సంక్రాంతి ప్రకృతితో మమేకమైన పండుగ అని అన్నారు. సాంప్రదాయాన్ని, సంస్కృతీ వైభవాన్ని ఆచరణాత్మకంగా చూపే ఈ పండుగ వేడుకలను కుటుంబసభ్యులు, బంధుమిత్రుల ఆత్మీయ కలయికతో స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కేంద్ర పర్యాటకశాఖామంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం ఈ నెల 22న ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ సంక్రాంతి హిందువులందరికీ ఎంతో ప్రత్యేకమని, ప్రతి ఒక్కరి జీవితంలో క్రాంతి నింపాలని ఆకాంక్షించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, సంస్కృతీ, సాంప్రదాయలు, ఆచార వ్యవహారాల మేళవింపే సంక్రాంతి పండుగ అన్నారు. అనంతరం ప్రముఖులు, ఆత్మీయులను వెంకయ్యనాయుడు సత్కరించారు.

ఎంపీ రఘురామకు ఊరట

- చట్టనిబంధనలు పాటించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజుకు హైకోర్టులో ఊరట లభించింది. ఎంపీ రఘురామ విషయంలో.. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో పాటు బొల్లినేని రాజగోపాల్ కేసులో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను తూ.చ. తప్పకుండా పాటించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి శుక్రవారం తీర్పు ఇచ్చారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలను కలుసుకొనేందుకు రాష్ట్రానికి వస్తున్న తనను పోలీసులు తప్పుడు కేసు పెట్టి అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని, చట్ట నిబంధనలు పాటించేలా వారిని ఆదేశించాలని కోరుతూ రఘురామ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై గురువారం వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి శుక్రవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

16న శ్రీసత్యసాయి జిల్లాకు ప్రధాని

- నాసిన్ అకాడమీని ప్రారంభించనున్న పీఎం మోదీ

గోరంట్ల, జనవరి 12: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటైన నేషనల్ ఆకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్‌ను(నాసిన్) ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. జాతీయ రహదారి పక్కన 503 ఎకరాల విస్తీర్ణంలో, రూ.1,500 కోట్ల వ్యయంతో నాసిన్ ఏర్పాటుకు 2022 మార్చి 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భూమి పూజ చేశారు. ప్రారంభం అనంతరం 1987 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారులతో ప్రధాని సమావేశమవుతారని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రజలే తేలుస్తారు!

మహారాష్ట్ర స్పీకర్ రాహుల్ నర్వేకర్ తీసుకున్న నిర్ణయం అనూహ్యమైనదేమీ కాదు. ఏక్‌నాథ్ షిండే వర్గానికి వ్యతిరేకంగా నిర్ణయం చేసి ప్రభుత్వాన్ని స్పీకర్ ప్రమాదంలో పడేస్తారని ఎవరూ అనుకోరు. షిండేను నిలబెడుతూనే, ఆయనదే అసలుసిసలు శివసేన అనీ, ఆయనకే అత్యధికుల మద్దతు ఉన్నదని నిర్ణయిస్తూనే, ఉద్ధవ్‌ఠాక్రే వెంట ఉన్న ఎమ్మెల్యేల జోలికి పోకుండా స్పీకర్ తెలివిగా వ్యవహరించారు. అధికారపక్షం ప్రయోజనాలను పరిరక్షించడం వినా, సర్వస్వతంత్రంగా స్పీకర్ వ్యవహరించడం చరిత్రలో చాలా అరుదు.

సుప్రీంకోర్టు వెంటపడగాపడగా ఎట్టకేలకు ఈ నిర్ణయం జరిగింది. ఇప్పుడు సుప్రీంకోర్టును, ఎన్నికల కమిషన్‌ను ఊతం చేసుకొని ఈ నిర్ణయానికి వచ్చిన స్పీకర్‌కు రెండువర్గాల్లో ఏది నిజమైన శివసేనో తేల్చడానికి ఏడాదిన్నర ఎందుకన్నది ప్రశ్న. జనవరి 10 గడువే లేకుంటే ఆయన ఈ వ్యవహారాన్ని తేల్చకుండా వదిలేసేవారేమో. స్పీకర్ నిర్ణయం ఉద్ధవ్ ఠాక్రేకు ఎదురుదెబ్బే కానీ, ఆయన ఇప్పటికే చాలా ఎదురుదెబ్బలు తిన్నారు. బహుశా ఉద్ధవ్ కూడా స్పీకర్ భిన్నమైన నిర్ణయం చేస్తారని అనుకొని ఉండకపోవచ్చు. ఏక్‌నాథ్‌షిండేదే అసలైన శివసేన అని స్పీకర్ నిర్ణయించినప్పుడు మా వర్గం ఎమ్మెల్యేలను ఎందుకు శిక్షించలేదు? అన్న ప్రశ్న సముచితమైనది. మళ్ళీ సుప్రీంకోర్టుకు పోతానని కూడా ఉద్ధవ్ అంటున్నారు. గతంలో సుప్రీంకోర్టు, ఆ తరువాత ఎన్నికల కమిషన్ చేసిన నిర్ణయాలు ఆయనకు వ్యతిరేకంగానే ఉన్నాయి. మీకు మీరుగా రాజీనామా చేసి దిగిపోయారు కానీ, లేకుంటే మిమ్మల్నే తిరిగి అధికారంలో కూచోబెట్టేవాళ్ళం అన్న భావనతో తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు, తిరిగి అధికారం దక్కకపోయినా ఉద్ధవ్‌కు మిగిలిన ఉపశమనం.

మహారాష్ట్రలో దశాబ్దాలుగా శివసేన బలమైన, ఎదురులేనిశక్తి. బీజేపీతో కలిసినడవడం, నిలబెట్టడం తప్ప తానే అధికారం చేపట్టాలనుకోవడంతో ఈ చిక్కంతా వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల తరువాత, ముఖ్యమంత్రి పీఠంమీద పేచీ వచ్చి బీజేపీతో తెగదెంపులు చేసుకొని, కాంగ్రెస్, ఎన్‌సిపిలతో కలసి ఉద్ధవ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఓ సాహసం. ఈ తిరుగుబాటును కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సహజంగానే సహించలేకపోయింది. మెజారిటీ సభ్యులను వెంటతెచ్చుకొని షిండే నిర్వహించిన చీలిక, ఈ విషయంలో మాకేపాపం తెలియదంటూనే ఆయనతో బీజేపీ వచ్చిచేరడం అందరికీ తెలిసిందే. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన ఆ తిరుగుబాటు చరిత్రలో ఎన్నటికీ చెరిగిపోకుండా బీజేపీ నాయకులు ఎప్పటికప్పుడు మనకు గుర్తుచేస్తూనే ఉన్నారు. విపక్షపాలిత రాష్ట్రాల్లో ఇక్కడా ఓ షిండే పుట్టుకొస్తాడు, మీకూ అదేగతి పడుతుందని హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు.

ఎన్నికలు ముంచుకొస్తున్నవేళ ఉద్ధవ్ వర్గాన్ని మరింత దెబ్బతీయడం రాజకీయంగా సరికాదన్నది స్పీకర్ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తున్నది. ఫడ్నవీస్‌ను పక్కనబెట్టి, షిండేను ముఖ్యమంత్రి చేయడం ద్వారా బీజేపీ వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. కానీ, ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం, స్పీకర్ నిర్ణయాలతో ప్రభుత్వం మనుగడ ముడిపడడంతో, మహావికాస్ అగాడీని మరింత అగాధంలోకి నెట్టేస్తూ, ఎన్సీపీని చీల్చి అజిత్ పవార్ అధికారపక్షంలోకి వచ్చిచేరారు, ఉన్నతపదవులు అందుకున్నారు. ద్రోహం, నయవంచన అంటూనే శరద్‌పవార్ ఈ తిరుగుబాటును ఆశీర్వదించారని అత్యధికుల అనుమానం. చీలికలు, చేరికలతో, ఈడీలు, బేడీలతో అధికారాన్ని, అవసరమైన సంఖ్యాబలాన్ని సమకూర్చుకున్నా, అంతిమంగా ప్రజాక్షేత్రంలో పరీక్షకు నిలవకతప్పదు. ఈ ఏడాది తొలిభాగంలో సార్వత్రిక ఎన్నికలను, రెండోసగంలో అసెంబ్లీ ఎన్నికలను ఈ అసలుసిసలు శివసేన ఎదుర్కోబోతోంది. ఉద్ధవ్‌ను ఎందరు వెన్నుపోటు పొడిచినా, సంఖ్యాబలంలో ఎంత బలహీనపడినా, ప్రజలు ఆయనతో ఉన్నారని, సగానికి సగం లోక్‌సభ స్థానాలు గెలుచుకుంటారని సర్వేలు చెబుతున్నాయి. స్పీకర్ నిర్ణయాన్ని ఉద్ధవ్ ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తారు. అజిత్‌పవార్ వర్గంపైనా ఇలాంటి పిటిషన్ పరిష్కారం కోసం ఎదురుచూస్తోంది కనుక ఈనెలాఖరులోగా అదీ తేలుతుంది. రెండేళ్ళుగా సాగిన అన్ని పరిణామాలమీదా కొద్దినెలల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు ఉద్ధవ్, ఆయన కుమారుడి రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

ధర్మమేవ జయతే

'భయం లేకుండా జీవించేందుకు నాకు గల హక్కును మళ్లీ నాకు ఇచ్చివేయండి'
— బిల్కిస్ బానో

ఆగస్టు 28, 2022న ఇదే కాలమ్‌లో నేను ఇలా రాశాను: 'మానవ ఆవేదనను ఎలా అర్థం చేసుకోగలం? క్షుభిత మనసు నుంచి, బాధాతప్త హృదయం నుంచి వెలువడే ఆవేదనను అత్యంత హేయమైన దురాగతానికి గురైన, జీవిత హుందా కాలరాచివేత జరిగిన, దుఃఖమూర్తి అయిన బిల్కిస్ బానో అనే తల్లి కంటే ఎవరు మానవ ఆవేదనను మెరుగ్గా వ్యక్తం చేయగలరు? దానిని అర్థం చేసుకోవడం లేదా చేసుకోలేక పోవడమనేది మనలోని మానవతకు ఒక గీటురాయి. లక్షలాది పేదలు, వివక్షకు గురవుతోన్న, అణచివేతకు సంఖ్యానేక పౌరుల అవ్యక్త వేదనను సహజమైన, అయితే హృదయ విదారకమైన మాటల్లో బిల్కిస్ బానో క్లుప్తంగా ఎలా వ్యక్తం చేశారో ఈ కాలమ్ ఆరంభంలోనే ఉటంకించాను. అవే మాటలను మళ్లీ ఉటంకిస్తాను: 'భయం లేకుండా జీవించేందుకు నాకు గల హక్కును మళ్లీ నాకు ఇచ్చివేయండి'.



■ పి. చిదంబరం
'పళని' పలుకు

బిల్కిస్ బానో కథలో మొదటి భాగాన్ని చెప్పవలసి ఉంది. ఆ మాటకొస్తే మళ్లీ మళ్లీ చెప్పవలసి ఉంది. 2002లో ఒక రైలు బోగీ లోని ప్రయాణికులు మంటల్లో దగ్ధమైన తరువాత గుజరాత్‌లో కనీవినీ ఎరుగని హింసాకాండ ప్రజ్వరిల్లింది. 21 ఏళ్ల బిల్కిస్ బానో వివాహిత. మూడేళ్ల కుమార్తె ఉన్నది. ఘటన సమయంలో మళ్లీ గర్భిణీగా ఉన్నది. ఆ హింసాకాండలో ఒక మూక ఆమెపై దాడి చేసింది. మూడేళ్ల కుమార్తెతో సహా బిల్కిస్ కుటుంబసభ్యులు ఏడుగురిని ఆమె కళ్ల ఎదుటే హతమార్చారు. అనంతరం ఆ దౌర్జన్యకారులు ఆమెపై సామూహిక అత్యాచారం చేశారు. ఆ భయానక అమానుషత్వం నుంచి బిల్కిస్ బతికి బైటపడ్డారు. తన విషాద కథను ప్రపంచానికి వెల్లడించారు.

ఆమెపై దురాగతానికి పాల్పడిన ముష్కరులపై గ్రేటర్ ముంబై కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి విచారణ జరిపారు. జనవరి 21, 2008న వెలువరించిన తీర్పు 11 మందిని దోషులుగా నిర్ధారిస్తూ వారికి యావజ్జీవ శిక్ష విధించింది. ఆగస్టు 15, 2022న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భారత నారీ శక్తికి దేశ ప్రజలు అందరూ గర్వించాలని ఉద్బాటించారు. ఆయన ఈ మాటలు అన్న కొద్ది గంటల అనంతరమే అదే రోజున గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం బిల్కిస్ బానో కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న 11 మందికి మిగతా శిక్షా కాలాన్ని రద్దు చేసి వారిని జైలు నుంచి విడుదల చేసింది! అలా స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చిన ఆ 11 మంది ఎటువంటి పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేయలేదు. మౌనంగా తమ కుటుంబాల వద్దకు వెళ్లలేదు. కొంతమంది ఆ 11 మందిని ఘనంగా స్వాగతించారు. పూలమాలలు వేసి సత్కరించారు. మిఠాయిలు తినిపించారు. స్వాగతం పలికిన వారిలో కొంత మంది భక్తిప్రపత్తులతో ఆ దోషులకు సాష్టాంగ నమస్కారాలు చేశారు!



పౌరుల గౌరవం, స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, మానవహక్కులు నిర్దయంగా ఉల్లంఘింపబడ్డాయని బిల్కిస్ బానో కేసు నిర్ధారించింది. ఆ ఉల్లంఘనలకు పాల్పడిన వారిని, అందుకు సహకరించిన వారిని శిక్షించే నిజాయితీపరులైన పోలీసధికారులు, ధైర్యం గల న్యాయమూర్తులూ ఉన్నారని కూడా ఆ కేసు స్పష్టం చేసింది. మన జీవితావరణాన్ని అంతులేని నైరాశ్యం, నిరుత్సాహం కమ్మివేస్తున్నప్పటికీ ఆశకు భరోసా ఉన్నది, సమస్యల చీకట్లను పారద్రోలే న్యాయ వెలుగులూ ఉన్నాయని సుప్రీంకోర్టు తీర్పు అభయమిచ్చింది.

బిల్కిస్ బానో కథ రెండో భాగం కోర్టుల గురించి. జనవరి 8, 2024న భారత సర్వోన్నత న్యాయస్థానం ఒక చరిత్రాత్మక తీర్పులో గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేస్తూ సదరు 11 మంది దోషులు మళ్లీ జైలుకు వెళ్లాలని ఆదేశించింది. ఈ కాలమ్, ఆ దోషులకు న్యాయ విరుద్ధంగా లభించిన ఉపశమనం గురించికాదు; చట్టబద్ధ పాలన, చట్టం, మానవహక్కుల పరస్పర ప్రభావానికి సంబంధించిన విశాల అంశాల గురించి.

సుప్రీంకోర్టు తీర్పులోని కొన్ని అంశాలను క్లుప్తంగా పేర్కొంటాను: ఒక మహిళ సామాజిక హోదా ఏమయినప్పటికీ ఆమెను గౌరవించి తీరాలి...; నిందితుల జాడ తెలియ లేదని దర్యాప్తు సంస్థ కేసు మూసివేత నివేదికలో పేర్కొంది. ఆ నివేదికను జుడీషియల్ మెజి[illegible] అంగీకరించారు...; బిల్కిస్ బానో కేసుపై మళ్లీ దర్యాప్తు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ దర్యాప్తు బాధ్యతను సిబిఐకి అప్పగించాలని ఆదేశించింది; 4 మే, 2017న బాంబే హైకోర్టు వెలువరించిన తీర్పు 11 మంది దోషులకు విధించిన యావజ్జీవ శిక్షను సమర్థించింది; తనను శిక్షా కాలం పూర్తికాకముందే విడుదల చేయాలన్న ప్రతివాది నెంబర్ 3 అప్లికేషన్ ప్రకారం ఆ వ్యవహారాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని గుజరాత్ హైకోర్టు 17 జూలై, 2019న ఒక ఉత్తర్వులో పేర్కొంది; మే 13, 2022న సుప్రీంకోర్టు తన తీర్పులో పిటీషనర్ రాధేశ్యామ్ షా అప్లికేషన్‌ను 9 జూలై, 1992న జారీచేసిన విధానం ప్రకారం పరిశీలించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది; 26 మే, 2022న గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ జైల్ సలహా మండలి సమావేశం జరిగింది. సదరు 11 మంది దోషుల మిగతా శిక్షా కాలాన్ని రద్దు చేసి, వారిని విడుదల చేయాలని సిఫారసు చేసింది; గోధ్రా సెషన్స్ జడ్జి 1992 నాటి విధానం ప్రకారం ఆ అప్లికేషన్‌ను పరిశీలించి అనుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు; 11 జూలై, 2022న రాసిన ఒక లేఖలో హోం మంత్రిత్వ శాఖ 11 మంది దోషుల శిక్షను రద్దుచేసి, వారిని విడుదల చేసేందుకు తన అనుమతిని తెలిపింది.

జనవరి 8, 2024న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులో, శిక్షా కాలం రద్దుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగిన తీరు, మే 13, 2022న సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు ప్రకారం లేదని అభిప్రాయపడింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేసి తనను విడుదల చేయాలని ఒకే ఒక్క దోషి (రాధేశ్యామ్ షా) విజ్ఞప్తి చేయగా మిగతా పది మంది ఖైదీల విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని అందరినీ విడుదల చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది. మహారాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశంపై గుజరాత్ ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకున్నదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బిల్కిస్ బానో కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేయడం ద్వారా ఒక చట్ట విరుద్ధ పనిలో గుజరాత్ ప్రభుత్వం భాగస్వామి అయిందని సుప్రీంకోర్టు నిష్కర్షగా చెప్పింది.

బిల్కిస్ బానో కథలో మూడో భాగం భారత పౌరులకు సంబంధించినది. పౌరుల గౌరవం, స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, మానవహక్కులు నిర్భయంగా ఉల్లంఘింపబడ్డాయనేది బిల్కిస్ బానో కేసు నేర్పిన పాఠాలలో ప్రధానమైనది. అయితే ఆ ఉల్లంఘనలకు పాల్పడిన వారిని, అందుకు సహకరించిన వారిని శిక్షించే సాహసిక పోలీసధికారులు, తెగువ గల న్యాయమూర్తులు కూడా ఉన్నారని బిల్కిస్ బానో కేసు స్పష్టం చేసింది. అటువంటి హేయ నేరాలకు పాల్పడిన వారితో రాజ్య వ్యవస్థ కుమ్మక్కువవచ్చు. తమకు తగని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వారు న్యాయవిరుద్ధంగా పొందేందుకు రాజ్యం సహాయపడవచ్చు. జరిగింది అదే కాదూ? ఆ నేరాలకు పాల్పడిన ఘరానా వ్యక్తులు న్యాయస్థానాలనే దగా చేయగలరు. న్యాయ నిర్ణయంలో న్యాయమూర్తులు ఘోరంగా పొరపడవచ్చు. అయితే ప్రజలు ఉదాసీనంగా ఉండబోరు. ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తారు. జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు ఇతర న్యాయమూర్తులను ప్రజల ప్రతిస్పందనలు తప్పక పురిగొల్పుతాయి. నిష్పాక్షికుడు అయిన న్యాయమూర్తి తీర్పు వెలువరిస్తాడు. సర్వత్రా న్యాయపాలన కచ్చితంగా అమలులోకి వస్తుంది. 'నేను మళ్లీ ఊపిరిపీల్చుకున్నట్టు అనిపిస్తోంది' అన్న బిల్కిస్ బానో మాటలు ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. మన జీవితావరణాన్ని అంతులేని నైరాశ్యం, నిరుత్సాహం కమ్మివేస్తున్నప్పటికీ ఆశకు భరోసా ఉన్నది, సమస్యల చీకట్లను పారద్రోలే న్యాయ వెలుగులూ ఉన్నాయి.


(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

దండావతే: విలువల వెలుగుబాట

విలువలు వెలుగుదారులు. మధు దండావతే మనం మరచిపోయిన ఒక వెలుగుబాట. భారతీయ సామ్యవాద సంప్రదాయం ఇప్పుడు అవసాన దశలో ఉందేమో గానీ అది ఒకప్పుడు రాజకీయాలు, సమాజంపై ప్రగాఢ, ఆరోగ్యప్రదమైన ప్రభావాన్ని నెరపింది. మరి సోషలిస్టు భావజాలం ప్రభావ ప్రాబల్యాలు, ప్రగతిశీల క్రియాశీలత గురించి ఇప్పుడు ఎంతమందికి తెలుసు? కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ప్రాంతీయ పార్టీలు, అంబేడ్కరైట్స్ (ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాలలో) జనసంఘ్, బీజేపీ... అన్ని పార్టీలకు వాటి వాటి సొంత చరిత్రకారులు ఉన్నారు. భజనపరులూ ఉన్నారు. తమ తమ నాయకుల జీవితచరిత్రలు, సైద్ధాంతిక సంప్రదాయాల పుట్టుపూర్వోత్తరాల గురించి చాలా పెద్ద పెద్ద పుస్తకాలు రాశారు, ఇంకా రాస్తున్నారు. మరి మన సోషలిస్టుల విషయమేమిటి? ఎందుకు వారిని ఉపేక్షిస్తున్నారు? భారతీయ చరిత్రకారులు నాడే కాదు, ఈనాడు కూడా సోషలిస్టులను పెద్దగా పట్టించుకోవడం లేదు.

సోషలిస్టులను గుర్తు చేసుకోవడానికి ఇది సరైన సమయం. వారి ఉత్కృష్ట ప్రతినిధి ఒకరి శత జయంతి ఇదే నెలలో జరగనున్నది. మధు దండావతే గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 21 జనవరి, 1924న ఆయన జన్మించారు. బొంబాయిలో విద్యార్థిగా యువ దండావతే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ (సిఎస్‌పి) సిద్ధాంతాలు, ఆ పార్టీ నాయకులు జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా, యూసఫ్ మెహరాలీల వ్యక్తిత్వాలతో ప్రభావితుడయ్యాడు. ఆర్థిక న్యాయం, మహిళా హక్కులు మొదలైన అంశాలపై కాంగ్రెస్ ప్రధాన స్రవంతి నాయకత్వ మితవాద వైఖరిని సిఎస్‌పి హర్షించలేదు. అదే సమయంలో సోవియట్ యూనియన్‌కు విధేయులుగా ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీతో కూడా సోషలిస్టులు విభేదించారు. సోషలిస్ట్/కమ్యూనిస్ట్ వైఖరులలో వ్యత్యాసం 1942లో క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో స్పష్టంగా బహిర్గతమయింది. సోషలిస్టులు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనగా కమ్యూనిస్టులు ఆ మహోజ్వల పోరాటాన్ని వ్యతిరేకించారు. సైద్ధాంతికంగా కూడా సోషలిస్టులు మూడు అంశాలపై కమ్యూనిస్టులతో తీవ్రంగా విభేదించారు. అవి: 1) కమ్యూనిస్టులు స్టాలిన్‌ను ఆరాధించారు; సోవియట్ రష్యా నిర్ణయాలను ఔదలదాల్చారు. సోషలిస్టులు సహేతుకంగానే స్టాలిన్‌ను నియంతగా పరిగణించారు, రష్యా ఒక నియంతృత్వ వ్యవస్థ అని భావించారు; 2) లక్ష్యసాధనకు హింసాత్మక పద్ధతులను అనుసరించడానికి కమ్యూనిస్టులు సంకోచించలేదు. రాజకీయ వివాదాలను అహింసాత్మక పద్ధతులలో పరిష్కరించుకోవాలని సోషలిస్టులు విశ్వసించారు; 3) ఆర్థిక, రాజకీయ అధికారాల కేంద్రీకరణ అనివార్యమన్నది కమ్యూనిస్టుల వాదన కాగా సోషలిస్టులు ఆ రెండు రంగాలలోను వికేంద్రీకరణను అభిలషించారు.

స్వాతంత్ర్యానంతరం సోషలిస్టులు తమ మాతృసంస్థ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారు. తమ సొంత పార్టీని ప్రారంభించారు. దరిమిలా సోషలిస్ట్ పార్టీ పలు పర్యాయాలు చీలిపోయింది. చీలిన వర్గాలు మళ్లీ ఏకమవుతుండేవి. విడిపోయినా లేక సమైక్యంగా ఉన్నా, కేంద్రంలో గానీ, రాష్ట్రాలలో గానీ అధికారంలో ఉన్నా, లేకపోయినా 1950, 1960, 1970 దశకాలలో చట్టసభల లోపలా బయటా రాజకీయ చర్చలు సమున్నతంగా, ప్రయోజనకరంగా జరిగేలా చూడడంలో సోషలిస్టులు కీలక పాత్ర నిర్వహించారు. జయప్రకాశ్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా మొదలైన సోషలిస్టు నాయకులకు ఆసేతు శీతాచలమూ విశేష పేరుప్రఖ్యాతులు ఉండేవి. జెండర్ సమత్వానికి నిబద్ధమవడం సోషలిస్టు పార్టీ విశిష్టతగా ఉండేది. నిజానికి కాంగ్రెస్, జనసంఘ్, చివరకు కమ్యూనిస్టులతో పోల్చినా సోషలిస్టు పార్టీలో అసాధారణ మహిళా నాయకులు చాలా మంది ఉండేవారు. కమలాదేవి ఛటోపాధ్యాయ, మృణాల్ గోరే, మధు దండావతే సతీమణి ప్రమీల వారిలో అగ్రగాములు. సాంస్కృతిక రంగం, రంగస్థలం, పౌరహక్కులు, పర్యావరణ ఉద్యమాలలో కూడా సోషలిస్టులు మరెవ్వరి కంటే కూడా మహా క్రియాశీలంగా ఉండేవారు.



స్వాతంత్ర్యానికి ముందు ఒక దశాబ్ద కాలం, స్వాతంత్ర్యానంతరం కనీసం మూడు దశాబ్దాల పాటు వినూత్న మేధోచర్చలకు, నైతిక సైర్యానికి నిండు తార్కాణాలుగా ఉన్న రాజకీయాలకు పరిపూర్ణ ప్రతినిధులుగా సోషలిస్టులు భాసించారు. జాతి నిర్మాణంలో బృహత్తర పాత్ర నిర్వహించిన ఆ ఉదాత్తులలో మధు దండావతే (1923–2005) ఒక విశిష్ట వ్యక్తి. కేంద్ర కేబినెట్ మంత్రిగా భారత్ సమున్నతికి, సామాన్యుల శ్రేయస్సునకు ఆయన చేసిన కృషి సర్దార్ పటేల్, సి. సుబ్రమణియం, డాక్టర్ మన్మోహన్ సింగ్ సేవలతో సరిపోల్చదగింది.

జయప్రకాశ్ నారాయణ్ వలే మధు దండావతే కూడా నైతిక ధైర్యం మెండుగా ఉన్న వ్యక్తి. లోహియా మాదిరిగా మేధావి. తనకు ఆదర్శప్రాయులు అయిన ఎన్‌జి గోరే, ఎస్ఎం జోషి, సానే గురూజీ వలే మహారాష్ట్ర పట్ల తన అవాజ్య ప్రేమానురాగాలను విశాల భారతదేశం పట్ల తన ఆరాధనాభావంతో మిళితం చేసిన ఉదాత్తుడు దండావతే. సహచర సోషలిస్టులలో ఆయన ప్రత్యేకంగా కనిపిస్తారు. అందుకొక కారణమున్నది. మధు దండావతే వారసత్వం ఎల్లకాలమూ నిలిచిపోయే ఆచరణశీలమైనది కావడమే ఆ విశిష్టతకు కారణంగా చెప్పితీరాలి. కోట్లాది భారతీయులు జీవన స్థితిగతులను గణనీయంగా మెరుగుపరచిన అరుదైన ముఖ్య నాయకులలో మధుదండావతే ఒకరు. జనతా పార్టీ ప్రభుత్వంలో రైల్వే మంత్రిగా దండావతే తెచ్చిన మార్పులు ఆయన మానవతకు, పాలనాదక్షతకు తార్కాణాలు. 1974లో రైల్వేకార్మికుల చరిత్రాత్మక సమ్మె, ఇందిర ప్రభుత్వం దానిని అణచివేసిన తీరు ఫలితంగా ప్రభుత్వం, రైల్వే యూనియన్ల మధ్య పరస్పర విశ్వాసం పూర్తిగా అడుగంటింది. దండావతే రైల్వే మంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన వెన్వెంటనే రైల్వే యూనియన్లు, ప్రభుత్వం మధ్య పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించారు. మరీ ముఖ్యంగా చెప్పితీరాల్సిన విషయం రైల్వేల్లో ప్రప్రథమంగా కంప్యూటరీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది దండావతే. అంతకంటే ముఖ్యమైనది ప్యాసెంజర్ ట్రైన్స్‌లో సెకండ్ క్లాస్ సెక్షన్‌లో చెక్క బెంచీలపై ఫోమ్ మెత్తలను ఏర్పాటుచేయడం. ఈ కొత్త మార్పుతో కోట్లాది ప్రయాణికులు నిత్యం తమ సుదూర గమ్యాలకు చాలా సౌఖ్యవంతంగా ప్రయాణించగలుగుతున్నారు. ఈ సౌఖ్యదాయక బెర్త్‌ల నేర్పాటు చేసిన మొదటి ట్రైన్ 1977 డిసెంబర్ 26న ప్రారంభమయింది. బొంబాయి నుంచి కలకత్తాకు వెళ్లే ఆ ట్రైన్‌కు ఈ[illegible] ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేయాలని రైల్వే బోర్డ్ తొలుత ప్రతిపాదించింది. అయితే రైల్వే మంత్రి దండావతే ఈ ప్రతిపాదనతో ఏకీభవించలేదు ఆయనే స్వయంగా దానికొక స్ఫూర్తిదాయక పేరు పెట్టారు. అదే గీతాంజలి ఎక్స్‌ప్రెస్. ఆ రైలులో గురుదేవ్ రవీంద్రుడి చిత్రపటాలు ప్రతీ కంపార్ట్‌మెంట్‌లోనూ ఏర్పాటు చేసారు. రైల్వే శాఖను నిర్వహించిన మంత్రులు అందరిలోనూ అన్ని విధాల అత్యుత్తమ పాలనాదక్షుడు దండావతే అని ఎటువంటి సంకోచం లేకుండా చెప్పవచ్చు. కేంద్ర కేబినెట్‌లో రైల్వే, ఆర్థిక శాఖల మంత్రిగా భారత్ సమున్నతికి, సామాన్యుల శ్రేయస్సుకు దండావతే చేసిన కృషి సర్దార్ పటేల్ (హోం మంత్రి 1947–50), సి.సుబ్రమణియం (వ్యవసాయ శాఖ 1964–67), మన్మోహన్ సింగ్ (ఆర్థిక శాఖ 1991–96) సేవలతో సరిపోల్చదగింది.



■ రామచంద్ర గుహ
గతానుగతం

నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో మధు దండావతే ఆర్థిక మంత్రిగా ఉన్నారు. 1990లో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ చేసిన ప్రసంగంలో పర్యావరణ సమస్యలను ప్రత్యేక ప్రాముఖ్యతతో ప్రస్తావించారు. మన పర్యావరణ వ్యవస్థలకు ఎదురవుతున్న ముప్పును ఇంకెంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని ఆయన హెచ్చరించారు. 'భూసారం క్షీణించడం, నేలలు చవుడు పట్టిపోవడం, వృక్ష ఆచ్ఛాదనం పూర్తిగా నాశనమవడం మొదలైన కారణాల వల్ల దాదాపు 14 కోట్ల హెక్టార్ల భూములు వ్యవసాయానికి యోగ్యం కానివిగా భ్రష్టమయ్యాయి. అడవులు క్రమంగా అంతరించిపోతున్నాయి. పట్టణ ప్రాంతాలలో వాయు, నీటి కాలుష్యం అవధులు లేకుండా పెరిగిపోతోంది. ఆరోగ్యకరమైన పరిసరాలే జీవన నాణ్యతను సమున్నతంగా ఉంచగలుగుతాయి. అభివృద్ధికి ప్రాతిపదికలు అవుతాయి. గ్రామీణాభివృద్ధికి, వికేంద్రీకరణకు ఇచ్చిన ప్రాధాన్యం వల్ల అభివృద్ధి పథకాల రూపకల్పన, అమలులో పర్యావరణపరమైన అంశాలను అంతర్భాగం చేసుకొనే వెసులుబాటు కల్పిస్తుంది' అని మధు దండావతే అన్నారు. అయితే తదనంతర ప్రభుత్వాలు ఆయన వివేకపూరిత హెచ్చరికను పూర్తిగా విస్మరించాయి. ఫలితంగా అభివృద్ధి పేరిట అడ్డూ అదుపులేని విధ్వంసం చోటుచేసుకొంటోంది.

అష్టపదుల వయస్సులో 2005 జూలై 1న తన 'జ్ఞాపకాలు'కు రాసిన ముందు మాటలో దండావతే ఇలా పేర్కొన్నారు: '1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత, తదనంతర హింసాకాండ, ఇటీవల గుజరాత్‌లో మతోన్మాద మారణకాండ లౌకికవాద విలువలు, సంప్రదాయాలను చావుదెబ్బ తీశాయి. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నాయకులు అనుపమాన కృషితో పెంపొందించిన మత సహనం స్ఫూర్తి పూర్తిగా కూలిపోయింది. అయితే ఈ శిథిలాల నుంచి మత సామరస్యత పరిపూర్ణంగా విలసిల్లే భారత్ ప్రభవిస్తుంది. ఉద్వేగాలు తాత్కాలికమే. శాశ్వతంగా ఉండేది మానవతాపూర్వక సంవేదనలే'. దేశ రాజకీయాలలో హిందూత్వ శక్తులు ఆధిపత్యం చెలాయిస్తున్న ప్రస్తుత సందర్భంలో మత సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటున్నవారు దండావతే ఆశాభావాన్ని నిజం చేసేందుకు మరింత కష్టపడి పని చేయవలసిన అవసరమున్నది.

కాంగ్రెస్, కమ్యూనిస్టులు, హిందూత్వవాదులతో పోల్చితే సోషలిస్టుల ఘన చరిత్రను చరిత్రకారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆక్షేపణ, ఆవేదనతో నేనీ కాలమ్‌ను ఆరంభించాను. సోషలిస్టుల ఇటీవలి చరిత్ర ఏమంత ఉత్కృష్టమైనది కాకపోవడం కూడా ఆ ప్రాజ్ఞుల ఉపేక్షకు ఒక కారణంగా చెప్పవచ్చు. తమను తాము సోషలిస్టులుగా చెప్పుకుంటున్న వారిలో కొంతమంది హిందూత్వ శక్తులకు న్యాయ సమ్మతి సమకూరుస్తున్నారు. మరి కొంతమంది తమ వారసులకు అధికారాన్ని కట్టబెట్టడమే పరమ లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందు ఒక దశాబ్ద కాలం, స్వాతంత్ర్యానంతరం కనీసం మూడు దశాబ్దాల పాటు చైతన్యశీల, వినూత్న మేధోచర్చలు, నైతిక సై[illegible]ం, వ్యక్తిగత ధైర్య సాహసాలకు నిండు తార్కాణాలుగా ఉన్న రాజకీయాలకు పరిపూర్ణ ప్రతినిధులుగా సోషలిస్టులు భాసించారు. రాజకీయాలలో, వివిధ మేధో రంగాలలో భారతీయ సామ్యవాదం నిర్వహించిన విశిష్ట పాత్రను విపులంగా తెలియజేసే సమగ్ర చరిత్ర ఇంకా రావలసే ఉన్నది. సోషలిస్టుల ఉత్థానం, పరిణతి, మేధో రంగాలకు, ప్రజా జీవితానికి వారు చేసిన బహుముఖీనమైన సేవలు, ఆ తరువాత క్రమంగా పతనమైన తీరుతెన్నులను నిష్పాక్షికంగా పరిశీలించవలసిన అవసరమున్నది. అయితే కనీసం జీవితచరిత్రల పరంగా ఆశాజనకమైన సూచనలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. 2022లో రాహుల్ రామగుండం సంఘటనల భరితమైన జార్జి ఫెర్నాండెజ్ జీవితచరిత్రను వెలువరించారు. నికో స్లేట్ రాసిన కమలాదేవి ఛటోపాధ్యాయ జీవితచరిత్ర ఈ ఏడాది ద్వితీయార్థంలో వెలువడనున్నది. లోక్‌నాయక్ జెపి సమగ్ర జీవితచరిత్రను అక్షయ ముకుల్ త్వరలోనే తప్పకుండా తీసుకురాగలరని నేను విశ్వసిస్తున్నాను. అదే విధంగా యువ చరిత్రకారులు ఎవరైనా మధు దండావతే, బహుశా మధు, ప్రమీల సంయుక్త జీవితచరిత్ర రచనకు తప్పక పూనుకుంటారని కూడా నేను ఆశిస్తున్నాను.

పేదల అభ్యున్నతికే మోదీ పథకాలు

మనిషి స్వేచ్ఛగా, సంతోషంగా, ఆరోగ్యంగా జీవించే హక్కుని రాజ్యాంగం ప్రసాదించింది. 142 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ప్రతి వ్యక్తికీ కూడు–గూడు–గుడ్డ, విద్య, వైద్యం, రక్షణ, స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. 2023 జూలై–సెప్టెంబర్ వరకు స్థూల జాతీయోత్పత్తి 7.6 శాతం సాధించాం. 12.4 శాతంతో రూ.7.28 లక్షల కోట్లకు ప్రభుత్వ పెట్టుబడి పెరిగింది. 2023–24 బడ్జెట్‌లో ఈ మొత్తం రూ.10 లక్షల కోట్లకు చేరింది. ఇదంతా సంతోషకర సమాచారం అయినా గర్వపడే విషయం కాదు. కారణం– గత ఏడాది 2.5 శాతం వృద్ధిరేటు నమోదు చేసిన భారతీయ వ్యవసాయరంగం ఈ ఏడాది 1.2 శాతానికి జారిపోయింది. తలసరి ఆదాయం తగ్గింది. వ్యక్తిగత రుణాలు 30 శాతంతో అనూహ్యంగా పెరిగాయి.

ఈ దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 27 కోట్ల మంది ఉన్నారు. ప్రతి ఏటా సంపూర్ణ ఆహారం దొరకక చనిపోతున్నవారు 17 లక్షల మంది ఉన్నారు. 7.1 శాతంగా ఉన్న నిరుద్యోగులు 2022–23 నాటికి పట్టణాలలో 7.8 శాతంగా, పల్లెలలో 8.5 శాతంగా పెరిగారు. ఆంధ్రాలో ఈ అంకె 24 శాతంగా కనిపిస్తోంది. భారతదేశ జనాభాలో ఉత్పాదక శక్తిగా పేర్కొనదగిన 30–40 సంవత్సరాల వారు మూడింట రెండొంతల మంది ఉన్నారు. అయితే వీరిలో 47 కోట్ల మంది వలస కార్మికులుండడం బాధాకరం. అందులో ఆంధ్రులు 40 లక్షల మంది.

వ్యవసాయ ఆధారిత దేశం అయిన భారత్ ఏటా రెండు లక్షల కోట్ల ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవటం, వాటి కోసం విదేశీ నిల్వలు కరిగించుకోవడం సమంజసమా? క్షేత్రస్థాయిలో క్రాప్ క్యాలెండర్‌ను తిరగరాసుకుని, పప్పుధాన్యాల సాగు చేయడానికి వీలుగా నదులలో నీటిని వదలడం వంటి చిన్నచిన్న ప్రణాళికలను ఎందుకు ఆచరణలో పెట్టలేకపోతున్నాం? ఆంధ్రప్రదేశ్‌లో 0.01 హెక్టార్లకన్నా తక్కువ భూమి ఉన్న గ్రామీణులు సంఖ్య 54.4 శాతంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో 3,858 పంచాయితీలకు కంప్యూటర్లు లేవు; 1893 పంచాయితీలకు సొంత భవనాలు లేవు.

ఆంధ్రప్రదేశ్‌లో గత మూడేళ్లలో ఒక్క కి.మీ గ్రామీణ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. 2020–21 నుంచి 2023–24 డిసెంబర్ 12 వరకు ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద ఏపీలో మొత్తం 2,380 కి.మీ పొడవైన 237 రోడ్లు మంజూరు చేస్తే ఇప్పటివరకు 1,149 కి.మీ రహదారుల పని జరిగింది. ఇది కూడా 2020–21లో చేసింది. అలాగే పోలవరం, అమరావతి ఇరిగేషన్ ప్రాజెక్టుల పనీ పూర్తి కాలేదు. కోటానుకోట్ల పెట్టుబడులు శిథిల నిర్మాణాల రూపంలో కనిపిస్తున్నాయి. ఫెడరల్ స్ఫూర్తిని కొనసాగిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గాడి తప్పుతున్న ఆర్థిక వ్యవస్థని చక్కబరుస్తూ పేదలలో పేదల ఆకలి తీర్చడానికి, అవసరాలకు ఆదుకోవడానికి ఒక బృహత్తర ప్రణాళికను ఆచరణలోకి తీసుకొచ్చింది. ఇవి సంక్షేమ పథకాలు కావు, పౌరుల పట్ల ప్రభుత్వాల కనీస బాధ్యతలు.

ఈ దేశంలో ఆకలితో ఎవరూ చనిపోవడానికి వీల్లేదు అన్న సత్సంకల్పంతో 81.35 కోట్ల మందికి అయిదేళ్లపాటు ఉచితంగా ఆహారధాన్యాలు అందిస్తున్నారు. ప్రధాని మోదీ అంత్యోదయ కుటుంబాలకు 35 కేజీలు ఉచిత ఆహారధాన్యాలు పంపిణీ చేస్తున్నారు. జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం పేరిట నాగరిక సమాజానికి దూరంగా బతుకుతున్న 75 తెగలకు చెందిన గిరిజనుల అభ్యున్నతి కోసం 18 లక్షల ఇళ్లు, రోడ్లు, కుళాయి నీరు, మొబైల్ మెడికల్ యూనిట్లు, వృత్తి విద్యా నైపుణ్యాభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాలు, సోలార్ పవర్ గ్రిడ్ మొబైల్ టవర్స్ వగైరా నిమిత్తం రూ.24,104 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇందులో కేంద్రం వాటా రూ.15,336 కోట్లు, రాష్ట్రాల వాటా రూ.8,768 కోట్లు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు పన్నెండవ తరగతి వరకు ఉచిత విద్య, సమీకృత ఉచిత ఆహారం ఇస్తున్నారు. గ్రామీణ రోడ్లు, రైల్వేస్టేషన్లు, విద్య వైద్యాలయాల అభివృద్ధి, ఇరిగేషన్ ప్రాజెక్టులు, పేదలకు ఉచితంగా ఇళ్లు వగైరా వగైరా. ప్రతి భారతీయుడు స్వశక్తిపై గౌరవప్రదమైన ఆరోగ్యదాయకమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన ఆర్థిక, విజ్ఞాన, మార్కెటింగ్ సదుపాయాలను మోదీ ప్రభుత్వం సమకూరుస్తోంది.

"సంక్షేమ పథకాలు– ఉచిత పథకాలు– సోమరుల కోసం పథకాలు" అని వ్యంగ్య బాణాలు విసిరేవారు ఒక విషయం గమనించాలి. మోదీ ప్రవేశపెట్టిన ఈ పథకాలు ఎవర్నీ జీవితాంతం బిక్షగాళ్లుగా బతకనివ్వవు; స్వావలంబనకు చేయూత మాత్రమే! ఉదాహరణకు మహిళలకు డ్రోన్స్ పథకం; వృత్తి పనుల వారికి.. ఇలా చాలా కేంద్ర పథకాలున్నాయి. ప్రచారం లేక ఇవి ప్రజలలోకి వెళ్లవలసినంతగా వెళ్లలేదు. రైతులకు పంటలు, ఇన్సూరెన్స్ ఆన్‌లైను మార్కెటింగ్, సబ్సిడీల సదుపాయాలు... ఎన్నో ఎన్నెన్నో! మోదీ ప్రభుత్వం కల్పించిన పథకాలను వినియోగించుకుంటే నిరుద్యోగం ఉండదు, అప్పుల కుప్పల ప్రస్తావన రాదు, ఆత్మహత్యలు కనిపించవు. ఆత్మహత్యలు సమసిపోవాలంటే ఉచిత పంట బీమా, రుణ–మార్కెటింగ్ సదుపాయాలు, రుణ సౌకర్యాలు రైతులు ఉపయోగించుకోవాలి.



మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎవర్నీ జీవితాంతం బిక్షగాళ్లుగా బతకనివ్వవు; స్వావలంబనకు చేయూత మాత్రమే! ఉదాహరణకు మహిళలకు డ్రోన్స్ పథకం. ఇలా చాలా కేంద్ర పథకాలున్నా ప్రచారం లేక ఇవి ప్రజలలోకి వెళ్లవలసినంతగా వెళ్లలేదు. మోదీ ప్రభుత్వం కల్పించిన పథకాలను ప్రజలు వినియోగించుకుంటే నిరుద్యోగం ఉండదు, అప్పుల కుప్పల ప్రస్తావన రాదు, ఆత్మహత్యలు కనిపించవు.

కేంద్రం ఎప్పుడూ ఫెడరల్ సూత్రాలను గౌరవిస్తూ రాష్ట్రాలకు అవకాశాలు ఇస్తుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌కి రూ.2,952.74 కోట్లు కేంద్ర పన్నుల వాటాగా అదనపు నిధుల్ని కేటాయించిన కేంద్రం, పంచాయితీలకు రూ.2,988 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా నేరుగా గ్రామ పంచాయితీలకి నిధులు విడుదల చేస్తోంది. అలాగే నగరాలతో సమానంగా ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాల్లో 17,505 గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ అందిస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది. సమాజంలో అట్టడుగు వర్గాల కోసం మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాల ఫలాలు బాధిత వర్గాలకు చేరిననాడు ప్రతి ఇల్లూ నందనవనంలా మారుతుంది.

• పాతూరి నాగభూషణం
బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జ్



గాంధీ నవ్వాడు!

గుజరాత్‌లో ఆటవికత పురివిప్పి ఆడినప్పుడు
మూకుమ్మడి మానభంగానికి తెగబడినప్పుడు
మతతత్వానికి ఓంకారం వినిపించలేదు
అమ్మలగన్న అమ్మ విశ్వరూపం కనిపించలేదు
పదకొండు మంది కొవ్వెక్కిన పందికొక్కులు
ఒక గర్భవతిపైన ఒకరి వెంట ఒకరుగా
ఛీ! ఛీ! చెప్పటానికే సిగ్గుపడే పని చేసినప్పుడు,
ఆమె కడుపులోని బిడ్డడు ఎంత ఆక్రోశించాడో
జైలు నుండి బెయిలు లేకుండానే
బయటకు తెచ్చిన పాపానికి
అత్యున్నత న్యాయస్థానం పెట్టిన పేరు
అధికార దుర్వినియోగం!
బిల్కిస్ బానో అంటే పైశాచికత్వంపై విజయం!
బిల్కిస్ బానో అంటే న్యాయానిదే గెలుపనే నమ్మకం!
ఇంతకీ బిల్కిస్ బానో అంటే అర్థం తెలుసా?
'ఇస్లామీయుల్లో పతివ్రతాశిరోమణి' అని!
అత్యాచారాన్ని ఏ ఆదికేశవుడు ఆమోదిస్తాడు?
అసహనాన్ని ఏ మహదేవుడు హర్షిస్తాడు?
అన్యాయాన్ని ఏ పరబ్రహ్మ మెచ్చుకుంటాడు?
ఏ పరమాత్మ భళిభళి అని భుజం తడతాడు?
దోషులకు నెలవైన పాలకుల్ని చూస్తూ,
మౌనం వహిస్తూ, ధ్యానం రచిస్తూ గడిపిన
గాంధీ మహాత్ముడు ఇప్పుడు నవ్వాడు
గెలిచింది బిల్కిస్ బానో కాదు, భారతీయత అని!

– డా. జి.వి. పూర్ణచందు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





పండుగ.. దండిగా..

నగరంలో సంక్రాంతి సందడి వాతావరణం

- కిక్కిరిసిపోతున్న బీసెంట్‌రోడ్డు, బందరురోడ్డు
- వన్‌టౌన్, ఏలూరు రోడ్లలోనూ అదే పరిస్థితి
- కొనుగోలుదారులతో షాపులన్నీ కిటకిట
- వస్త్ర, బంగారం కొనుగోళ్లకు పెరిగిన డిమాండ్
- వాహనాలతో బెంజిసర్కిల్ వద్ద ఒకటే ట్రాఫిక్
- గంటలకొద్దీ ట్రాఫిక్ సమస్యతో ఇక్కట్లు
- వీఐపీల రాకతో మరింత ఇబ్బందులు
- పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్ కిటకిట

బందరురోడ్డులో భారీ ట్రాఫిక్ (ఇన్‌సెట్‌లో) రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై రద్దీ





బీసెంట్‌రోడ్డులో కిక్కిరిసిన కొనుగోలుదారులు, పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూపులు

ఓవైపు పండుగ ప్రయాణాలు.. మరోవైపు వీఐపీల రాకపోకలు.. ఇంకోవైపు షాపింగ్‌లు.. నగరం పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. మరో రెండు రోజుల్లో సంక్రాంతి పండుగ రానుండగా, ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న వారితో రద్దీ ఒక్కసారిగా పెరిగింది. కాగా, వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సీట్ల సర్దుబాట్లు, సమావేశాలకు వీఐపీల రాక పతాకస్థాయికి చేరింది. దీంతో ఎటుచూసినా వాహనాల కోలాహలమే కనిపిస్తోంది. పండుగ షాపింగ్ అయితే జోరుగా జరుగుతోంది. వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. బీసెంట్ రోడ్డు మొత్తం కిక్కిరిసి కనిపిస్తోంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇక బీసెంట్ రోడ్డు వద్ద పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. కొనుగోలుదారులు బస్సులు, ఆటోలు, కార్లు, సొంత వాహనాలపై వస్తుండటంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది. రద్దీ కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. ఇక బందరు రోడ్డులోని షాపులు బంపర్ ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలుదారులు క్యూ కడుతున్నారు. వస్త్ర, బంగారు దుకాణాల వద్ద ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇక పండుగ స్పెషల్‌గా సెల్‌ఫోన్లు కొనడానికి వచ్చే వారితో ఏలూరు రోడ్డు కిటకిటలాడుతోంది. బెంజిసర్కిల్ వద్ద హైవేపై వాహనాలు భారీగా రాకపోకలు సాగిస్తుండటంతో రామవరప్పాడు వరకూ పరిస్థితి పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. నగరం వెలుపలకు వెళ్లడం గగనంగా మారింది. పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో రద్దీ తారస్థాయికి చేరింది.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

సంక్రాంతి సందడి ఇలా మొదలైందో లేదో.. అలా పందెంకోళ్ల బరులు, జూదాలకు ఏర్పాట్లు సిద్ధమైపోతున్నాయి. సంక్రాంతి సంబరాల ముసుగులో భారీ టెంట్లు వేసి బరులు గీసేస్తున్నారు. పందెంకోళ్లు, కోడి కత్తులు, జూదా శిబిరాలు, ప్రత్యేక స్టాళ్ల ముసుగులో రూ.కోట్లు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సంవత్సరం కావడంతో అధికార పార్టీ నాయకులు మరింత జోరుగా పందేలు సాగించడానికి పక్కా ప్రణాళికలు వేస్తున్నారు.



అంపాపురంలో ఏర్పాటుచేసిన భారీ టెంట్లు

కూతకు సై

జిల్లాలో భారీగా కోడిపందేల బరులు సిద్ధం



బరుల వద్ద ఏర్పాటుచేసిన దిమ్మెలకు వైసీపీ రంగులు



జగ్గయ్యపేట వద్ద తిరుమలగిరి దేవదాయ భూముల్లో బరి

ఎన్నికల వత్సరంలో వైసీపీ నేతలకు కాసుల పండుగే..

- భోగి రోజు నుంచి కనుమ వరకూ..
- అంపాపురం, కొత్తూరు తాడేపల్లిలో జోరుగా..
- ఆలయ, ప్రభుత్వ భూముల్లోనూ జూద ఏర్పాట్లు
- అధికార పార్టీ నేతల ధనదాహం
- జగ్గయ్యపేట, తిరువూరులో పక్కా ఏర్పాట్లు
- తెలంగాణ సరిహద్దుల్లో డిమాండ్ ఎక్కువే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అధికార పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపించే రోజులొచ్చాయి. సంక్రాంతి సంబరాల ముసుగులో జూదాలకు తెర తీస్తున్నారు. ఖాళీ ప్రదేశాలు, తోటల్లో కోడిపందేల బరులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు పేకాటను భారీస్థాయిలో నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. ఎక్కడెక్కడ కోడిపందేలు నిర్వహించాలన్న దానిపై ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చారు. విజయవాడ రూరల్ మండలం నుంచి తెలంగాణ సరిహద్దు ప్రాంతం తిరువూరు, జగ్గయ్యపేట వరకు బరులు, పేకాట శిబిరాలు సిద్ధమవుతున్నాయి. భోగి రోజు నుంచి మొదలయ్యే సంక్రాంతి సంబరాలు కనుమ వరకు సాగుతాయి. ఈ మూడు రోజుల పాటు పందేలు, జూదాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారతాయి. జూదాల కోర్టులను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నారు.

'కట్టుబాట్ల' సమావేశాలు

విజయవాడ రూరల్ మండలంలోని కొత్తూరు తాడేపల్లి, పాములకాల్వ, పైపుల రోడ్డు వద్ద అధికార పార్టీ నేతలు బరులు నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నారు. అధికార పార్టీలో ఉన్న కొంతమంది నేతలు, సర్పంచ్‌లు కలిసి ఈ తతంగానికి తెర తీస్తున్నారు.

గ్రామాలకు కొన్ని కట్టుబాట్లు ఉన్నాయని చెప్పి సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలు జరుగుతున్నాయి. ఎన్ని బరులు వేయాలి, బరికి ఎంత ధరను నిర్ణయించాలి, ఫుడ్‌స్టాల్, డ్రింక్ స్టాల్స్‌ను ఎవరికి ఎంతకు కేటాయించాలన్న దానిపై ఈ సమావేశాలు సాగుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో బాపులపాడు మండలం అంపాపురంలో భారీస్థాయిలో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తారు. ఏటా ఇక్కడ బరులు పెరగడంతో పాటు సందర్శకుల తాకిడి వి పరీతంగా ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లాతో పాటు తెలంగాణ జిల్లాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. విజయవాడకు సమీపాన ఉన్న ప్రాంతాలతో పాటు తిరువూరు, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు సరిహద్దుల్లో బరులు ఏర్పాటవుతున్నాయి. జగ్గయ్యపేట, తిరువూరు ప్రాంతాల్లో నిర్వహించే బరుల వద్దకు ఖమ్మం, మధిర ప్రాంతాల నుంచి వస్తారు.

ఆలయ భూముల్లోనూ బరులు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో కోడిపందేలు, జూదాలకు ఆలయ భూములను వాడేస్తున్నారు. జగ్గయ్యపేటలో ఉన్న రంగనాయక స్వామి ఆలయానికి తిరుమలగిరిలో భూమి ఉంది. ఇందులో వైసీపీ నేతలు బరులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వ భూముల్లోనూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే స్థలంలో భారీగా పేకాట శిబిరాలు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే వారి ఆహారం అందించే స్టాళ్ల వేలం ద్వారా కేటాయిస్తున్నారు. అధికారులు అటువైపు కన్నెతి చూడకుండా లక్షలాది రూపాయలను ముడుపులుగా సమర్పించుకుంటున్నారు.

సారథి బాటలో బొప్పన



వైసీపీకి గుడ్‌బై చెప్పే యోచన

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీలో అవమానాలు.. అణచివేతలు తట్టుకోలేక కీలకమైన నాయకులు ఒకరి తర్వాత ఒకరు సర్దుకుంటున్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి.. వైసీపీని వీడటం ఖాయంగా కనిపిస్తున్న నేపథ్యంలో తాజాగా పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ కూడా అదేబాట పట్టారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న బొప్పన భవకుమార్ 2019లో విజయవాడ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గద్దె రామ్మోహన్ చేతిలో ఓడిపోయారు. ఎన్నికల అనంతరం భవకుమార్‌కు నగర పార్టీ బాధ్యతలను అప్పగించారు. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో టీడీపీలో ఉన్న దేవినేని అవినాశ్ వైసీపీ తీర్థం పుచ్చుకోవడంతో భవకుమార్ ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. పేరుకే నగర అధ్యక్షుడిగా ఉన్నా ఆయన్ను అవినాశ్ వర్గం అసలు పట్టించుకోవట్లేదు. తొలి నుంచి పార్టీలో ఉంటూ విధేయుడిగా.. వివాదరహితుడిగా పేరొందిన భవకుమార్‌ను ఓ దశలో ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తున్నారని ప్రచారం జరిగింది. 2021, జూలైలో జిల్లా నుంచి మొత్తం 11 మందికి నామినేటెడ్ పోస్టులు దక్కినా భవకుమార్‌కు మాత్రం ఊరించి ఉసూరుమనిపించారు. చివరి నిమిషంలో ఆయనకు పదవి దక్కలేదు. దీనికి అవినాశ్ వర్గమే కారణమన్న ప్రచారం ఉంది. ఎలాంటి గుర్తింపునకు నోచుకోకపోవడంతో కొంతకాలంగా భవకుమార్ అనుచరులు ఆయన్ను వైసీపీకి గుడ్‌బై చెప్పాల్సిందిగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పెనమలూరు ఎమ్మెల్యే సారథితో ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా ఆయనతో పాటు పార్టీని వీడాలని భవకుమార్ నిర్ణయించుకున్నారు. సారథితో కలిసి టీడీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.



• దీక్షతో..

అంగన్వాడీలు రోజురోజుకూ పిడికిలి బిగిస్తున్నారు. ప్రభుత్వం ఎస్మాను ప్రయోగిస్తామంటున్నా, పోలీసులు బెదిరిస్తున్నా ఏమాత్రం వెనకడుగు వేయక 32 రోజులుగా ఉద్యమ బాటలో ముందుకు సాగుతున్నారు. ధర్నాచౌక్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహార దీక్ష శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరుకోగా, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో దీక్షా శిబిరం దద్దరిల్లిపోయింది.

- 6లో..

రండి.. కదలిరండి..

18న గుడివాడలో 'రా కదలిరా' సభ

- హాజరుకానున్న టీడీపీ అధినేత
- గుడివాడలో సభాస్థలికి భూమిపూజ

- 6లో..

నేటి నుంచి

జోసఫ్ తంబి ఉత్సవాలు

మూడు రోజుల పాటు నిర్వహణ

- ముగిసిన నవదిన ప్రార్థనలు

- 6లో..

అన్నదాత అవస్థలపాలు

ధాన్యం అమ్మకాల్లో ప్రభుత్వం కొర్రీలు

ఆరుగాలం శ్రమించి కష్టనష్టాలకోర్చి పండించిన ధాన్యం విక్రయించుకునే దశలో అన్నదాతలకు ప్రతిబంధకాలు తప్పడం లేదు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పెట్టిన కొర్రీలతో సతమత మవుతున్నారు. ధాన్యం వి క్రయించేందుకు సంచులు అందుబాటులో లేవు. ధాన్యం కాటావేస్తే రవాణాకు ట్రాక్టర్ల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో ధాన్యం విక్రయాలు జరిపినట్లుగా చూపినా వాహనాలు అందుబాటులో లేక ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోతోంది. దీంతో ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా ఆగిపోయాయి.

- ఆఫ్‌లైన్ విధానం తీసేసి ఆన్‌లైన్ పద్ధతి అమలు
- నిలిచిన ధాన్యం కొనుగోళ్లు
- వాహనాలు అందుబాటులో లేక కల్లాల్లోనే ధాన్యం
- దూరప్రాంతం మిల్లులకైతే ట్రాక్టర్లకు ముందస్తుగానే కిరాయి వసూలు
- దగ్గరలోని మిల్లులకు ఇవ్వాలని రైతుల వేడుకోలు



చల్లపల్లి మండలం లంకతోటలో పొలంలోనే ఉండిపోయిన ధాన్యం బస్తాలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/చల్లపల్లి : అన్నదాతల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ధాన్యం అమ్మకాలకు ప్రభుత్వం ఆఫ్‌లైన్ విధానాన్ని తీసేసి ఆన్‌లైన్ పద్ధతిని అమలు చేయడంతో తడిసి మోపెడవుతోంది. ఆన్‌లైన్ పద్ధతిలో 25 కిలోమీటర్ల కన్నా దూరంలోని మిల్లులకు ధాన్యం పంపుతున్నారు. గతంలో ఒకట్రాక్టరు ట్రక్కులో 115 నుంచి 130 సారల ధాన్యాన్ని మిల్లులకు చేర్చేవారు. ఆన్‌లైన్‌లో ధాన్యం వివరాలు నమోదైతే 75 సారలు మాత్రమే వేస్తున్నారు. దూరప్రాంతానికి ధాన్యం వెళ్లాలి కాబట్టి రవాణా ఖర్చులను అధికంగా ఇవ్వాలని ట్రాక్టరు యజమానులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ట్రాక్టరుకు కేటాయించిన మిల్లు దూరాన్ని బట్టి మూడు, నాలుగు వేల రూపాయలు రవాణా చార్జీలుగా రైతులు ముందస్తుగానే ఇవ్వాల్సి వస్తోంది. దూరాన ఉన్న మిల్లులకు ధాన్యాన్ని పంపితే అన్‌లోడింగ్ ఆలస్యమవుతోందని, వెయిటింగ్ చార్జీల రూపంలో అదనంగా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదైన తరువాతే వాహనాల యజమానులు అడిగిన మొత్తం కిరాయిగా ఇవ్వాల్సి వస్తోంది. ధాన్యం రవాణాకు సరిపడా వాహనాలు అందుబాటులో లేకపోవడంతో పొలంలోనే ధాన్యం బస్తాలు ఉంచాల్సి వస్తోంది. వాహనాలు అందుబాటులోకి వస్తే ధాన్యం ఆన్‌లైన్ చేస్తామని ఆర్బీకేలలో పనిచేసే సిబ్బంది చెబుతున్నారని గుడివాడ, చల్లపల్లి మండలాలకు చెందిన రైతులు అంటున్నారు.

ఈ సీజన్‌లో ఆఫ్‌లైన్ పద్ధతి (రాండమ్ మిల్లింగ్)లో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా దగ్గరలోని మిల్లులకు ధాన్యం విక్రయించుకునే విధానం కొనసాగింది. గత నాలుగైదు రోజులుగా ఆ పద్ధతిని నిలిపివేయాలని, ఆన్‌లైన్‌లోనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఆదేశాలు ఇవ్వటంతో ఆన్‌లైన్ ప్రక్రియలో దూరాన

ఆన్‌లైన్ విధానంతో అవస్థలు

ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయి. దీంతో ధాన్యం రవాణాకు ట్రాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నా కిరాయి రూపంలో అదనపు మొత్తం రైతుల నుంచీ వసూలు చేస్తున్నారు. రైతుల ఇబ్బందులు తొలగాలంటే ఆఫ్‌లైన్ పద్ధతినే కొనసాగించాలి. దగ్గరలోని రైస్‌మిల్లులకే ధాన్యం కేటాయించాలి. సంక్రాంతి సెలవులు వస్తే ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో లేక మూడు నాలుగురోజులపాటు కల్లాల్లోనే ధాన్యం ఉండిపోతుందని రైతులు భయపడుతున్నారు.


స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వెంకయ్య

స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

- ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఉంగుటూరు, జనవరి 12 : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆత్మీయ అతిథిగా కేంద్ర పర్యాటక శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి, ప్రత్యేక అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలు, సంప్రదాయ సంగీత విభావరులతో అందమైన పల్లె వాతావరణం కళ్లముందు సాక్షాత్కరింపజేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులు వేదవ్యాస ఆనందభట్టర్ ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు ప్రతి ఒక్కరినీ ఆధ్యాత్మిక తన్మయత్వంలోకి తీసుకెళ్లగా, సంక్రాంతి పర్వదినం విశిష్టత, తెలుగుభాష గొప్పతనం, హిందూ సంస్కృతి ఔన్నత్యం, తెలుగువారి వంటల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచనం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ సినీ నేపథ్యగాయకురాలు ఎస్పీ శైలజ బృందం సినీ సంగీత విభావరిలో ఆలపించిన పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధుల్ని చేశాయి. పద్మ పురస్కార గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, స్వర్ణ భారత్ ట్రస్ట్ ఎండీ దీపా వెంకట్, ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్ ప్రసంగించారు. ట్రస్టీలు శరత్‌బాబు, మలినేని రాజయ్య త్రిపురనేని కృష్ణప్రసాద్, మండవ ప్రభాకరరావు, అట్లూరి అశోక్, గ్రంధి విశ్వనాథ్, ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి, ముప్పవరపు ఫౌండేషన్ ప్రతినిధి ముప్పవరపు హర్ష, బీవీరాజు ఫౌండేషన్ ప్రతినిధి బీవీ నాగేశ్వరరావు, ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి జయరమేష్, మాజీఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, తదితర ప్రముఖులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.


దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ సతీష్

నేటి నుంచి జోసఫ్ తంబి మహోత్సవాలు

- ఘనంగా ముగిసిన నవదిన ప్రార్థనలు

ఉంగుటూరు, జనవరి 12 : పెదఅవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి 79వ వర్ధంతి సందర్భంగా తంబి పుణ్యక్షేత్ర ప్రాంగణంలో జరుగుతున్న నవదిన ప్రార్థనలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. కడప మేత్రాసనం, కమలాపురం విచారణగురువులు రెవ.ఫాదర్ బుడ్డాయపల్లి సతీష్ దివ్యపూజను సమర్పించి క్రీస్తును అనుసరించడంలో తంబి సుమాతృకను గురించి ప్రసంగించారు.

శనివారం నుంచి సోమవారం వరకు(13, 14, 15తేదీలు) జరుగనున్న బ్రదర్ జోసఫ్ తంబి మహోత్సవాలకు(తిరునాళ్ల)సర్వం సిద్ధమైందని తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ రెవ.ఫాదర్ పాలడుగు జోసఫ్ తెలిపారు. భక్తులు, విశ్వాసులు, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, తంబి సమాధి, గృహం, దేవాలయాన్ని సందర్శించుకుని ప్రార్థనలు చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టం చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫాదర్లు గోపు ప్రవీణ్, మద్దాల రవి, దిరిశం జయప్రసాద్, కచ్చా కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలం చదును చేస్తున్న టీడీపీ నేతలు

'రా కదిలిరా' సభకు తరలిరండి

- పార్టీ శ్రేణులకు టీడీపీ నేతల పిలుపు
- గుడివాడలో సభాస్థలికి భూమిపూజ

గుడివాడ, జనవరి 12 : ఈ నెల 18న కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గంలో చంద్రబాబు 'రా కదిలారా' కార్యక్రమంలో భాగంగా నిర్వహించే భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లాయిపాలెంలోని అలంకృత ఫంక్షన్ హాల్ ఎదురుగా సభా స్థలంలో భూమిపూజ నిర్వహించారు. అనంతరం సన్నాహక సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై నిరంతరం పోరాడుతున్న చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఎన్టీఆర్ రోజులు గుర్తుకు వచ్చేలా లక్షమందితో సభను నిర్వహిస్తామన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గుడివాడలో 20వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్లరాము మాట్లాడుతూ, రాష్ట్రమంతా గుడివాడ వైపు చూసేలా 'రా కదిలిరా' సభను నిర్వహిస్తామన్నారు. అన్న ఎన్టీఆర్ వర్ధంతి రోజున సభ జరగడం అదృష్టమన్నారు. కేశినేని చిన్ని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో జిల్లా పేరుప్రతిష్ఠలు మంటగలిసాయన్నారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లా రాజకీయాలను నాని లాంటి వారు చెడగొడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమారరాజా, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన జిల్లా అధ్యక్షుడు బండి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డూండి రాకేష్, గోకవరపు సునీల్, పట్టణ, గుడివాడ, నందివాడ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం : కొనకళ్ల

పెనమలూరు : కష్టపడి పనిచేసేవారికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తారని కొనకళ్ల నారాయణ అన్నారు. పెనమలూరులో శుక్రవారం నిర్వహించిన టీడీపీ, జనసేన పార్టీ కుటుంబసభ్యుల ఆత్మీయ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, కష్టపడి పని చేసే వారికి తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పెనమలూరు టీడీపీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ ఉంటారని, ఎన్ని పుకార్లు వచ్చినా పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజాసమస్యలపై పోరాడుతున్నానని, కేసులకు భయపడేది లేదన్నారు. కొందరు తనకు సీటు లేదని ప్రచారం చేస్తున్నారని, చంద్రబాబు నాయుడుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు.

పేదలకు పండుగ లేకుండా పోయింది : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : జగన్‌రెడ్డి పాలనలో ఉసూరుమంటూ పేద ప్రజలు సంక్రాంతి పండుగ జరుపుకోవాల్సి వచ్చిందని కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు హయాంలో పేద ప్రజలకు తోఫా ఇచ్చేవారని, జగన్‌రెడ్డి పాలనలో పేద ప్రజలతో పాటు రైతులు పూర్తిగా సమస్యల వలయంలో చిక్కుకున్నారన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు వస్తుందన్నారు.

ప్రభుత్వం దిగిరాకుంటే రాష్ట్ర బంద్!

- భోగి మంటల్లో ఎస్మా ప్రతులు దహనం
- 32వ రోజుకు అంగన్వాడీల సమ్మె

మచిలీపట్నం టౌన్, జనవరి 12 : ప్రభుత్వం దిగిరాక పోతే రాష్ట్ర వ్యాప్త బంద్ నిర్వహిస్తామని అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. ఎస్మా నోటీసులు జారీ చేయడంపై మచిలీపట్నంలో వినూత్న రీతిలో కార్యకర్తలు, హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం భోగి మంటల్లో నోటీసులను దహనం చేశారు. మచిలీపట్నం ధర్నాచౌక్ వద్ద పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భోగి పాటలు పాడుతూ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, ప్రాజెక్టు ఏరియా సంఘ కార్యదర్శి రిజీనా రాణి మాట్లాడారు. పాలకులు చర్చలకు పిలిచి దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. రాష్ట్రంలో లక్షలాది పిల్లలు, గర్భవతులు, బాలింతలు అవస్థలకు గురవుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేదన్నారు. మహిళలు రోడ్డున పడినా ప్రభుత్వానికి ఉలుకు పలుకు లేదన్నారు.


మచిలీపట్నం దీక్షా శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ..

కూచిపూడి : తమ డిమాండ్లు పరిష్కరించే విధంగా ఈ ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామీ.. అంటూ మొవ్వలో అంగన్వాడీలు సూర్యభగవానుడిని వేడుకున్నారు. మొవ్వ, చల్లపల్లి, ఘంటసాల మండలాలకు చెందిన ఆయాలు, కార్యకర్తలు మూకుమ్మడిగా సూర్యనమస్కారాలు చేశారు.


విజయవాడ ధర్నాచౌక్ దీక్షా శిబిరంలో..

సీఎం సానుకూలంగా స్పందించాలి..

ధర్నాచౌక్ : తమ సమస్యల పట్ల సీఎం జగన్ సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 32 రోజులుగా చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహిస్తున్న రిలే నిరహారదీక్ష ఎనిమిదో రోజు శుక్రవారం కొనసాగింది. సమస్యలు పరిష్కారించినప్పుడే తమకు నిజమైన పండుగ అన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేయకుండా సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని ముఖ్యమంత్రిని కోరారు. లబ్దిదారులు, సామాన్య ప్రజలు సైతం తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంచి వార్త వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీసీ వర్గాల రక్షణకు ప్రత్యేక చట్టం

- ప్రచార రథాలను ప్రారంభించిన నెట్టెం రఘురాం, శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, జనవరి 12 : బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన టీడీపీ బీసీ వర్గాల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువస్తుందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యే, జాతీయ తెలుగుదేశం కోశాధికారి శ్రీరాం తాతయ్య, రాష్ట్ర బీసీ ఫెడరేషన్ సెక్రటరి వీరంకి గురుమూర్తిలు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో బీసీ వర్గాలపై హత్యాచారాలు, వేధింపులు పెరిగాయని, స్థానిక సంస్థల్లో 10శాతం రిజర్వేషన్లు కోతపెట్టి వేలాది మందికి రాజకీయ అవకాశాలను జగన్ ప్రభుత్వం దెబ్బతీసిందని వారు ఆరోపించారు. శుక్రవారం జగ్గయ్యపేటలో జయహో బీసీ ప్రచార రథాలను కమలా సెంటర్ మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీసీలకు సంక్షేమ పథకాలను అమలు చేయటంలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, విజయవాడ పార్లమెంట్ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి గడ్డం హుస్సేన్, రాష్ట్ర బీసీ సెల్ నేత కర్రి చిన్నా, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, గట్టిడి దుర్గాప్రసాద్, గింజుపల్లి రమేశ్, ఆవుల రామారావు, కొర్రకూటి సైదులు పాల్గొన్నారు.


జయహో బీసీ ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న నెట్టెం, తాతయ్య

● పెనుగంచిప్రోలులోని పంక్షన్‌హాల్లో జయహో బీసీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు చింతల వెంకట సీతారామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సభలో నెట్టెం రఘురాం మాట్లాడుతూ, బీసీలను జగన్ ప్రభుత్వం కక్ష గట్టి అణగదొక్కుతున్నదని వీరి అరాచకాలను నేటి నుంచి గ్రామాల్లోని ప్రతి ఇంటికి వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకునేందుకు బీసీలు పనిచేయాలని సూచించారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి : కాగిత

బంటుమిల్లి : రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి పాటుపడింది టీడీపీయేనని పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లి పార్టీ కార్యాలయంలో జరిగిన 'జయహో బీసీ' సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో బీసీలను ఉక్కుపాదం మోపి అణిచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కేటాయించకుండా ప్రభుత్వం కాలం గడిపిందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు సాదరబోయిన ఏడుకొండలు మాట్లాడుతూ, వైఎస్ కుటుంబం బీసీలపై కక్షకట్టి పరిపాలన చేసిందని, బీసీలలో కులాలు పెరిగినా రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేశారన్నారు. బొడ్డు వేణు గోపాలరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో కులచిచ్చులు రగిలిస్తూ ఆనందాన్ని పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంకే నారాయణప్రసాద్, రేవు గోపాలకృష్ణ, పరసా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు బెయిల్

నూజివీడు టౌన్ : నూజివీడు సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న తిరువూరు టీడీపీ కార్యకర్తలకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ఈ నేపథ్యంలో టీడీపీ నేత కేశినేని చిన్ని ఏలూరు జిల్లా నూజివీడు సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న వారిని కలిశారు. సంక్రాంతికి ముందే పదిమంది టీడీపీ కార్యకర్తలు విడుదల సంతోషకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

ఓట్లు తొలగింపు అక్రమం!

- విచారణకు హాజరైన పెద్దాపురం ఓటర్లు
- తమవి దొంగ ఓట్లు కాదని కలెక్టర్‌కు విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో టీడీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు సంబంధించి గ్రామస్థులు కలెక్టర్ ఢిల్లీరావుకు అప్పీల్ చేసిన నేపథ్యంలో శుక్రవారం విజయవాడలోని కలెక్టరేట్‌లో విచారణ నిర్వహించారు. విచారణకు ఓటు కోల్పోయిన బాధితులు హాజరయ్యారు. బాధితుల తరపున న్యాయవాది నెలిబండ్ల బాల వాదనలు వినిపించారు.

పెద్దాపురంలో ఉంటూ పనులు వేరే చోట చేసుకుంటున్నారని 50 మంది టీడీపీ సానుభూతిపరుల ఓట్లను ఇటీవల అధికారులు తొలగించటం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈక్రమంలో బాధితులు న్యాయపోరాటానికి సిద్ధపడ్డారు. కలెక్టర్‌కు అప్పీల్ చేయగా శుక్రవారం విచారణ జరిపారు. బాధిత ఓటర్లంతా తాము పెద్దాపురంలో ఉంటున్నామనటానికి సాక్ష్యాలు చూపారు. మరోచోట ఓట్లు లేవని తెలిపారు. తమ ఓట్ల తొలగింపునకు అధికారులను కారణం అడగ్గా.. స్థానికంగా ఉండటం లేదని చెబుతున్నారని తెలిపారు. తామంతా ఉపాధి కోసం బయటపనులకు వెళుతుంటామని తెలిపారు. అర్ధగంటలో ఊరికి చేరుకునే ప్రాంతాలకే వెళతాము తప్పితే.. ఆయా ప్రాంతాలలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకోలేదని తెలిపారు. ప్రతిసారి ఇక్కడి నుంచే ఓట్లు వేస్తున్నామని తెలిపారు. బాధిత ఓటర్ల తరపున న్యాయవాది నెలిబండ్ల బాల వాదనలు వినిపించారు. చట్టం ప్రకారం తొలగించిన ఓటర్లంతా అర్హత కలిగిన వారేనన్నారు. పెద్దాపురంలో ఓటు కలిగిన వారు ఇతర ప్రాంతాలలో పనులు చేసుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. స్థానికంగా లేనంత మాత్రాన వారి ఓట్లను తొలగించటానికి లేదని వాదించారు. దీనిపై కలెక్టర్ ఢిల్లీరావు స్పందిస్తూ ఎక్కడ పనులు చేసుకుంటున్నారో అక్కడికే ఓటు హక్కు మార్చించుకోవచ్చు కదా అని చెప్పగా.. ఓటు హక్కును మార్చించుకోవటానికి వారేమీ సుదూర ప్రాంతాల్లో పనులు చేయటం లేదని.. గొల్లపూడి, మంగళగిరి, జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలలోనే పనులు చేసుకుంటున్నారని, వీరున్న ప్రాంతానికి రావటం అర్ధగంట సమయం కూడా పట్టదని తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం మరోచోట పనులు చేసుకుంటున్నా వారి సొంత ప్రదేశంలో ఓటు హక్కు ఉంటే తప్పు కాదన్నారు. అధికార వైసీపీ ప్రోద్బలంతోనే 49 ఫామ్-7లను ఇచ్చారని, ఒక వ్యక్తి 49 ఫామ్-7లను ఇవ్వటం నిబంధనలకు విరుద్ధమని. ఫిర్యాదు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


కలెక్టర్ విచారణకు న్యాయవాదితో హాజరైన పెద్దాపురం బాధితులు

రొయ్యూరులో ఇసుక అక్రమ దందా!

- జీవో పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు
- పర్యావరణ చట్టాలకు తూట్లు
- తవ్వకాలకు అనుమతి లేదు : తహసీల్దార్

తోట్లవల్లూరు, జనవరి 12 : పర్యావరణ మార్గదర్శకాలను మరిచి, అధికారుల అనుమతి లేకుండా ఓ సంస్థ భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టింది. పగలు రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు చేస్తోంది. వివరాలలోకి వెళితే.. జిసికెసి ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ (ప్రై)లిమిటెడ్ సంస్థ రొయ్యూరు పెద్దపేటిపాయలో శుక్రవారం ఇసుక తవ్వకాలు చేపట్టింది. మధ్యాహ్నం నుంచి రాత్రివరకు భారీగా తవ్వకాలు చేపట్టింది. అదేమని స్థానికులు ప్రశ్నిస్తే.. ప్రభుత్వం తమకు కృష్ణాజిల్లాలో క్వారీలు అప్పగించిందని సదరు సంస్థ సిబ్బంది చెబుతున్నారు. అయితే వాల్టా చట్టం, పర్యావరణ నిబంధనలు అమలయ్యేలా అధికారుల చేత అనుమతి పొందిన తరువాతే ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉండగా ఏసర్వే నెంబరులో ఎంత మేర తవ్వాలన్న నిబంధనలను పక్కన పెట్టేసి ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరకట్ట వెంట స్టాక్‌యార్డుల్లో ఇసుకను అమ్మేశాక ఇపుడు క్వారీలపై యంత్రాలతో దండయాత్ర చేపట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. జీవో పేరుతో ఇసుక తవ్వుకుపోవటం విమర్శలకు తావిస్తోంది.


రొయ్యూరులో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు

తవ్వకాలకు అనుమతి లేదు : తహసీల్దార్

రొయ్యూరు క్వారీలో ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతి లేదని, తవ్వకాలను నిలిపివేయాలని సిబ్బందికి స్వయంగా చెప్పటం జరిగిందని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. సంస్థ ప్రతినిధి చూపిన జీవోలో కృష్ణాజిల్లా అని ఉందని, కాని రొయ్యూరులో తవ్వకాలు జరుపుకునేందుకు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఇసుక తవ్వకాలు జరపకుండా చూడాలని ఎస్ఐకి సూచించినట్టు చెప్పారు.

కార్మికులకు పని కల్పించాలి : మోర్ల శివశంకర్

రొయ్యూరు పెద్దపేటిపాయలో చేపట్టిన ఇసుక తవ్వకాలకు అధికారులు అనుమతి ఇచ్చి కార్మికులకు పని కల్పించాలని రొయ్యూరుకు చెందిన ఇసుక కార్మిక నాయకుడు మోర్ల శివశంకర్ తెలిపాడు. గతంలో జేసీ మాధవీలత ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపడితే కార్మికులకు పని కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు ఎవ్వరు పట్టించుకోలేదని తెలిపాడు.


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న కేశినేని శివనాథ్

నాని రాజకీయ ఎదుగుదల చంద్రబాబు బిక్షే

- తిరువూరు విజయోత్సవ సభలో కేశినేని చిన్ని

తిరువూరు, జనవరి 12 : తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే కొందరు.. టీడీపీ జాతీయ అధ్యక్షుడిపై అవాకులు చవాకులు పేలుతున్నారని, పార్టీ మారాలనుకుంటే మారండి.. కానీ మీ ఎదుగుదలకు రాజకీయ బిక్షపెట్టిన పార్టీని, నాయకుడ్ని విమర్శిస్తే ఉపేక్షించేది లేదని విజయవాడ పార్లమెంట్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని)హెచ్చరించారు. ఈనెల 7న పట్టణంలో జరిగిన 'రా కదలిరా' సభ విజయోత్సవ సమావేశం శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సభ విజయవంతానికి సహకరించిన పార్టీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామిదాసుకు పార్టీలో ఐదుసార్లు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే రెండుసార్లు గెలిచి మూడుసార్లు ఓడిపోయినా ఆయన భార్యను జడ్పీచైర్‌పర్సన్‌గా చేసిన చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, ఆయన మాటలు ప్రజలు విశ్వసించరని అన్నారు. మరొకరు పార్లమెంట్ పరిధిలో 60 శాతం పార్టీని ఖాళీ చేస్తానని ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నాడని నానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ క్రమశిక్షణ గల పార్టీ అని, ఎవరు ఉన్నా.. లేకపోయినా.. కార్యకర్తల బలం పార్టీకి ఎప్పుడూ ఉంటుందన్నారు. రాజధాని అమరావతే అని.. స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడిన వారు అమరావతిపై నిస్సిగ్గుగా ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. చంద్రబాబుకు తాను విధేయుడిగా ఉంటానని, తమ కుటుంబంలో ఒకరికి రెండుసార్లు ఎంపీ సీటు ఇచ్చారని ఈ సందర్భంగా చిన్ని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, గన్నె ప్రసాద్, మండల నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాబు వెంటే ఉంటాం..

'మాకు పార్టీ ముఖ్యం.. ఎంతటి నాయకుడైనా పార్టీ క్రమశిక్షణ మీరితే ఉపేక్షించబోం.. వారి వెంట వెళ్లేది లేదు' అని పలువురు సీనియర్లు పేర్కొన్నారు. చంద్రబాబు విజయోత్సవ సభకు హాజరైన టీడీపీ నేతలు ఇటీవల పార్టీని వీడిన నేతలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. పార్టీని అభిమానించి వారివెంట నడిచామని, వారిస్వార్థం కోసం పార్టీని వీడినా.. తమకు పార్టీనే ముఖ్యమన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

మహోత్సవంలా బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

- విజయవంతానికి అధికారులు కృషి చేయాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, జనవరి 12 : సామాజిక న్యాయస్ఫూర్తికి ప్రతిరూపమైన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం ప్రారంభ మహోత్సవం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ఈనెల 19న జరగనుందని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. సీపీ కాంతిరాణా, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితి సింగ్, డీసీపీ విశాల్ గున్నీ తదితరులతో కలిసి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. పటిష్ట భద్రత, బందోబస్తు, బారికేడింగ్, పార్కింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, రవాణా, సభావేదిక తదితరాల ఏర్పాట్లపై చర్చించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ అనంతరం విజయవాడ స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ వుంటుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రజలు వస్తారని, జిల్లాల వారీగా బస్సుల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలోని వివిధ కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయాలని, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీఆర్‌వో ఎస్వీ నాగేశ్వరరావు, డీసీపీలు వి.అజిత, చక్రవర్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వీకే విజయశ్రీ, వీఎంసీ అదనపు కమిషనర్ కె.శకుంతల, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈఈ ఎల్.రమాదేవి, రెవిన్యూ పోలీస్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, సమాచార, పౌరసంబంధాలు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం!

- 12 లక్షలకు టోకరా

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 12 : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ. 12 లక్షలకు టోకరా వేసిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. ఉప్పలపాటి అనిల్‌వర్మ రామకృష్ణాపురం ప్రాంతంలో ఉంటాడు. హైదరాబాద్‌కు చెందిన సాయినాథ్‌తో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అనిల్‌వర్మకు సాయినాథ్ చెప్పాడు. దీంతో అనిల్‌వర్మ అతని పరిచయస్తులైన మరో ఇద్దరు సాయినాథ్‌కు రూ.12 లక్షలు ముట్టజెప్పారు. ఏడాది కావస్తున్నా ఎలాంటి సమాధానం రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రహదారిపై కారు దగ్ధం

- ఇద్దరికి స్వల్ప గాయాలు



జగ్గయ్యపేట రూరల్ : చిల్లకల్లు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో కారు దగ్ధమైంది. ఘటనలో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న కారు ముందు వెళుతున్న లారీని ఢీకొనటంతో కారులో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో గోదావరి జాన్సన్‌కు కాలు విరగగా అఖిల్ స్వల్ప గాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసినట్టు చిల్లకల్లు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	100, 108, 119
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

ఎమ్మెల్యే అనుచరులను వెంటనే అరెస్టు చేయాలి: సత్యబాబు

చిట్టినగర్, జనవరి 12: సచివాలయ ప్లానింగ్ సెక్రటరీపై దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు 175 సచివాలయం పరిధిలో 23 గజాల్లో నిర్మాణం చేసుకున్న యాజమాని నుంచి డబ్బులు ఇప్పించలేదని ప్లానింగ్ సెక్రటరీపై ఎమ్మెల్యే అనుచరులు దాడి చేసి గాయపర్చడం దారుణమని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేయటం సరికాదని, వైసీపీ అధికారంలో ఉద్యోగ, కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. 175 సచివాలయం ప్లానింగ్ సెక్రటరీపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకుంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ప్రతిభా పురస్కారాల రిజిస్ట్రేషన్‌కు ఆహ్వానం

గవర్నర్‌పేట: స్వామి వివేకానంద నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డ్స్, సంక్రాంతి విశిష్ట సేవా, ప్రతిభ పురస్కారాల ప్రదానానికి వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సర్వేజనాః సుఖినో భవంతుసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న హైదరాబాద్‌లో పురస్కార ప్రదాన మహోత్సవం జరుగుతుందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలోని ఉపాధ్యాయులు, వైద్యులు, వివిధ రంగాల సమాజ సేవకులు, నృత్య గురువులు, రంగస్థల, నృత్య కళాకారులు, సంగీతం, సాహిత్యం, యోగా, మెడిటేషన్, కరాటే రంగాల్లో ప్రతిభావంతులు ఈనెల 20లోగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9652347207లో సంప్రదించాలని తెలిపారు.

వివేకానంద బోధనలతో స్ఫూర్తి పొందాలి

గవర్నర్‌పేట, జనవరి 12: జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎంజీ రోడ్డులోని రామమోహన్ గ్రంథాలయంలో శుక్రవారం వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యంలో వివేకానంద సందేశాలతో నేటి యువత స్ఫూర్తిని పొందాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, కార్యదర్శి వేములపల్లి కేశవరావు, సభ్యులు పి. చిదంబరేశ్వరరావు, ఎం. పవన్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు స్వామి వివేకానం 2కే రన్ నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని రామమందిరం సెంటర్ నుంచి బీసెంట్ రోడ్డు మీదుగా రాఘవయ్య పార్కు వద్ద గల వివేకానంద విగ్రహం వరకు రన్ నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి ఏబీవీపీ నేతలు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఏబీవీపీ రాష్ట్ర సంఘటన మంత్రి చిరిగే శివకమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకట గోపి, నేతలు దుర్గా స్వామి, అఖిల్, సుబ్రహ్మణ్యం, అభి, యశ్వంత్ పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక వివేకానంద సెంటినరీ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ విజయవాడ ప్రెసిడెంట్ కదం ధాత్రి పాఠశాల ఆవరణలో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి



రామ్మోహన్ గ్రంథాలయంలో వివేకానంద చిత్రపటానికి నివాళి

నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు వివేకానందుడి వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. పళ్లా నాగరాజు, వీరంకి పవన్‌కుమార్, గణేష్‌బాబు, నందకిషోర్, శశికుమార్, మహ్మద్ ఖైఫ్, కదం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మొగల్రాజపురం: జనశిక్షణా సంస్థాన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగళ్ల విద్యాఖన్నా ఆధ్వర్యంలో మొగల్రాజపురం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనశిక్షణా సంస్థాన్ రిసోర్స్ పర్సన్ పి. వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆమె మాట్లాడుతూ వివేకానంద బోధనల నుంచి ఆయన జీవితం నుంచి యువత ప్రేరణ పొందాలని సూచించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డి. కోటేశ్వరరావు, సిబ్బంది, శిక్షకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

వన్‌టౌన్: కేబీఎన్‌లో శుక్రవారం వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి



స్వామి వివేకానంద వేషధారణలో చిన్నారులు

వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు సమర్పించారు. ఎన్ఎస్ఎస్, కళాశాల సంయుక్త విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

● పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జున రావు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో అనంతపురానికి చెందిన సంస్కృత పండితుడు ఎం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సందేశమిచ్చారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ పరచూరి లక్ష్మణస్వామి, వైస్ ప్రిన్సిపాల్ ఏ. పతంజలి శాస్త్రి, ఎన్ఎస్ ఎస్ పీవో శ్రీకాంత్‌రెడ్డి, కో- ఆర్డినేటర్లు నవీన్, డాక్టర్ నరేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మొబైల్ అన్న క్యాంటీన్

విద్యాధరపురం, జనవరి 12: కేశినేని ఫౌండేషన్ శుక్రవారం స్వాతి థియేటర్ వద్ద నిర్వహించారు పత్తి నాగేశ్వరరావు, వల్లభనేని లక్ష్మీ ప్రసన్న, సోమి వెంకటేశ్వర్లు, రాజగిరి అశోక్, గుండు సుధాకర్, బోకం సత్తిబాబు, రమేష్‌రెడ్డి, వరద వెంకటేష్, లంకలపల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న కళ్లే లలిత ట్రస్ట్ సభ్యులు

పేదలకు అన్న సంతర్పణ

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 12 : కళ్లే లలిత భౌతికంగా దూరమైన నాటి నుంచి ప్రతి నెల 12న క్రమం తప్పకుండా సింగ్‌నగర్‌లో ఆమె పేరుతో అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు లలిత విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మీ, కళ్లే జయదుర్గ, మేఘవాణీలు, ముప్పూరి హరీష్, జశ్విన్, జి. ధ్రువన్, స్థానికులు పాల్గొన్నారు.

కుందావారి కండ్రికలో పశు వైద్యశిబిరం

పాయకాపురం, జనవరి 12 : వ్యవసాయానికి పాడి తోడైతేనే రైతులకు గిట్టుబాటు ఉంటుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ కుందా వారి కండ్రికలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు పోషకులు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం తరువాత పశువుల పెంపకం ప్రధానంగా ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 12 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని డాబా కోట్లు సెంటర్, లారీల బజార్, కృష్ణ హోటల్ సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్డు, యాడ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు ముగ్గులు

సత్యనారాయణపురం, జనవరి 12: మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా రంగవల్లులు నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాత అన్నారు. సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు దెందుకూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ముత్యాలంపాడు అల్లూరిసీతారామరాజు రోడ్డులో ముగ్గులు పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపు కోవడం వల్ల బంధాలు పటిష్టం అవుతాయని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన ముగ్గురికి బొండా సుజాత చేతుల మీదుగా ముత్యాలహారాల ప్రదానం జరిగింది. మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎస్. సాంబశివరావు, సందిరెడ్డి గాయత్రి, పడమటి రామకృష్ణ, రామలింగరాజు, బాబి, బెజ్జం సురేష్, చంటి, సురేష్ వర్మ, శేషమ్మ, చిన్ని, శారద ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లబ్బీపేట: హోటల్ ఫార్చ్యూన్ మురళిలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. హోటల్ పరిసరాలు శోభయమానంగా తీర్చిదిద్దారు. హోటల్ ఆవరణలో భోగి మంటలు, చిలక జోతిష్యం, గంగిరెద్దుల అటలు, హరిదాసుల కీర్తనలతో పాటు కోడిపందాల ఆటలతో పండుగ వేడుకలు నిర్వహించారు. అతిథులుగా నాబార్డ్ సీజీఎం ఎంఆర్ గోపాల్, హెచ్‌పీసీఎల్ ఆర్ఎం ఆదిత్య, అల్‌కన్ ల్యాబ్స్ ఆర్ఎంలు రత్నకర్, అమర్‌నాథ్, పోటాకల్ డిపార్ట్‌మెంట్ రాజభవన్ పరమేశ్వరరావు, మురళి ఫార్చ్యూన్ జీఎం విజయకృష్ణ, సేల్స్ మేనేజర్స్ పవన్, జిలానీ పాల్గొన్నారు.

కృష్ణలంక: స్థానిక



ముగ్గులు పరిశీలిస్తున్న, బొండా సుజాత, దెందుకూరి మురళీకృష్ణంరాజు

మెట్లబజారులోని వాసవీ సేవా సం ఘం అధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శుక్రవారం బహుమ తులు పంపిణీ చేశారు. సంఘం సభ్యులు చందలూరి వెంకట సుబ్బారావు, మట్టా సుబ్బారావు, శనగపల్లి మల్లిఖార్జునరావు గుప్తా, నిచ్చెనమెట్ల గోపాల్‌శెట్టి పాల్గొన్నారు.

వన్‌టౌన్: కాకరపర్తి భావన్నారాయణ కళాశాల కేబీఎన్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగాయి. కళాశాల ఉమెన్స్‌స్టడీ సెంటర్ ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు నిర్వహించిన ముగ్గుల పోటీ ఎంతో ఉత్సాహ భరితంగా సాగాయి. గాలి పటాల పోటీలు, మెహిందీ, పిండివంటల పోటీలు జరిగాయి. శనివారం సంప్రదాయ వస్త్రధారణ, భోగిపళ్లు, గంగిరెద్దుల ఆటలు తదితరాలు జరగనున్నాయి. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు,పీఎల్



హోటల్ ఫార్చ్యూన్ మురళిలో

రమేష్, స్టడీ సెంటర్ కన్వీనర్ విశైలజ, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి. కృష్ణవేణి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు కరీంబీర్ కౌర్, శ్రీదేవి పాల్గొన్నారు.

● పొట్టిశ్రీరాములు కాలేజీలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గొబ్బెమ్మలు, వివిధ రకాల ముగ్గులు, రంగు రంగుల గాలిపటాలు అలరించాయి. కళాశాల అధ్యక్షుడు చలువాది మల్లిఖార్జునరావు భోగి మంటలను వెలిగించారు. విజేతలకు బహుమతులు అంద చేశారు. కళాశాల సెక్రటరీ పరచూరి లక్ష్మణ స్వామి, కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు హరగోపాల్, సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ జే.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ పతంజలి శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పాయకాపురం, జనవరి 12 : కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్(చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన నివాసంలో శుక్రవారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టీడీపీ జిల్లా మీడియా కో-ఆర్డినేటర్ ఎద్దుపాటి రామయ్యలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

బుద్దా వెంకన్నను కలిసిన బాడిత శంకర్



వన్‌టౌన్: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి బుద్దా వెంకన్నను వన్‌టౌన్‌లోని ఆయన కార్యాలయంలో జనసేన నాయకుడు బాడిత శంకర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకన్నకు పుష్పగుచ్ఛం ఇచ్చి , దుశ్శాలువా కప్పి సత్కరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కలిసి పోటీ చేయనుండడం తదితర అంశాలపై కొద్దిసేపు ముచ్చటించారు.

కేశినేని నానీ...స్థాయిని మించి మాట్లాడొద్దు

టీడీపీ నాయకులు బేగ్, గన్నె అన్న

వన్‌టౌన్, జనవరి 12: కేశినేని శ్రీనివాస్ (నాని) తన స్థాయిని మించి వ్యాఖ్యలు చేస్తున్నాడని సీనియర్ టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్(అన్న) వ్యాఖ్యానించారు. టీడీపీ పశ్చిమ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2019లో గద్దె రామ్మోహన్‌ని కాదని ఎంపీ సీటు ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లతో పాటు కార్యకర్తలను కూడా నాని ద్రోహం చేశాడన్నారు. జగన్‌రెడ్డి అవినీతి పరుడని వ్యాఖ్యానించి అతని పంచనే చేరిన నాని ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సొంత ప్రయోజనాల కోసం ఒంటెద్దు పోకడతో పార్టీ మారి అందరినీ నాని అభాసుపాలు చేశాడన్నారు. ఇంకొకసారి చంద్రబాబు, లోకేశ్‌ను ఏమైనా అంటే ఊరుకునేది లేదని, స్థాయిని మించి మాట్లాడవద్దని హెచ్చరించారు. రాధాకృష్ణ, సుబ్బారెడ్డి, సుకాశి సరిత, నాయకులు పాల్గొన్నారు,

అమ్మవారి ఐశ్వర్య దీపాల ఊరేగింపు

గవర్నర్‌పేట, జనవరి 12: మార్గశిర మాసం పండుగ పూజలు ముగింపు సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి అమ్మవారి మందిరంలో శుక్రవారం అమ్మవారికి ఐశ్వర్య దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు జాకెట్ ముక్కలు, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అనంతరం లెనిన్ సెంటర్ మీదుగా ఐశ్వర్య దీపాలు చేత పట్టుకుని మహిళలు ఊరేగింపు నిర్వహించారు.

స్మృతివనం విద్యుత్ పనుల పరిశీలన

గవర్నర్‌పేట: సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కె. సంతోషరావు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వద్ద జరుగుతున్న విద్యుత్ శాఖ పనులను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం రోడ్డులో అడ్డుగా ఉన్న 33కేవీ హెచ్‌టి సర్వీసును పరిశీలించారు. సీఎండీ వెంట కార్పొరేషన్ విజయవాడ ఎస్ఈ ఏ. మురళీమోహన్, టౌన్ ఈఈ బీవీ సుధాకర్, ఏడీఈ పి. శ్రీధర్, సూర్యారావుపేట, మొగల్రాజపురం ఏఈలు ఉన్నారు.

వేసవిలో ప్రేక్షకుల ముందుకు



పురాణ, ఇతిహాసాలను ఆధారం చేసుకొని, దానికి సైన్స్ ఫిక్షన్‌ని జత చేసి, భవిష్యత్తును అద్భుతంగా ఊహిస్తూ... దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమాను మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాత సి.అశ్వనీదత్ ప్రకటించారు. కాశీ, ముంబై, ఢిల్లీ, చండీగఢ్, చెన్నై, మధురై, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, భీమవరం, విజయవాడ, కశ్మీర్‌తో సహా దేశంలోని పలు నగరాల్లో రైడర్‌ల ద్వారా ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ విభిన్నంగా ప్రకటించారు. 'వైజయంతీ మూవీస్ 50ఏళ్ల ప్రయాణంలో మే 9వ తేదీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. మా సంస్థ నుంచి వచ్చిన జగదేకవీరుడు-అతిలోకసుందరి, మహానటి, మహర్షి చిత్రాలు అదే తేదీలో విడుదలై అఖండ విజయాలను చవిచూశాయి. అమితాబ్, కమల్, ప్రభాస్, దీపిక పదుకొనే వంటి ప్రతిభావంతులైన ఆర్టిస్టులు కలిసి నటిస్తున్న ఈ చిత్రం వైజయంతీ మూవీస్ చరిత్రలోనే మైలురాయిలా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలం' అని నిర్మాత అశ్వినీదత్ పేర్కొన్నారు. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: సంతోశ్ నారాయణ్,



రిపబ్లిక్ డేకు మిల్లర్ రాక

ధనుష్ కథానాయకుడిగా రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్దార్థ్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగు వెర్షన్ మినహా మిగిలిన భాషల్లో శుక్రవారం రిలీజ్ చేశారు. తెలుగులో మాత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులు కొనుగోలు చేసిన ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం తెలిపాయి. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, శివరాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

చెప్పినదానికంటే గొప్పగా తీశాడు

'సైంధవ్' రెగ్యులర్ కథ కాదు. డిఫరెంట్ జానర్. కథ డిమాండ్ మేరకే ఎమోషనల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. అవి కూడా నేచురల్‌గా ఉంటాయి. నా వరకూ ఈ సినిమా విషయంలో ప్రత్యేకంగా నచ్చిన అంశం ఏంటంటే.. కూతురు సెంటిమెంట్. చాలారోజుల తర్వాత ఎమోషన్స్ పలికించే అవకాశం వచ్చింది. నటుడిగా నాకిది కొత్త జానర్' అన్నారు అగ్రనటుడు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్'. నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకరులతో మాట్లాడారు.

చాలామంది హీరోలు కెరీర్ పరంగా యాభై, డెబ్భై ఐదు, వంద.. ఇలాంటి నంబర్లను మైలురాళ్లుగా భావిస్తుంటారు. దాంతో ఒత్తిడి సహజం. నాకైతే అలాంటి ఒత్తిడి ఏమీ లేదు. 75 అనేది నా వరకూ నంబర్ మాత్రమే. ప్రతి సినిమాకూ నిజాయితీగా నిబద్ధతతో పనిచేయాలనేది నా సిద్ధాంతం. 75వ సినిమాతో అయిపోలేదు.. ఇంకా చాలా ప్రయాణం మిగిలుంది.

- దర్శకుడు శైలేశ్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. అద్భుతమైన కథతో నా దగ్గరకొచ్చాడు తను. చెప్పినదానికంటే గొప్పగా తీశాడు. లొకేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ మాదిరిగా అందరితో కలిసిపోయి పనిచేశాడు. ముఖ్యంగా క్లైమాక్స్‌ని ఎక్స్‌ట్రార్డినరీగా డిజైన్ చేశాడు. కథ నడిచే తీరు కూడా కొత్తగా ఉంటుంది. ఇదంతా శైలేష్ గొప్పతనమే.
- ఇది చైల్డ్ సెంటిమెంట్ మూవీ. ఇందులో నా కూతురుగా బేబీ సారా నటించింది. ఆ అమ్మాయిలో గొప్ప స్పార్క్ ఉంది. అద్భుతంగా నటించింది. మా ఇద్దరిపై తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేస్తాయి. ఓ విధంగా ఈ కథ తనదే.
- దేశం గర్వించదగ్గ నటుడు నవాజుద్దీన్ సిద్దిఖీ.. అతనితో కలిసి పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 'గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్' నుంచి ఆయన ప్రయాణం విలక్షణంగా సాగుతోంది. ఇందులో ఆయనది చాలా క్రేజీ రోల్. సాధారణ సందర్భాల్లో కూడా విభిన్నంగా నటించే నటుడు నవాజుద్దీన్. ఇందులో ఆయన మార్క్ నటనను చూస్తారు.
- నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. కథ డిమాండ్ మేరకు 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షన్ సిటీని నిర్మించారాయన. డ్రగ్స్, గన్స్ ఇలాంటి హాలీవుడ్ తరహా కల్చర్ తెరపై కనిపిస్తుంది. ఇదంతా దర్శకుడి సృజన. 'సైంధవ్' సినేరియా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తర్వాత ఇలాంటి కథలు ఇంకొన్ని వస్తాయి. ఇక నా విషయానికొస్తే కథలు వింటున్నాను. చేయబోతున్న సినిమాల గురించి త్వరలో చెబుతా.

వెంకటేశ్





డేట్ కుదిరింది



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 23న 'తిరగబడరా సామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'యువతను ఆకట్టుకునే రొమాన్స్, కుటుంబ ప్రేక్షకులను ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ను అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. మనారా చోప్రా ప్రత్యేకగీతంలో నర్తించారు' అని యూనిట్ తెలిపింది. మకరంద్‌దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత ఠాకూర్, రాజా రవీంద్ర కీలకపాత్రలు పోషించారు. సంగీతం:జేబీ. సినిమాటోగ్రఫీ: జవహర్ రెడ్డి ఎం.ఎన్

తంత్ర గీతం వచ్చింది




అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి, సలోని ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి., రవిచైతన్య నిర్మించారు. ఈ చిత్రం నుంచి అనురాగ్ కులకర్ణి ఆలపించిన 'ధీరే ధీరే' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, నటి అనసూయ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'అనురాగ్ కులకర్ణి అద్భుతంగా ఆలపించిన గీతమిది. త్వరలో ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఫస్ట్ లుక్, టీజర్‌కు వస్తున్న ఆదరణ మాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. వినూత్నమైన అంశాలతో ప్రేక్షకులకు వినోదం పంచే చిత్రమిది' అన్నారు.





సోదర ద్వయం దర్శకత్వంలో

వరుస వైఫల్యాలను అధిగమించి 'విక్రమ్' చిత్రంతో తిరిగి హిట్ బాట పట్టారు కమల్‌హాసన్. ఆ సక్సెస్ ఇచ్చిన ఉత్సాహంతో వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఆయన మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' చిత్రం చేస్తున్నారు. షూటింగ్ జరుగుతోంది. దీంతో పాటు ఆయన కథానాయకుడిగా ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. 'కేహెచ్ 237' అనేది వర్కింగ్ టైటిల్. ఆర్ మహేంద్రన్‌తో కలసి కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు అన్బు, అరివు సోదర ద్వయం 'కేహెచ్ 237'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని కమల్‌హాసన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అన్బు అరివ్‌తో దిగిన ఫొటోను కమల్‌హాసన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.









రకరకాల రుచులను ఆస్వాదించటంలో తెలుగువారికి ఎవరూ సాటిరారు. మన పూర్వ కవులు ఎందరో ఈ విషయాలను వర్ణించారు. శృంగార నైషధంలో శ్రీనాధుడు- దమయంతి పెళ్లికి వడ్డించిన అనేక వంటలను వాటి రుచులను- బువ్వబంతి పేరిట పేర్కొంటాడు. ఇలాంటి అచ్చ తెలుగు వంటకాలను ఈ సంక్రాంతికి మీరు కూడా ఆస్వాదించండి.

దమయంతి పెళ్లి వంటలివే

ఇడ్డరికలు

ఇప్పుడైతే ఇడ్డెన్లు (ఇడ్లీలు) అందరూ చేసుకుంటున్నారు. కానీ ఒకప్పుడు ఇడ్డరికలు పండగలలో చేసుకొనే వంటే! కంచిలో వరదరాజస్వామికి కిలోన్నర బరువున్న ఈ ఇడ్డరికను నైవేద్యంగా పెట్టేవారట.

తయారీ విధానం

- మినపప్పు, బియ్యాన్ని సుమారు 6 గంటలు నానబెట్టాలి. ఆ తర్వాత మెత్తగా పిండిలా రుబ్బుకోవాలి. దీనిలో తగినంత ఉప్పు వేయాలి.
- ఈ పిండిలో పెరుగు, మిరియాలు, కొత్తిమీర, అల్లం ముద్దగా చేసి కలపాలి.
- ఈ మిశ్రమంలో ఇంగువ తాలింపు (ఆవాలు, కరివేపాకులు, ఇంగువలను నూనెలో దోరగా వేయించాలి) పెట్టాలి.
- దీనిని పనస ఆకులతో చేసిన దొప్పలలో కానీ.. ఇడ్లీ స్టాండులపై కానీ ఉడికించాలి.

చెట్టు గుత్తొంకాయ కూర

ఇది మహారాజుల విస్తరిలో వడ్డించే కూర. వంగమొక్క నుంచి వంకాయలను కోయకుండా.. అలానే వండే కూర. దీని తయారీ విధానాన్ని శ్రీనాధుడు సవివరంగా వర్ణించాడు. అయితే ఈ కూరకు కావాల్సినవి మంచి లేత వంకాయలతో ఉన్న వంగమొక్క. వీటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకొని పొలం నుంచి ఉదయాన్నే తీసుకురావాలి. ఆ తర్వాత వాటిని బాగా శుభ్రం చేయాలి. ఇలా శుభ్రం చేసిన మొక్కలను మట్టితో నింపిన కుండల్లో గుచ్చాలి.

తయారీ విధానం

- శనగపప్పు, ఎండుమిరపకాయలు, ధనియాలు, కొన్ని కొబ్బరిముక్కలను నెయ్యిలో దోరగా వేయించాలి. దీనిని పొడి చేసి సిద్ధంగా ఉంచుకోవాలి. ఈ పొడిలో ఉప్పు కలుపుకోవాలి.
- వంగమొక్కకు ఉన్న ఒకో వంకాయను నాలుగు ముక్కలుగా చీల్చాలి. అలా చీల్చిన వంకాయలో ముందుగా తయారు చేసుకున్న పొడిని కూరాలి. తర్వాత వంకాయను దారంతో గట్టిగా కట్టాలి. దీని వల్ల పొడి కిందకు రాలదు.
- ఒక లోతైన గిన్నెలో నెయ్యిని బాగా వేడి చేయాలి. బాగా కాగిన నేతిలో వంకాయ ముంచాలి. ఒకటి రెండు నిమిషాలయ్యే సరికి వంకాయ బాగా మగ్గుతుంది.
- ఇలా ఒకో వంకాయను నేతిలో వేయించి- భోజనం చేసే బల్ల మీద వంగమొక్కతో సహా ఉంచాలి. అతిథులు ఈ వంగమొక్క నుంచే వంకాయ కోసుకు తింటారు.

తేమన తక్రం

శ్రీనాథుడి శృంగార నైషధంలో పేర్కొన్న పానీయాలలో ముఖ్యమైనది తేమనం. ఏలకులు, జాపత్రి, లవంగాలు వంటి సుగంధద్రవ్యాలను నూరి.. ఈ ముద్దను నీటితో కలిపితే దానిని 'తేమనం' అంటారు. దీనిని తాగిన వెంటనే దమయంతి పెళ్లికి వచ్చిన అతిధులకు - 'మతులు పోయి.. మాంసాలు శాకాలుగా.. శాకాలు మాంసాలుగా కనిపించాయి' అని శ్రీనాధుడు వర్ణిస్తాడు. ఈ తేమనం నుంచి తయారుచేసేదే తేమన తక్రం. 'తక్రం' అంటే మజ్జిగ.

తయారీ విధానం

- ఏలకులు, జాపత్రి, లవంగాలు, కుంకమపువ్వు, కొద్దిగా చెక్కర వేసి బాగా నూరాలి.
- ఇలా నూరిన పొడిని నీటిలో కలపాలి. దీనిని తేమనం అంటారు.
- ఒక గిన్నెలో గట్టి పెరుగును తీసుకోవాలి. దీనిని బాగా చిలకాలి. దీనిలో తేమనాన్ని కలపాలి. ఒక చిటికడు ఉప్పు కూడా వేయాలి.
- వాము, మెంతులు వేసిన తాళింపును ఈ మిశ్రమంలో కలపాలి. దీనినే తేమన తక్రం అంటారు.

జమిలి మండిగలు

"గుజ్జుగాc గాcచిన గోక్షీర పూరంబు జవిఎలి మండెగలపై జల్లిచల్లి.." అంటూ శ్రీనాధుడు జమిలి మండెగల్ని ప్రస్తావిస్తాడు. ఈ జమిలి మండిగలపై కోవాతో కానీ క్రీముతో కానీ డిజైన్ మాదిరిగా వేస్తారు. శ్రీనాధుడు తన 'శృంగార నైషధం'లో- జమిలి మండిగలపై వేసే డిజైన్ పట్టుచీర జరీ అంచులా ఉందని ముచ్చటపడిపోతాడు. జమిలి మండిగ అంటే బన్నులాంటి పదార్థం. దీనిని బియ్యపు రవ్వతో తయారుచేస్తారు. దీనిలో కోవా లేదా కొబ్బరి లౌజులను ఉంచుతారు. ఈ 'జమిలి మండిగలనే కాలక్రమంలో 'జిల్లేడు కాయలు' అని అంటున్నాం.

తయారీ విధానం

- బియ్యపు రవ్వను నీళ్లు వేసి మెత్తగా కలపాలి. దీనిని ఆవిరిపై ఉడకపెట్టాలి.
- చల్లారిన తర్వాత చిన్న చిన్న ముద్దలుగా చేసుకోవాలి.
- వీటిని చేతిలో కొద్దిగా నేయి వేసుకొని- రొట్టెల మాదిరిగా గుండ్రంగా ఒత్తాలి.
- ఈ రొట్టెల మధ్యలో కొబ్బరి లౌజు లేదా కోవా పెట్టాలి.
- రొట్టెలపైన క్రీముతో అందమైన డిజైన్లు వేసుకోవచ్చు.

చలి కాలంలో సంరక్షణ..

చిన్నపిల్లలు చలికాలంలో ఎక్కువ సమస్యలు ఎదుర్కొంటారు. కంఫర్టుగా ఉండే స్వెటర్స్‌ను తొడగాలి. కాళ్లకు సాక్సులు, చేతులకు గ్లౌజులు వేయాలి. అలాంటప్పుడే చలినుంచి పిల్లలకు ఉపశమనం ఉంటుంది. శిశువు ఏడ్చినా, చర్మం ఎరుపెక్కినా అసౌకర్యంగా ఉంటుందని గ్రహించాలి. దానికి తగినట్లు జాగ్రత్త పడాలి.

- తేలికైన బ్లాంకెట్‌ను కప్పి నిద్రపుచ్చాలి. ఆ బ్లాంకెట్ శిశువు బరువులో పదిశాతం బరువుండాలి.
- కొబ్బరినూనె లేదా ఆవనూనెతో పిల్లలకు మసాజ్ చేయాలి. కాళ్లు, చేతులు, శరీరం మీద మర్దనం చేస్తే రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. దీంతో పాటు వాటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల చర్మ మీద దద్దుర్లు, ఎరుపెక్కడం లాంటి సమస్యలను నివారించొచ్చు. సాధ్యమైనంత వరకూ స్నానానికి ముందే మసాజ్ చేయాలి.
- పాలు తాగిన వెంటనే పొరబాటున కూడా మర్దన చేయకూడదు. దీనివల్ల వాంతులు అవుతాయని తెలుసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు సూర్యరశ్మిలో ఉదయం పూట పిల్లలను ఉంచటం మంచిది. దీనివల్ల ఎముకలు దృఢంగా అవుతాయి. దీంతోపాటు వెచ్చగా ఫీలవుతారు.
- రోజుకు రెండు సార్లు గోరు వెచ్చనీ నీటితో స్నానం చేయించాలి. ముఖ్యంగా ఉదయం పూట చలిగా ఉంటే వెచ్చని నీటిలో మెత్తటి బట్ట ముంచి మర్దనం చేసినట్లు చేయాలి.
- శీతాకాలంలో ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ.. ఎందుకంటే ఇమ్యూనిటీ తక్కువగా ఉంటుంది. అందుకే తల్లి పోషకాలుండే ఆహారం తినాలి. పండ్లు, కాయకూరలు తాజావే తినాలి. దీనివల్ల బిడ్డకు మంచి ఆహారం అందుతుంది. తద్వారా మంచి ఆరోగ్యం కలుగుతుంది.



'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/7Pkq8nhలో చదవండి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/sHyijShలో చదవండి.

సుగంధాల మజ్జిగ

అజాజీ ధాన్యాకైర్మరీచరజనీ మేధికణైః సమంపిష్టం తక్రై క్వథితమమలైః సారక ఫలైః!
యుతం సింధుత్యేన జ్వలితనావాబాహ్లీకసురభిః ప్రలేహః సందేహం జనయతి సుధాయామతిరసః!

అద్భుతమైన దృశ్యాన్ని చూసినప్పుడు 'అరోరా బొరియాలిస్' కనిపించిందంటాం. 'దీర్ఘ ఉషస్సు' అని ఋగ్వేదంలో వర్ణించినట్టు ఆరు నెలలు పగలు, ఆరు నెలలు చీకటి ఉండే ఉత్తర ధృవంలో చీకటికీ.. వెలుగుకీ మధ్య కొన్ని రోజులపాటు ఉండే ఉషస్సు అది. అలాగే ఆంగ్లేయులు కమ్మని రుచికరమైన వంటకాన్ని తిన్నప్పుడు 'ఆంబ్రోజియా' తిన్నట్టుంది అంటారు. గ్రీకు దేవతలకు వండి నైవేద్యం పెట్టే వంటకం 'ఆంబ్రోజియా'. చాలా రుచికరమైనదని ప్రసిద్ధి. ఇదే రీతిలో మజ్జిగను సుగంధభరితంగా తయారు చేసి, అన్నంలో కలుపుకుని తింటే... అది అమృతం కలిసిన అతి రసమా అని భ్రమ పడేలా ఉంటుందంటాడు ఈ శ్లోకంలో క్షేమశర్మ తన క్షేమ కుతూహలం' గ్రంథంలో. అన్నంలో మజ్జిగ పోసుకుని తినే దానికి ఇంత వర్ణన, వివరణ అవసరమా అనే సందేహం కలగవచ్చు. నిజంగా ఆహారాన్ని పరిమళభరితం చేసుకోవటం గురించి మనకు అవగాహన తక్కువ. అల్లం... వెల్లుల్లి కలిపి వండుకోవటం తప్ప మనకు మరో పరిమళం తెలియదు. వెల్లుల్లి వాడకం మితిమీరితే తిన్నవారి శరీరంలోంచి గవులు కంపు వెలువడుతుంటుంది. తమ శరీరంలోంచి ఇతరులు భరించలేని వాసన వస్తున్న సంగతి వాళ్లకి తెలియదు. మద్యం సేవించేవారి నుంచి, పొగ తాగి వచ్చిన వారి నుంచీ వాసన వచ్చినట్టే... వెల్లుల్లి తిన్నవాళ్ల శరీరంలోంచి వెలువడే వాసన ఇబ్బందికరంగా ఉంటుంది.

పై శ్లోకంలో క్షేమశర్మ సూచించినట్టు పరిమళభరితంగా చల్లని, కమ్మని పానీయం ఇలా తయారు చేసుకోవాలి...

జీలకర్ర, ధనియాలు, మిరియాలు... ఈ మూడింటినీ బాండీలో విడివిడిగా పైపైన వేగించాలి. వాటిని మిక్సీ పట్టి, పొడిని సిద్ధంగా ఉంచుకోవాలి. పులవని గట్టి పెరుగులో మూడు రెట్లు నీళ్ల కలిపి, బాగా చిలికి, ఈ పొడిని అందులో కలపాలి. సన్న సెగన ఈ మజ్జిగని బాగా కాయాలి. పొయ్యి మీంచి దింపబోయే ముందు, అందులో కొద్దిగా పసుపు, తగినంత ఉప్పు కూడా కలపాలి. ఒక బాండీలో కొద్దిగా నెయ్యి వేసి, ఇంగువ పొడిని, తాలింపు గింజల్ని, కాసిని మెంతుల్ని వేగించి ఈ మజ్జిగకు తాలింపు పెట్టాలి. మజ్జిగని ఇలా సుగంధ ద్రవ్యాలతో పరిమళ భరితం చేసుకుని తాగితే కమ్మగా ఉంటుంది. అన్నంలో కూడా కలుపుకోవచ్చు. మెంతులు వేసినప్పుడు దీన్ని మెంతి చారు అని, కొద్దిగా వాము కలపితే వాము మజ్జిగ అని కూడా పిలుస్తారు.

క్షేమ కుతూహలం



వేసవారంతో ఇలా...

ఒక చెంచాడు ఇంగువ, 2 చెంచాల అల్లం ముద్ద, 4 చెంచాల మిరియాల పొడి, 8 చెంచాల జీలకర్ర పొడి, 16 చెంచాల పసుపు, 32 చెంచాల ధనియాల పొడికి తగినంత సైంధవ లవణం కలపండి. సుగంధ మజ్జిగలో ఈ పొడిని కలిపి, కాస్తే మరింత గుణవత్తరంగానూ, పరిమళ భరితగానూ ఉంటుంది. ఇందులో విషదోషాల్ని హరించి, పేగుల్ని బాగు చేసి, ఎముకల్ని పెంపు చేసే క్యాల్షియం లాంటివి ఉన్నాయి. అన్నం తిన్న తరువాత ఒక గ్లాసు ఈ సుగంధాల మజ్జిగ తాగితే భుక్తాయాసం ఉండదు. రాత్రి పడుకునే ముందు మూడు గ్లాసులు ఈ సుగంధాల మజ్జిగ తీసుకుని, అందులో మామూలు మజ్జిగ ఒక గ్లాసు కలిపి, మూతపెట్టి ఉంచాలి. ఉదయం నిద్ర లేస్తూనే ఈ మజ్జిగ తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఉపయోగ పడే బాక్టీరియా పుష్కలంగా అందుతుంది.

శీతాకాలం, వానాకాలాలలో కఫాన్ని తగ్గిస్తుంది. వేసవి కాలంలో ఈ మజ్జిగని ఒకటి రెండు గ్లాసులు తాగితే వడదెబ్బ తగలదు. వేసవారం పొడి, కొద్దిగా చెక్కెర, నిమ్మరసం కలిపి తాగితే వడదెబ్బ తగ్గుతుంది. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు మజ్జిగలో మూడు గ్లాసుల నీళ్ల కలిపి, ఒక చెంచా వేసవారం వేసి, మూత పెట్టి, ఫ్రిజ్జులో కాకుండా బయటే ఉంచి, ఉదయం నిద్ర లేస్తూనే తాగితే సమస్త అనారోగ్యాలకూ ఔషధంలా పని చేస్తుంది.

'ప్రలేహః పాచనో హృద్యో రుచ్యో వహ్నిప్రదో లఘు! కఫానిలవిబంధఘ్నః కించిత్పిత్తప్రకోపకః' అని ఈ సుగంధభరితమైన మజ్జిగ ప్రయోజనాలను క్షేమశర్మ వివరించాడు.

ప్రలేహః: కమ్మగా వండిన వంటకం (బ్రాత్) అని
పాచనో: ఇలా కాచిన మజ్జిగని రోజూ తాగితే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది.
హృద్యో: మనసుకి ఇంపుగా ఉంటుంది. అన్నం తినాలనే కోరిక కలిగిస్తుంది.
రుచ్యో: నోటికి రుచిని కలిగిస్తుంది. అరుచి, అన్నం సహించకపోవటం తగ్గుతాయి.
వహ్నిప్రదో: జఠరాగిని పెంపు చేస్తుంది. తద్వారా జీర్ణకోశ వ్యవస్థలోని స్రావాలు ఏవి ఎంత విడుదల అవ్వాలో అంతే విడుదల అయ్యేలా ఈ మజ్జిగ సహకరిస్తుంది.
లఘుః: లఘువుగా ఉంటాయి. శరీరానికి తేలికదనాన్నిస్తాయి. తేలికగా అరుగుతాయి.
కఫానిలవిబంధఘ్నః: కఫాన్ని, వాతాన్ని మలబద్ధకాన్ని పోగొడతాయి. వాత, కఫాల్ని తగ్గించే ద్రవ్యాలన్నీ ఊపిరితిత్తుల్లో సమస్యలపైన, దగ్గు, జలుబు, తుమ్ముల్లాంటి ఎలర్జీ వ్యాధులమీద కూడా పని చేస్తాయి. అంతేకాదు.. షుగరు, స్థూలకాయం ఉన్నవారికి కూడా ఇవి మేలు చేస్తాయి. ఆ వ్యాధులు త్వరగా తగ్గేందుకు సహకరిస్తాయి. గుండె జబ్బులు, బీపీ ఉన్నవారికీ ఉపయోగకరంగా ఉంటాయి.
కించిత్పిత్తప్రకోపకః: కఫాన్ని, వాతాన్ని తగ్గించే ఏ ద్రవ్యం అయినా అంతో ఇంతో పిత్త దోషాన్ని... అంటే శరీరంలో వేడిని పెంచేదిగా ఉండటం సహజం. వేడి శరీరతత్త్వం ఉన్న వారు ఈ సుగంధాల మజ్జిగని పలుచగా, తేలికగా తీసుకోవటం మంచిది.

• గంగరాజు అరుణాదేవి

నోటి దుర్వాసన పోవాలంటే..

ఎదుటి వ్యక్తితో మాట్లాడుతుంటే నోటిలోంచి దుర్వాసన వస్తే.. చాలా ఇబ్బందిగానే ఉంటుంది. ఈ దుర్వాసన పోగొట్టాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే!

- తిన్న ఆహారం దంతాల మధ్య ఇరుక్కుపోవటం, చిగుళ్ల సమస్యలు, ధూమపానం, ఆల్కహాల్, తినే తిండి వల్ల కూడా నోటిలో దుర్వాసన వస్తుంది. ఇలాంటప్పుడు జాగ్రత్తగా బ్రష్ చేయటం, తిన్న తర్వాత పుక్కిలించటం చేయాలి. దీనివల్ల నోటిలో శుభ్రంగా ఉంటుంది.
- నోటిలో చెడు బ్యాక్టీరియా, ఆహారం అరగకపోవటం, జీర్ణసమస్య వల్ల కూడా వాసన వచ్చే అవకాశం ఉంది. దీనికి తగినట్లు ఆహారం తినటంలో జాగ్రత్త వహించాలి. సరైన సమయానికి ఆహారం తినటం అలవాటు చేసుకోవాలి. నోటి దుర్వాసన వస్తోంటే తులసి, పుదీనా.. లాంటి ఆకులు తింటే ఫలితం ఉంటుంది.



- భోజనం తర్వాత పెరుగన్నం తినటం వల్ల నోటిలోని చెడు బ్యాక్టీరియా పోతుంది. దుర్వాసన వస్తోంటే.. నిమ్మరసం తాగినా చక్కని ఫలితం ఉంటుంది.
- యాంటీ ఆక్సిడెంట్స్ ఉండే తృణధాన్యాలు.., నారింజ, యాపిల్, పైనాపిల్ లాంటి పండ్లు తినటం వల్ల నోరు తాజాగా ఉంటుంది. నిద్రపోయేముందు లవంగాలను నమిలితే ఉదయాన దుర్వాసన ఉండదు. భోజనం తర్వాత సోంపు తినాలి.
- కాఫీ, టీ.. లాంటివి ఎక్కువగా తాగటం వల్ల కూడా నోటి దుర్వాసన వచ్చే అవకాశం ఉంది. అందుకే ఏ ఫుడ్ తీసుకున్నప్పుడు దుర్వాసన వస్తుందో గమనించి ఆ ఆహారాన్ని తగ్గించాలి. అప్పుడే సమస్య ఉండదు.

సెలబ్ ఫిట్



ఐదేళ్ల కిందట కెరీర్ ప్రారంభమైనా... చేసింది రెండే చిత్రాలు.
కానీ ఇన్‌స్టాగ్రామ్‌లో స్టార్ హీరోయిన్‌లకు మించిన ఫాలోయింగ్.
ఎందుకంత క్రేజ్ అంటే... నెట్టింట ఆమె చేసి చూపించే వర్కవుట్‌లే.
ఒకప్పుడు తన శరీరాకృతిని తనే ద్వేషించిన ఆమె...
ఇప్పుడు లక్షలమందికి ఫిట్‌నెస్ ఐకాన్ ఎలా అయింది?
24 ఏళ్ల నవతరం నాయకి...
సాక్షి మాలిక్ కథ ఇది...

ఫిట్‌నెస్ గురు

'సోను కే టీటూ కీ స్వీటీ'తో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సాక్షి మాలిక్.. తొలి చిత్రంతోనే యువతరానికి దగ్గరైంది. అందులోని 'బామ్ డిగ్గీ డిగ్గీ' పాట అప్పట్లో బాగా ఊపేసింది. దాని తరువాత ఆమె చేసిన సినిమా... గత ఏడాది విడుదలైన 'డ్రై డే'. ఈ మధ్యలో ఓ రెండు మ్యూజిక్ ఆల్బమ్స్‌లో కూడా నటించింది. ఇవి ఆమెకు గుర్తింపు అయితే తీసుకురాగలిగాయి కానీ... స్టార్‌ను చేయలేకపోయాయి. ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో పుట్టి పెరిగిన సాక్షికి గ్లామర్ ప్రపంచంలో వెలగాలనేది మొదటి నుంచీ ఉన్న కోరిక. దాన్ని నెరవేర్చుకొనే లక్ష్యంతోనే ఆమె అడుగులు వేసింది. నోయిడా 'జేపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ'లో బీటెక్ చదువుతూనే... ఫ్యాషన్ షోలకు వెళ్లడం మొదలు పెట్టింది. కెరీర్‌ను నిర్మించుకొనే క్రమంలో ఇంజనీరింగ్ అవ్వగానే ముంబయి వెళ్లిన సాక్షి.. అక్కడ మోడల్‌గా స్థిరపడింది. 'నైకా' తదితర బడా బ్రాండ్ల టీవీ యాడ్స్‌లో నటించింది. ఆ సమయంలోనే బాలీవుడ్ నిర్మాతల దృష్టిలో పడింది. అలా 2018లో 'సోను కే టీటూ కీ స్వీటీ'లో అవకాశం వచ్చింది. కొన్నాళ్లకు అర్మాన్ మాలిక్ మ్యూజిక్ సింగిల్ 'వేహమ్'లో మురిపించింది.

ఓ తెలుగు చిత్రంలో తన ఫొటోను సెక్స్ వర్కర్‌గా వినియోగించడాన్ని ఆక్షేపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆమె అనుమతి లేకుండా ఫొటో వాడుకోవడాన్ని తప్పు పట్టిన కోర్టు... ఓటీటీ నుంచి ఆ చిత్రాన్ని తొలగించాల్సిందిగా ఆదేశించింది. ఏదిఏమైనా ఆశించిన స్థాయిలో కెరీర్ సాగడంలేదని సాక్షి ఏ రోజూ బాధపడలేదు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టి పెట్టింది. తనకంటూ ప్రత్యేకమైన మార్గాన్ని ఎంచుకుంది. ఆ మార్గమే.. ఇన్‌స్టాలో ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయన్సర్‌గా సరికొత్త అవతారం. ఒకప్పుడు



తన శరీరాన్ని తనే ద్వేషించిన ఈ భామ.. ఇప్పుడు అంత ఫిట్‌నెస్ ఎలా సంతరించుకుంది? దాని వెనుక కఠోర శ్రమ ఉంది.

'నటిగా నా ప్రయాణం మొదలైన తరువాత రెండో చిత్రం చేయడానికి ఐదేళ్లు పట్టింది. ఇందుకు ప్రధాన కారణం.. వినోద పరిశ్రమలో కొనసాగాలా... వద్దా... అనే విషయంలో నాకు అప్పటికి స్పష్టత లేకపోవడం. మా నాన్న ఐఐటీలో చదివిన వ్యక్తిగా. కనుక ఆయన కూతురుగా నాపై కూడా ఉన్నత చదువులు చదవాలనే ఒత్తిడి ఉండేది. ఇంట్లోవాళ్లు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని, అంచనాలను తలకిందులు చేయకూడదన్న ఉద్దేశం నాది. అందుకే 'బామ్ డిగ్గీ డిగ్గీ' పాటతో మంచి పేరు వచ్చినా... బ్రేక్ తీసుకొని కెరీర్ గురించి ఆలోచించాను. అయితే కొవిడ్ లాక్‌డౌన్‌లో దొరికిన ఖాళీ సమయం నాకు ఏంకావాలో నిర్ణయించుకోవడానికి ఉపయోగపడింది. అప్పుడే నిర్ణయించుకున్నాను... నటనే నా ధ్యేయం అని. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల వర్క్‌షాప్‌లకు వెళ్లి నటనలో మెళకువలు నేర్చుకున్నా' అని సాక్షి చెప్పింది. యోగా, నాట్యం తన జీవితాన్ని మలుపు తిప్పాయని, వాటివల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండగలుగుతున్నాని అంటోంది.

'యోగా, డ్యాన్స్ నా జీవితంలో భాగమయ్యాయి. అవి నన్ను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా... మానసిక ప్రశాంతతనిస్తాయి. యోగా వల్ల ఒత్తిడి దూరమవుతుంది. నన్ను నేను సృజనాత్మకంగా ఆవిష్కరించుకోవడానికి నాట్యం దోహదపడుతుంది. ఈ రెండింటివల్ల నాకు ఎదురైన ఎన్నో సవాళ్లను అధిగమించగలిగాను. మరెంతో మందికి నేడు స్ఫూర్తిగా నిలవగలిగాను. నటి కావాలన్న ఒక కల... దాని కోసం ఒంటరిగా ముంబయి లాంటి మహానగరానికి వచ్చి నిలదొక్కుకోవడం అంత సులువు కాదు. ముఖ్యంగా... నేను అల్లారుముద్దుగా పెరిగిన అమ్మాయిని. అంతకముందు ఎప్పుడూ ఒక్కదాన్నే ఎక్కడికీ వెళ్లింది లేదు. నాకు స్వీట్స్ చాలా ఇష్టం. తెగ తినేదాన్ని. బరువు కూడా బాగా పెరిగిపోయాను. ఒక దశలో నా ఆకారాన్ని నేనే ద్వేషించేదాన్ని. అలాంటి నేను ఇవాళ ధైర్యంగా నిలబడగలిగానంటే అందుకు కారణం... యోగా, నాట్యం ఇచ్చిన ఆత్మవిశ్వాసం. క్రమం తప్పని వ్యాయామం, ఏకాగ్రత కోసం ధ్యానం అలవాటు చేసుకున్నాను. ఆహార నియమాలు పాటించడం మొదలుపెట్టాను. వీటన్నిటి కారణంగా బాహ్య సౌందర్యమే కాదు... అంతఃసౌందర్యాన్ని కూడా సంతరించుకోగలిగాను' అని ఓ సందర్భంలో తన గతాన్ని గుర్తు చేసుకుంది సాక్షి.

వర్కవుట్ ఇలా...

'నా రోజువారీ వ్యాయామాల్లో కార్డియో, స్ట్రెంత్ ట్రైనింగ్, యోగా కలిపి ఉంటాయి. జిమ్‌లో ఎక్కువగా స్క్వాట్స్, లంగెస్, పుషప్స్, ప్లాంక్స్, బర్పీస్ చేస్తాను. సమయం కుదిరినప్పుడు ట్రెక్కింగ్‌కు వెళతాను. కొండలు ఎక్కి దిగడంవల్ల కండరాలు మరింత దృఢంగా మారతాయి. అలసట లేకుండా ఎన్ని గంటలైనా పని చేయగల శక్తి శరీరానికి సమకూరుతుంది' అంటున్న సాక్షి.. నిత్యం తన ఫాలోవర్స్‌లో ఫిట్‌నెస్ పట్ల స్ఫూర్తి రగిలించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకు తనను తాను ఒక ఉదాహరణగా చూపిస్తుంది. ప్రస్తుతం ఇన్‌స్టాలో ఆమెకు డెబ్బై లక్షలమందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు.

- ట్రెడ్‌మిల్, జాగింగ్ లేదంటే డ్యాన్స్‌తో ఉదయం వ్యాయామం సెషన్ ప్రారంభమవుతుంది.
- జిమ్‌కు వెళ్లినా వెళ్లకపోయినా... రోజూ ఐదు నిమిషాలు శీర్షాసనం తప్పనిసరి.
- తరువాత స్క్వాట్స్, లంగెస్, వెయిట్ లిఫ్టింగ్ తదితర వ్యాయామాలతో పాటు బాక్సింగ్. 'వీటి కోసం జిమ్‌కే వెళ్లక్కర్లేదు. ఇంట్లోనే సులువగా చేసుకోవచ్చు' అంటుంది సాక్షి.
- వారంలో కనీసం ఐదు రోజులు యోగా. భుజంగాసన, నౌకాసన వంటి క్లిష్టమైన ఆసనాలు ఉంటాయి.
- మానసిక ప్రశాంతత కోసం కాసేపు ధ్యానం. కుదిరినప్పుడు స్విమ్మింగ్.

ఇదీ మెనూ...

'ఆరోగ్యకర శరీరానికి బలవర్ధకమైన ఆహారం కీలకం' అంటున్న సాక్షి.. కేవలం వ్యాయామాల విషయంలోనే కాదు... ఆహార నియమాలు పాటించడంలోనూ ఎంతో కచ్చితంగా ఉంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి నుంచి వచ్చిన భోజనం, అదీ పోషకాహారమే తీసుకొంటుంది. సమయం దొరికితే తన వంట తనే చేసుకొంటుంది. ఆమెకు బాగా ఇష్టమైన డిష్.. పాలక్ పనీర్. కఠోర వ్యాయామాలు, ఎడతెరిపి లేని పనిగంటలతో శరీరం డీహైడ్రేట్ కాకుండా, అలాగే చర్మం నిగారింపు కోసం అధికమొత్తంలో నీళ్లు, జ్యూస్‌లు తాగుతుంది. వీటితోపాటు ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రకు కేటాయిస్తుంది.

- ఉదయం లేవగానే రెండు మూడు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు
- బ్రేక్‌ఫాస్ట్‌కు ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, చిరుధాన్యాలు లేదా ఓట్స్ మీల్
- మధ్యాహ్నం లంచ్‌లో గ్రిల్డ్ వెజిటబుల్స్, బాయిల్డ్ బఠాణీ/చిక్కుళ్లు, గ్రీన్ సలాడ్
- రాత్రిపూట భోజనంలో తేలికపాటి ఆహారం... పప్పు లేదా సబ్జీతో రోటీ

పారిస్ బెర్త్ పట్టేయాలని..

- ఫేవరెట్‌గా భారత మహిళల జట్టు
- తొలి పోరులో యూఎస్‌ఏతో ఢీ
- నేటి నుంచి హాకీ ఒలింపిక్ క్వాలిఫయర్స్



భారత కెప్టెన్ సవిత

ప్రాక్టీస్‌లో భారత బృందం

రాత్రి 7.30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

రాంచీ: ఈ ఏడాది జూలై 26 నుంచి పారిస్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకునేందుకు భారత మహిళల హాకీ నడుం బిగించింది. దీంట్లో భాగంగా శనివారం నుంచి జరిగే ఎఫ్ఐహెచ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో స్వదేశీ అనుకూలతను సొమ్ము చేసుకోవాలనుకుంటోంది. తొలిరోజు తమ గ్రూప్-బిలోని మొదటి మ్యాచ్‌లో సవితా పూనియా సారథ్యంలోని భారత బృందం అమెరికా (యూఎస్‌ఏ)తో తలపడనుంది. మొత్తంగా 8 జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. పూల్ 'బి'లో ఆతిథ్య భారత్‌తో పాటు అమెరికా, న్యూజిలాండ్, ఇటలీ జట్లు ఉండగా.. పూల్ 'ఏ'లో జర్మనీ, చెక్ రిపబ్లిక్, జపాన్, చిలీ ఉన్నాయి. జనవరి 18న సెమీస్, 19న ఫైనల్ ఉంటుంది. ఈ టోర్నీలో టాప్-3లో నిలిచిన జట్లకే పారిస్ ఒలింపిక్స్‌లో బెర్త్ దక్కుతుంది. మరోవైపు యూఎస్‌తో పోరు భారత జట్టుకు అంత ఆషామాషీ కాదు. గణాంకాలపరంగా 1983 నుంచి ఇరుజట్లు 15 సార్లు తలపడితే, అమెరికా తొమ్మిది సార్లు నెగ్గడం గమనార్హం. మరోవైపు స్టార్ ఫార్వర్డ్ ప్లేయర్ వందనా కటారియా గాయం కారణంగా జట్టులో లేకపోవడం ప్రధాన లోటుగా కనిపిస్తోంది. ఇటీవలే 300 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తన అనుభవం జట్టుకు కీలకంగా మారేది. తన గైర్హాజరీలో లాల్‌రెసియామి, సంగీత కుమారి, దీపిక, బల్జీత్ ఫార్వర్డ్‌లైన్ బాధ్యతలుతీసుకోనున్నారు. నిక్కీ ప్రధాన్, ఉదిత, ఇషికా చౌదరి, మోనిక డిఫెన్స్‌కు అండగా ఉంటారు. మిడ్‌ఫీల్డ్‌లో అత్యంత అనుభవశాలి నేహా గోయల్ సేవలపై జట్టు అధికంగా ఆధారపడి ఉంది. ముఖ్యంగా జట్టు పెనాల్టీ కార్నర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతోంది. సాధ్యమైనంత వేగంగా ఈ బలహీనతను అధిగమిస్తేనే ఫలితంపై ఆశలు పెట్టుకోవచ్చు.



చిలీ జట్టు క్రీడాకారిణుల ప్రాక్టీస్

ముంబై 281/6

ఆంధ్రతో రంజీ

ముంబై: ఆంధ్రతో రంజీ మ్యాచ్‌లో ముంబై జట్టు కెప్టెన్ అంజిక్యా రహానె తొలి బంతికే ఎల్బీగా అవుటై, నిష్క్రమించాడు. గ్రూప్-బిలోని ఈ రెండు జట్ల మధ్య శుక్రవారం ప్రారంభమైన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై తొలిరోజు ఆట ముగిసేసరికి 6 వికెట్లకు 281 పరుగులు చేసింది. ఓపెనర్ భుపెన్ లాల్వానీ (61) అర్ధ శతకంతో రాణించాడు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్‌కుమార్ రెడ్డి 3 వికెట్లు, షోయబ్ 2, వికెట్లు తీశారు. క్రీజులో తనూష్ (31) ములానీ (30) ఉన్నారు.

ఆంధ్ర కెప్టెన్సీ నుంచి వైదొలిగిన విహారి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రస్తుత రంజీ సీజన్‌లో ఆంధ్ర కెప్టెన్‌గా ఉన్న హనుమ విహారి అర్ధంతరంగా సారథ్య బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. బ్యాటింగ్‌పై మరింత దృష్టి పెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు విహారి తెలిపాడు. దీంతో శుక్రవారం ముంబైతో మొదలైన రంజీ మ్యాచ్‌కు సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నూతన కెప్టెన్‌గా నియమించింది. ఇక, రంజీ సీజన్ ప్రారంభానికి ముందు తాను మధ్యప్రదేశ్ తరఫున ఆడనున్నట్టు ప్రకటించిన విహారి.. ఆ తర్వాత నిర్ణయం మార్చుకున్న సంగతి తెలిసిందే.

అఖిల్‌కు స్వర్ణం.. తోమర్‌కు రజతం

జకర్తా: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత షూటర్ల జోరు కొనసాగుతోంది. శుక్రవారం ముగిసిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ వ్యక్తిగత ఈవెంట్‌లో అఖిల్ షెరాన్ పసిడి కొల్లగొట్టగా, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రజతంతో మెరిశాడు. ఇక, పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ టీమ్ ఈవెంట్‌లో అఖిల్, తోమర్, స్వప్నిల్ కుశాలెతో కూడిన భారత త్రయం 1758 స్కోరుతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం సాధించింది.

లోకేశ్వరి డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ నాలుగో రోజు పోటీల్లో తెలుగు క్రీడాకారులు నాలుగు పతకాలు సొంతం చేసుకున్నారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన లోకేశ్వరి రెండు పతకాలు సాధించడం విశేషం. గోవాలో శుక్రవారం జరిగిన ఎఫ్-37 షాట్‌పుట్‌లో రజతంతో మెరిసిన లోకేశ్వరి.. డిస్కస్ త్రోలో కాంస్యం అందుకుంది. ఎఫ్35 షాట్‌పుట్‌లో శ్రీను (ఖమ్మం), టీ-13/20 400 మీటర్లలో దీప్తి (వరంగల్) స్వర్ణాలు నెగ్గగా.. ఎఫ్-11 లాంగ్ జంప్‌లో జగన్ (హైదరాబాద్) రజత పతకం గెలిచాడు.

మెయిన్ డ్రాకు సుమిత్

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగల్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడేందుకు బెర్త్ దక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్లో సుమిత్ విజయం సాధించాడు. శుక్రవారం జరిగిన పోరులో సుమిత్ 6-4, 6-4తో స్లోవేకియా ఆటగాడు అలెక్స్ మోల్కాన్‌ను వరుససెట్లలో ఓడించి మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. ఆదివారం నుంచి జరిగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సుమిత్ తొలిరౌండ్లో ప్రపంచ 31వ ర్యాంకర్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్థాన్)తో తలపడనున్నాడు. సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ డ్రాలో ఆడడం ఇది రెండోసారి. అంతకుముందు 2021లో ఈ టోర్నీలో ఆడాడు.

ఫైనల్లో బోపన్న జోడీ: భారత స్టార్ రోహన్ బోపన్న అడిలైడ్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి డబుల్స్‌లో ఫైనల్ చేరాడు. సెమీఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-4తో గొంజాలో (ఈక్వెడార్)- అలెగ్జాండర్ (ఉక్రెయిన్) జంటపై గెలిచింది.

ఓటముల్లో టైటాన్స్ డబుల్ హ్యాట్రిక్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్‌లో వేదికలు, ప్రత్యర్థులు మారుతున్నారు కానీ, తెలుగు టైటాన్స్ ఆట తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 35-38తో జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓటమిపాలైంది. దీంతో పరాజయాల్లో వరుసగా డబుల్ హ్యాట్రిక్ కొట్టిన టైటాన్స్.. తానాడిన మొత్తం 12 మ్యాచుల్లో 11వ ఓటమి చవిచూసింది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 37-17తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

డబ్ల్యూటీటీ డబుల్స్ క్వాలిఫయర్స్‌లో శ్రీజ, స్నేహిత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ క్వాలిఫయర్స్‌లో తెలుగు క్రీడాకారులు ఆకుల శ్రీజ, ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. సింగిల్స్‌లో నేరుగా ఎంట్రీ దక్కించుకున్న శ్రీజ.. మిక్స్‌డ్ డబుల్స్‌లో స్నేహిత్‌తో, డబుల్స్‌లో దియాతో కలిసి ఆడనుంది. ఇందులో నెగ్గితే, ప్రధాన పోటీలకు అర్హత సాధిస్తారు. గోవాలో ఈనెల 23న క్వాలిఫయర్స్, 25నుంచి ప్రధాన పోటీలు జరగనున్నాయి.

సెమీస్‌లో సాత్విక్ జోడీ



కౌలాలంపూర్: భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి తమ సూపర్ ఫామ్ కొనసాగిస్తున్నారు. మలేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్‌తో ఈ ఏడాది తొలి టోర్నీ ఆడుతున్న ఈ ఇద్దరూ టైటిల్ సాధించే దిశగా దూసుకెళుతున్నారు. పురుషుల డబుల్స్‌లో ఈ ఏస్ జంట సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ జంట సాత్విక్-చిరాగ్ 21-11, 21-8తో చైనా ద్వయం రెన్ గ్జియాంగ్ యూ-హె జి టింగ్‌ను చిత్తుచేసింది. ఇక, టోర్నీ బరిలో మిగిలిన మరో భారత జంట అశ్వినీ పొన్నప్ప-తనీషా క్రాస్టో సెమీస్ చేరడంలో విఫలమైంది. మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో అశ్విని ద్వయం 15-21, 13-21తో జపాన్‌కు చెందిన రిన్ ఇషానగా-కీ నకనిషి జోడీ చేతిలో ఓటమిపాలైంది.

డారిల్ సూపర్

తొలి టీ20లో పాక్‌పై కివీస్ గెలుపు



ఆక్లాండ్: సొంతగడ్డపై పాకిస్థాన్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ గ్రాండ్ బోణీ కొట్టింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో 46 పరుగులతో కివీస్ గెలిచింది. మొదట కివీస్.. ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 61) సూపర్ ఇన్నింగ్స్‌కు తోడు కెప్టెన్ కేన్ విలియమ్సన్ (42 బంతుల్లో 9 ఫోర్లతో 57) అదరగొట్టడంతో 20 ఓవర్లలో 226/8 స్కోరు చేసింది. ఫిన్ అలెన్ (34), చాప్‌మన్ (26) వేగంగా ఆడారు. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రీది, అబ్బాస్ అఫ్రీది చెరో మూడు వికెట్లు తీశారు. భారీ ఛేదనలో కివీస్ బౌలర్ టిమ్ సౌతీ (4/25) విజృంభణతో పాక్ 18 ఓవర్లలో 180 పరుగులకే కుప్పకూలింది. బాబర్ ఆజమ్ (57) రాణించగా, అయూబ్ (27), రిజ్వాన్ (25) ఫర్వాలేదనిపించారు.

శాంట్నర్‌కు కొవిడ్: కివీస్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ కొవిడ్ బారిన పడ్డాడు. దీంతో అతను.. తొలి టీ20లో ఆడలేదు.

కుల్దీప్, అక్షర్ జట్టులోకి..

- బ్యాకప్ కీపర్‌గా ధ్రువ్ జురెల్
- ఇషాన్, శార్దూల్‌కు నో చాన్స్
- ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు భారత జట్టు



ధ్రువ్ జురెల్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే తొలి రెండు టెస్టుల కోసం భారత క్రికెట్ జట్టును ప్రకటించారు. ఈనెల 25 నుంచి రోహిత్ శర్మ నేతృత్వంలోని జట్టు ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. దీంట్లో భాగంగా శుక్రవారం జాతీయ సెలెక్టర్లు మొదట హైదరాబాద్, వైజాగ్ టెస్టుల కోసం 16 మందితో కూడిన పూర్తి స్థాయి బృందాన్ని ఎంపిక చేసింది. ఈ సిరీస్‌లో ఆడాలనుకున్న పేసర్ మహ్మద్ షమిని ముందు జాగ్రత్త చర్యలో భాగంగా బీసీసీఐ విశ్రాంతినిచ్చింది. ఇక దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు దూరమైన స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లకు ఈసారి జట్టులో చోటు కల్పించారు. వీరికి తోడు వెటరన్స్ జడేజా, అశ్విన్ స్పిన్ బాధ్యతలు తీసుకోనున్నారు. అయితే ఇటీవల వార్తల్లో నిలుస్తున్న వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌ను ఈ సిరీస్‌కు కూడా సెలెక్టర్లు పక్కనబెట్టడం గమనార్హం. అతడి స్థానంలో బ్యాకప్ కీపర్‌గా యూపీ యువ ఆటగాడు ధ్రువ్ జురెల్‌ను తొలిసారి జట్టుకు ఎంపిక చేశారు. గతేడాదే అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ప్రవేశించగా, ఇటీవల భారత్ 'ఎ' తరఫున సౌతాఫ్రికాలోనూ పర్యటించాడు. ప్రస్తుత జట్టులో అతడొక్కడే కొత్త ప్లేయర్. రాహుల్, కేఎస్ భరత్ ఇతర కీపర్లు. అలాగే రంజీల్లో విశేషంగా రాణిస్తున్న వెటరన్ పుజార ప్రదర్శనను కూడా పెద్దగా పట్టించుకోలేదు. మరో పేసర్ ప్రసిద్ధ్ క్రిష్ణ రంజీల్లో గాయపడడంతో బుమ్రా, అవేశ్ ఖాన్, ముకేశ్, సిరాజ్ పేస్ బాధ్యతలు తీసుకోనున్నారు. సఫారీ టూర్‌లో ధారాళంగా పరుగులిచ్చుకున్న శార్దూల్‌పై వేటు పడింది.

భారత టెస్టు జట్టు

రోహిత్ (కెప్టెన్), గిల్, జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, కేఎస్ భరత్, ధ్రువ్ జురెల్, అశ్విన్, జడేజా, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ముకేశ్, బుమ్రా, అవేశ్ ఖాన్.

బిజినెస్

ఐటీ జోరు..బుల్ హుషారు

- కొత్త రికార్డులకు సూచీలు
- 72,568 పాయింట్ల స్థాయికి సెన్సెక్స్
- నిఫ్టీ 21,894 పాయింట్ల స్థాయికి



ముంబై/న్యూఢిల్లీ : ఐటీ షేర్లు ప్రత్యేకించి టీసీఎస్, ఇన్ఫోసిస్ కంపెనీల షేర్లు సాధించిన లాభాలు మార్కెట్‌ను కొత్త రికార్డుల దిశగా పరుగులు తీయించాయి. ఐటీ దిగ్గజాలు రెండూ ఊహించిన దాని కన్నా మెరుగైన ఫలితాలు సాధించడం ఇన్వెస్టర్లను ఉత్తేజపరిచింది. దీనికి తోడు టెక్నాలజీ, రియల్టీ, ఆయిల్ కౌంటర్లలో జరిగిన భారీ కొనుగోళ్లు, రూపాయి పటిష్ఠత కూడా మార్కెట్ జోరుకు దోహదపడ్డాయి. సర్వత్రా కొనుగోళ్ల మద్దతుతో శుక్రవారం సెన్సెక్స్ ఇంట్రాడేలో 999.78 పాయింట్లు లాభపడి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 72,720.96 పాయింట్లను తాకింది. చివరికి 847.28 పాయింట్ల లాభంతో 72,568.45 వద్ద మరో చారిత్రక గరిష్ఠ స్థాయిలో ముగిసింది.

మరోవైపు నిఫ్టీ కూడా 247.35 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 21,894.35 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ చారిత్రక గరిష్ఠ స్థాయి 21,928.25 పాయింట్లను తాకింది. బీఎస్ఈలో 2,112 షేర్లు లాభాల్లో ముగియగా 1,742 షేర్లు నష్టపోయాయి.ఈ వారంలో సెన్సెక్స్ 542 పాయింట్లు, నిఫ్టీ 184 పాయింట్లు లాభపడ్డాయి.

రూ.373 లక్షల కోట్లకు మార్కెట్ క్యాప్: వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,213.23 పాయింట్లు లాభపడడంతో బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,88,711.19 కోట్లు పెరిగి రూ.3,73,29,676.27 కోట్లకు దూసుకుపోయింది. ప్రధానంగా ఐటీ సూచీ 5.06 శాతం, టెక్నాలజీ సూచీ 4.40 శాతం లాభపడడం మార్కెట్ సంపద కొత్త శిఖరాలకు చేరేందుకు దోహదపడింది.

టీసీఎస్, ఇన్ఫోసిస్ జోరు: శుక్రవారం టీసీఎస్ షేరు 4 శాతం లాభపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.53,239.2 కోట్ల మేరకు పెరిగింది. బీఎస్ఈలో ఈ షేరు 3.89 శాతం లాభపడి రూ.3,881.70 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 3.91 శాతం లాభపడి రూ.3,881.90 వద్ద ముగిసింది. ఇక ఇన్ఫోసిస్ షేరు 8 శాతం లాభపడడంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.48,652.73 కోట్లు పెరిగింది. బీఎస్ఈలో ఈ షేరు 7.84 శాతం లాభపడి రూ.1,612.20 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 8 శాతం లాభపడి రూ.1,615 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ గ్రీన్ రూపీ టర్మ్ డిపాజిట్ స్కీమ్: పర్యావరణ అనుకూల ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం చేయడం కోసం నిధులు సమీకరించడం లక్ష్యంగా ఎస్‌బీఐ గ్రీన్ రూపీ టర్మ్ డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభించింది. ఎన్ఆర్ఐలు సహా అన్ని శ్రేణులకు చెందిన ఇన్వెస్టర్లు ఇందులో పెట్టుబడి పెట్టవచ్చు. 1111 రోజులు, 1777 రోజులు, 2222 రోజుల కాలపరిమితికి ఈ స్కీమ్ కింద డిపాజిట్ చేయవచ్చు. ప్రస్తుతం ఎస్‌బీఐ శాఖల్లోనే అందుబాటులో ఉన్న ఈ స్కీమ్‌ను త్వరలో ఆన్‌లైన్ చానల్స్‌లో అందుబాటులో ఉంచుతారు.

వింగ్స్ ఇండియాకు బోయింగ్ 777-9

ప్రపంచంలో అతిపెద్ద విమానమిదే



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బోయింగ్‌కు చెందిన కొత్త వైడ్‌బాడీ విమానం 777-9 మొదటిసారిగా భారత గడ్డపై వాలనుంది. ఈ విమానాన్ని హైదరాబాద్‌లో జరగనున్న వింగ్స్ ఇండియా 2024లో బోయింగ్ ప్రదర్శించనుంది. 777-9 ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత ఇంధన సామర్థ్యం కలిగిన ట్విన్-ఇంజన్ జెట్. విమానాల సంఖ్యను పెంచుకునే కార్యక్రమంలో భాగంగా ఎయిర్ ఇండియా విమానాలను కొనుగోలు చేస్తున్నట్లు గత ఏడాది వెల్లడించింది. ఇందులో పది 777-9 విమానాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్గాల్లో వీటిని వినియోగించనుంది. భవిష్యత్తులో ప్రపంచంలోని అనేక విమానయాన సంస్థలకు 777-9 విమానం ప్రధాన విమానంగా ఉండనుందని బోయింగ్ వైస్ ప్రెసిడెంట్ (కమర్షియల్ సేల్స్) రైన్ ఫైర్ తెలిపారు. వింగ్స్ ఇండియాలో ప్రదర్శన కోసం కొత్త విమానాన్ని జనవరి 16న హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. జనవరి 18-19 తేదీల్లో దీన్ని ప్రదర్శిస్తారు.

విప్రో లాభం రూ.2,694 కోట్లు

క్యూ3లో ఆదాయం రూ.22,205 కోట్లు .. ఒక్కో షేరుకు రూ.1 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం రూ.2,694.2 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.3,052.9 కోట్ల లాభంతో పోలిస్తే 11.74 శాతం తగ్గింది. సెప్టెంబరుతో ముగిసిన క్యూ2తో పోలిస్తే మాత్రం దాదాపు ఒక శాతం వృద్ధి కనబరిచింది. వార్షిక ప్రాతిపదికన కంపెనీ లాభం క్షీణించడం వరుసగా ఇది నాలుగో త్రైమాసికం. కాగా, ఈ క్యూ3లో విప్రో ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.4 శాతం క్షీణించి రూ.22,205.1 కోట్లకు పడిపోయింది. ఈ క్యూ2తో పోల్చినా 1.4 శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ వాటాదారులకు ఒక్కో షేరుకు రూపాయి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను ఈనెల 24న ఎంపిక చేసి, వచ్చే నెల 10న చెల్లింపులు జరపనున్నట్టు కంపెనీ తెలిపింది. మరిన్ని విషయాలు..

- సమీక్షా కాలానికి ఐటీ సేవల ద్వారా కంపెనీకి సమకూరిన ఆదాయం 4.5 శాతం తగ్గి 22,150.8 కోట్లుగా నమోదైంది.
- ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఐటీ సేవల ఆదాయం 261.5-266.9 కోట్ల డాలర్ల (రూ.21,845-రూ.22,296 కోట్లు) స్థాయిలో ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే ఈ ఆదాయ వృద్ధి అంచనా శ్రేణి మైనస్ 1.5 శాతం నుంచి 0.5 శాతంగా ఉంది.
- గడిచిన మూడు నెలల్లో విప్రో 380 కోట్ల డాలర్ల విలువైన డీల్స్ దక్కించుకుంది. క్యూ2తో పోలిస్తే కేవలం 0.2 శాతం అధికమిది. వార్షిక ప్రాతిపదికన మాత్రం 13.5 శాతం తగ్గాయి. కాగా, మొత్తం ఆర్డర్లలో భారీ డీల్స్ విలువ 90 కోట్ల డాలర్లని, వార్షిక ప్రాతిపదికన 8.3 శాతం తగ్గిందని కంపెనీ తెలిపింది.
- డిసెంబరు 31తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య మరో 4,473 తగ్గి 2,40,243 మందికి పరిమితమైంది. అయితే, ఉద్యోగుల వలసల రేటు మాత్రం 10 త్రైమాసికాల కనిష్ఠ స్థాయి 12.3 శాతానికి తగ్గింది.

మార్కెట్లోకి మెక్‌లారెన్ 750ఎస్



7.2 సెకన్లలో 200 కిలోమీటర్ల వేగం

ముంబై: బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం మెక్‌లారెన్.. భారత మార్కెట్లోకి సరికొత్త సూపర్ స్పోర్ట్స్ కారు 750ఎస్ విడుదల చేసింది. ఈ కారు ధర రూ.5.91 కోట్లు. యూకేలోని యార్క్‌షైర్‌లోని మెక్‌లారెన్ కాంపోజిట్స్ టెక్నాలజీ సెంటర్ (ఎంసీటీసీ)లో తయారైన ఈ సూపర్ కారును దేశీయ మార్కెట్లోకి కంప్లీట్లీ బిల్ట్ యూనిట్‌గా దిగుమతి చేయనుంది. మెక్‌లారెన్ పోర్టుఫోలియోలో తేలికైన, అత్యంత శక్తిమంతమైన కారు ఇది. 4.0 లీటర్ ట్విన్ టర్బోచార్జ్‌డ్ వీ8 ఇంజన్‌తో కూడిన ఈ కారు కేవలం 2.8 సెకన్లలో 100 కిలోమీటర్లు, 7.2 సెకన్లలో 200 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. గత ఏడాది నవంబరులో భారత మార్కెట్లోకి ప్రవేశించిన మెక్‌లారెన్ ఇప్పటివరకు 30 కార్లను విక్రయించింది. దేశీయంగా సూపర్ స్పోర్ట్స్ కార్లకు డిమాండ్ పెరుగుతుండటంతో ఈ ఏడాది విక్రయాల్లో 30 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నట్లు భారత్‌లో మెక్‌లారెన్ ఆటోమోటివ్‌కు అధికారిక డీలర్‌గా ఉన్న ఇన్ఫినిటీ కార్స్ ఎండీ లలిత్ చౌదరి తెలిపారు. మెక్‌లారెన్ ఇప్పటికే భారత మార్కెట్లో జీటీ, ఆర్చురా హైబ్రిడ్ కార్లను విక్రయిస్తోంది.

హెచ్‌సీఎల్ టెక్ భళా

- క్యూ3 లాభం రూ.4,350 కోట్లు
- వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. 2023 డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం వృద్ధితో రూ.4,350 కోట్లకు ఎగబాకింది. త్రైమాసిక ప్రాతిపదికన కంపెనీకిదే అత్యధిక లాభం. ఈ క్యూ3లో హెచ్‌సీఎల్ ఏకీకృత ఆదాయం 6.5 శాతం పెరిగి రూ.28,446 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి రాబడి రూ.26,700 కోట్లుగా నమోదైంది. గడిచిన త్రైమాసికంలో కంపెనీ సేవల వార్షికాదాయం రూ.లక్ష కోట్ల మైలురాయిని దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2023-24) గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ నెల 20న డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను ఎంపిక చేసి, 31న చెల్లింపులు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

- రిలయన్స్ రిటైల్‌కు చెందిన రిలయన్స్ ట్రెండ్స్.. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నంలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించే వ్యూహంలో భాగంగా ఈ ఫ్యాషన్ స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. కంపెనీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కి పైగా పట్టణాలు, నగరాల్లో మొత్తం 2,000 స్టోర్లను నిర్వహిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▲	57,700 ▲	77,400 ▼
ముంబై	62,515 ▲	57,264 ▲	71,530 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ		విజయవాడ	555
హైదరాబాద్	540	విశాఖపట్నం	599
13 జనవరి		వరంగల్	542
చిత్తూరు	563	డజను గుడ్లు రూ.72	
గోదావరి	555		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	92	గోదావరి	91
వరంగల్	92	విజయవాడ	91
కరీంనగర్	92	గుంటూరు	92
మహబూబ్‌నగర్	92	ఒంగోలు	92
కర్నూలు	92	చిత్తూరు	98
విశాఖపట్నం	86		

దక్కన్ క్రానికల్ వెంకట్రామ్ రెడ్డికి ఎన్‌సీఎల్‌టీ జరిమానా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కంపెనీల చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినందుకు దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (డీసీహెచ్ఎల్) మాజీ చైర్మన్, ప్రమోటర్, డైరెక్టర్ టీ వెంకట్రామ్ రెడ్డి, మరొకరికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్.. కాంపౌండబుల్ అఫెన్సెస్ కింద జరిమానా విధించింది. కంపెనీల చట్టంలోని సెక్షన్ 211, 295, 383-ఏ తదితర సెక్షన్లను ఉల్లంఘించినట్లు ఎస్ఎఫ్ఐఓ విచారణలో వెల్లడైంది. ఎస్ఎఫ్ఐఓ రిపోర్టు ఆధారంగా ఉల్లంఘించిన సెక్షన్లు కాంపౌండబుల్ అఫెన్సెస్ అని.. వీటికి జైలు శిక్ష లేదా జరిమానా విధించవచ్చని పేర్కొంటూ.. తమకు జరిమానా విధించాలని వెంకట్రామ్ రెడ్డి, ఆయన సోదరుడు ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించారు. వారి దరఖాస్తును పరిశీలించిన ఎన్‌సీఎల్‌టీ.. ఉల్లంఘనలను కాంపౌండబుల్ అఫెన్సులుగా గుర్తించి జరిమానా విధించింది. మొత్తం పదిహేను కేసుల్లో ఒక్కో కేసులో రూ.5,000 నుంచి రూ.15,000 వరకూ జరిమానా విధించినట్లు ఎస్ఎఫ్ఐఓ తరఫు న్యాయవాది టీ సుజన్ కుమార్ రెడ్డి తెలిపారు.

కార్వీ కేసులో యాక్సిస్ బ్యాంక్‌కు చుక్కెదురు

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో యాక్సిస్ బ్యాంక్‌కు చుక్కెదురైంది. ఈ కేసులో కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ తమ వద్ద తాకట్టు పెట్టిన షేర్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి.. ఆ షేర్లను తమకు బదిలీ చేయాలన్న యాక్సిస్ బ్యాంక్ విజ్ఞప్తిని సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (శాట్) తోసిపుచ్చింది. ఇందుకోసం సెబీ, ఎన్ఎస్ఈ, ఎన్ఎస్‌డీఎల్‌కు ఆదేశాలు జారీ చేయాలన్న యాక్సిస్ బ్యాంక్ విజ్ఞప్తిని శాట్ నిరాకరించింది. ఈ షేర్లను ఈ సంస్థలు మార్కెట్ నుంచి కొనుగోలు చేసి యాక్సిస్ బ్యాంక్ సహా ఇతర రుణదాతలకు ఇవ్వాలని గత ఏడాది డిసెంబరు 20న తాము జారీ చేసిన ఆదేశాలే చెల్లుబాటవుతాయని స్పష్టం చేసింది.

ఇక స్వచ్ఛందంగా ట్రేడింగ్ ఖాతాల స్తంభన

జూలై 1 నుంచి అమలు

న్యూఢిల్లీ : స్టాక్ మార్కెట్లో మరో సంస్కరణకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమవుతోంది. తమ ట్రేడింగ్ ఖాతాల్లో ఏమైనా అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నట్టు అనుమానం వస్తే.. ఖాతాదారులు వాటిని తాత్కాలికంగా స్తంభింపచేయడం లేదా బ్లాక్ చేసే సదుపాయం ఈ ఏడాది జూలై 1 నుంచి అందుబాటులోకి రానుంది. ఏప్రిల్ 1 కల్లా దీనికి సంబంధించిన విధి విధానాలు ఖరారు చేయాలని స్టాక్ బ్రోకర్లు, స్టాక్ ఎక్స్ఛేంజీలను సెబీ కోరింది. అలాగే ఖాతాదారులు తిరిగి తమ ఖాతాలను ఆపరేట్ చేసేందుకు అనుసరించాల్సిన విధివిధానాలు కూడా తెలియజేయాలని కోరింది. డీమ్యాట్ ఖాతాలకు ఇప్పటికే ఈ సౌకర్యం ఉంది. ఈ విధానం అమల్లోకి వస్తే ఏ మాత్రం అనుమానం వచ్చినా ఖాతాదారులు ఇక తమ ట్రేడింగ్ ఖాతాలను స్తంభింప చేయడం, బ్లాక్ చేయడం.. తిరిగి ఓపెన్ చేయడం చేయవచ్చు.



ఏలూరు జిల్లా కలపర్రు టోల్ ప్లాజా వద్ద చంద్రబాబును కలిసేందుకు గోపాలపురం నుంచి మంగళగిరి బయలుదేరిన టీడీపీ నాయకుల వాహన శ్రేణి

మద్దిపాటికి టికెట్ ఇవ్వొద్దు

- గోపాలపురం నియోజకవర్గం టీడీపీ కార్యకర్తలు డిమాండ్
- ద్వారకా తిరుమల నుంచి భారీ ర్యాలీగా పార్టీ కార్యాలయానికి

అమరావతి(ఆంధ్రజ్యోతి),ద్వారకా తిరుమల/ఏలూరు, జనవరి 12: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గోపాలపురం నియోజకవర్గ టీడీపీలో ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు నియంత పోకడ, ఇతర పరిణామాలను అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు మాజీ జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో పలువురు నేతలు కార్యకర్తలు సుమారు 400 కార్లలో శుక్రవారం మంగళగిరి తరలివెళ్లారు. నియోజకవర్గ తాజా పరిస్థితిని ఒక నివేదికగా తయారు చేసి చంద్రబాబుకు అందజేయాలనుకున్నారు. కాని, ఆయన హైదరాబాద్‌లో ఉండటంతో టీడీపీ ప్రోగ్రాం కమిటీ చైర్‌పర్సన్ స్వాతికి అందజేశారు. ఈ నెల 27న నల్లజర్లలో చంద్రబాబు రా.. కదలిరా.. కార్యక్రమాన్ని తలపెట్టడం, అక్కడ మద్దిపాటిని టీడీపీ అభ్యర్థిగా ప్రకటించే అవకాశం ఉండటంతో.. వ్యతిరేక వర్గ నాయకులు మద్దిపాటి వద్దన్న నినాదంతో అధినేతను కలిసేందుకు ప్రయత్నించారు.

చంద్రబాబుతో సతీష్ వేమన భేటీ



అమరావతి(ఆంధ్రజ్యోతి),చంద్రగిరి, జనవరి 12: తెలుగు అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన శుక్రవారం టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుతో భేటీ అయ్యారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఎన్నారైల మద్దతు చంద్రబాబు కోరడంతో టీడీపీ 2024లో అధికారంలోకి రావడానికి తమ వంతు పాత్ర పోషిస్తామని వెల్లడించారు.

నేడు సీఐడీ కార్యాలయాలకు బాబు

ఐఆర్ఆర్, మద్యం, ఇసుక పాలసీలపై చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసిన నేపథ్యంలో పూచీకత్తు సమర్పించేందుకు నేడు ఆయన సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించనున్నారు. హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు శనివారం 12.45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి విమానంలో బయలుదేరి 2.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా తాడిగడపలోని తులసీనగర్, కుంచనపల్లిలోని సీఐడీ కార్యాలయాలకు, గుంటూరులో సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వరుసగా వెళ్లి పూచీకత్తులు సమర్పిస్తారు.

నారావారి పల్లెకు చేరుకున్న భువనేశ్వరి

ప్రతి ఏడాది లాగే సంక్రాంతి వేడుకలను స్వగ్రామంలో జరుపుకొనేందుకు చంద్రబాబు కుటుంబం నారావారిపల్లెకు చేరుకుంటోంది. చంద్రబాబు సతీమణి భువనేశ్వరితో పాటు ఆమె సోదరి లోకేశ్వరి, బంధువులు కంఠమనేని శ్రీనివాస్ తదితరులు శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్నారు.

రాతియుగ పాలనకు ముగింపు పలకాలి

- రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్ల విధ్వంసం పాలనతో ప్రతి ఒక్కరి జీవితం చీకటి మయమైందని తెలుగుదేశం అధినేత చంద్రబాబు అన్నారు. ఐదేళ్ల రాతి యుగపాలనకు ముగింపు పలుకుతూ, స్వర్ణ యుగానికి నాంది పలికేలా ప్రజలంతా సంక్రాంతి సంకల్పం తీసుకోవాలని కోరారు. కాగా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఉమ్మడి కార్యక్రమానికి సిద్ధమయ్యారు. భోగి సందర్భంగా ఇద్దరూ ఒకే గ్రామంలో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈనెల 14న రాజధాని అమరావతి ప్రాంతంలో భోగి మంటల కార్యక్రమంలో పాల్గొంటారు.

పుంగనూరులో మీటింగు పెట్టొద్దు

బీసీవై పార్టీ సభపై సర్కారు హుకుం.. అనుమతి ఇవ్వలేదన్న పోలీసులు



బీసీవై కార్యకర్తపైకి చెప్పు ఎత్తిన గంగవరం సీఐ కృష్ణమోహన్

- ఏర్పాట్లను అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- రామచంద్ర అరెస్టుకు సీఆర్‌పీఎఫ్ నో
- సీఆర్‌పీఎఫ్‌తోనూ పోలీసుల వాగ్వాదం
- పార్టీ కార్యకర్తను చెప్పుతో కొట్టిన సీఐ
- మంత్రి పెద్దిరెడ్డి ఇలాకాలో రాజకీయ రగడ

పుంగనూరు, జనవరి 12: చిత్తూరు జిల్లాలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గం పుంగనూరులో ఒక్క వైసీపీ మాటే వినబడాలనేలా రాజకీయాలు సాగుతున్నాయి. పుంగనూరు మండలం చెదళ్ల వద్ద భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ శనివారం నిర్వహించ తలపెట్టిన ధర్మపోరాట సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఏర్పాట్లను అడ్డుకోవడంతో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. ఈ సభకోసం ప్రైవేటు స్థలంలో శుక్రవారం వేదిక ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. అక్కడికి వెళ్లిన పోలీసులు సభకు అనుమతి లేదని, పనులు ఆపేయాలని కార్మికులను అడ్డుకున్నారు. ఈ విషయం తెలియగానే బీసీవై అధినేత రామచంద్ర యాదవ్ సంఘటనా స్థలానికి వెళ్లారు. శనివారం నాటి సభ నిర్వహణకు అనుమతి లేదని, పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తిరస్కరించారని పుంగనూరు, చౌడేపల్లె సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి చెప్పారు. "ప్రైవేటు స్థలంలో 500 మందితో సభ నిర్వహించుకునేందుకు ఇది వరకే అనుమతి కోసం చలానాలు, వినతిపత్రం అందించాం. ఇలా ఓ రోజు ముందు అడ్డుకోవడం దారుణం" అని రామచంద్రయాదవ్ అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పోలీసు బలగాలు సభా స్థలం వద్దకు చేరుకోవడంతో బీసీవై కార్యకర్తలు పోలీసుల తీరును ఖండిస్తూ వాగ్వాదానికి దిగారు. దేశంలో ఎక్కడాలేని విధంగా పుంగనూరులో ప్రైవేటు స్థలంలో పెట్టుకుంటున్న మీటింగ్‌కు అనుమతి లేదంటూ ప్రతిసారీ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో పోలీసులు అడ్డుకుంటున్నారని ఆగ్రహించారు. ఏర్పాట్లను తొలగించడానికి సీఐలు, పోలీసులు పెద్దఎత్తున రావడంతో బీసీవై కార్యకర్తలు ఎదురుతిరిగారు. అందరూ వెళ్లిపోవాల్సిందిగా పోలీసులు సూచిస్తూ రామచంద్రయాదవ్‌ను ముందస్తు అరెస్టు చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు సెక్యూరిటీగా ఉన్న సీఆర్‌పీఎఫ్ భద్రతా దళాలు పోలీసులను అడ్డుకున్నారు. రక్షణ దళాలకు, పోలీసులకు మధ్య కూడా వాగ్వాదం జరిగింది. అరెస్టు వారెంట్ తదితర పత్రాలు చూపాలని వారు చెప్పడంతో పుంగనూరు సీఐ శాంతి భద్రతల దృష్ట్యా ముందస్తు అరెస్టు చేస్తున్నామని చెప్పారు. దీంతో భద్రతా దళాలు, బీసీవై కార్యకర్తలు రామచంద్రయాదవ్‌కు వలయంగా ఏర్పడ్డారు. పోలీసులు కార్యకర్తలను ఈడ్చుకుంటూ వాహనాల్లోకి ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ దశలో రామచంద్రయాదవ్ ఆయన కారులో కూర్చుని ఏం చేస్తారో చూద్దామని చెప్పడంతో ఆయనకు రక్షణగా బీసీవై కార్యకర్తలు కారు ముందు పడుకున్నారు. పోలీసులు అందర్నీ లాక్కెళ్లి అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఓ బీసీవై కార్యకర్త ఎదురు తిరుగుతున్నాడని గంగవరం సీఐ కృష్ణమోహన్ ఆయనను చెప్పుతో కొట్టి లాక్కెళ్లి జీపు ఎక్కించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. శుక్రవారం రాత్రివరకూ సంఘటనా స్థలంలో కారులోనే రామచంద్రయాదవ్, బయట పోలీసు బలగాలు ఉండగా, పోలీసులు బలవంతంగా ఏర్పాట్లను తొలగించారు. ఇలావ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాల సభలను అడ్డుకోవడం పిరికిపంద చర్య అని రామచంద్రయాదవ్ ధ్వజమెత్తారు. ప్రైవేటు స్థలంలో పెట్టుకున్న మీటింగును కూడా అడ్డుకోవడాన్ని చూస్తే మంత్రి పెద్దిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు.

నా బలం.. బలగం యువతే!

వారి అండతోనే నేరపూరిత వైసీపీతో పోరాటం.. యువత కోసం పాలసీలు తీసుకొస్తాం

- 'జనసేనానితో గ్లాసు టీ' లో పవన్‌కల్యాణ్ హామీ



'జనసేనానితో గ్లాసు టీ' కార్యక్రమంలో యువతతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): 'ఉక్కు నరాలు.. ఇనుప కండరాలు కలిగిన యువత సమూహమే జనసేన బలం, బలగమ'ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో విభిన్న రంగాల నుంచి విభిన్న ప్రాంత్రాల నుంచి వచ్చిన యువతీ యువకులతో 'జనసేనానితో గ్లాసు టీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన యువతతో కాసేపు చర్చించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి ఆయన అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ యువత అండతోనే వైసీపీ లాంటి నేరపూరిత ఆలోచనలున్న పార్టీతో పోరాడగలుగుతున్నామన్నారు. దశాబ్దకాలం పాటు నన్ను అన్ని విధాలా నమ్మి, నా లక్ష్య సాధనలో నాతో యువతరం నిలబడిందని చెప్పారు. నన్ను వారిలో చూసుకుంటూ, వారి ఆలోచనల్లో వెతుకుతారని వివరించారు. అలాంటి యువతరానికి కచ్చితంగా నేను పూర్తిస్థాయిలో అండగా నిలిచే బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు. 'యువత ఆలోచనలు చాలా విస్తృతంగా, విభిన్నంగా ఉంటాయి. నవతరం ప్రతినిధులతో మాట్లాడిన ప్రతిసారీ కొత్త ఉత్తేజం కలుగుతుంది. దేశం కోసం నిలబడడానికి, సమాజానికి నా వంతుగా ఏదైనా మేలు చేయాలనే దృక్పథంతో రాజకీయ ప్రయాణం ప్రారంభించాను. సమాజంలో జరిగే అన్ని విషయాల మీద యువతలాగే నాకూ కోపం ఉంటుంది. కళ్లెదుటే జరిగే దారుణాల మీద నాలోనూ ఆవేశం ఉంటుంది. నా కోపం, ఆవేశం ఇలా వచ్చి అలా వెళ్లిపోయేవి కాదు. సమస్య మూలం వెతికి దాని మీద పూర్తిస్థాయి దృష్టి నిలిపే పరిష్కారం కోసం ఆలోచిస్తాను. రాజధానితో పాటు అన్ని జిల్లాల్లోనూ ఆర్థికాభివృద్ధి జరగాలి. అన్ని ప్రాంతాల్లోనూ అవకాశాలు ఉండాలి. ఈ దిశగానే నేను ఆలోచిస్తా. కేవలం ఐటీ సెక్టార్ మాత్రమే గౌరవప్రదమైనది అనే ఆలోచన కాకుండా, వ్యవసాయం, వ్యాపారంకూడా అద్భుతమైనవిగా అనేలా తీర్చిదిద్దాలి. సొంత జిల్లాల్లో సరైన అవకాశాలు రాక, ఉద్యోగాలు లేక యువత వలసలు వెళ్లి సాధారణ జీతాలకు పని చేస్తున్నారు. ఈ పద్ధతి మారాలి. యువత సాధికారత దిశగా ఆలోచించాలి. నా కోసం అని కాకుండా సమాజం కోసం నేను ఏం చేయగలుగుతున్నాననే విషయంపై దృష్టి పెట్టాలి. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన నా ఆలోచనలు అన్ని సగటు మనిషి ఎలా ఆలోచిస్తారో అలాగే ఉంటాయి. సాధారణ మధ్య తరగతి కుటుంబాల్లో నుంచి వచ్చిన యువతరం నన్ను వారిలో చూసుకుంటారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. ఇది నేరాలకు ప్రధాన మూలం, నేరాలను అరికట్టాలంటే ముందుగా గంజాయి ముఠాలను కట్టడి చేయాలి. నేను అధికారం లేనప్పుడే యువతరంతో ఎక్కువగా మాట్లాడాను. అధికారంలోకి వచ్చాక వారి గొంతునవుతాను. ఉద్దానం సమస్యను కూడా ఇద్దరు యువకులు నా దృష్టికి తీసుకువచ్చారు. దానిపై బలమైన పోరాటం చేయగలిగాం. యువత ఆలోచనలు జాగ్రత్తగా వింటాను. అవసరమైతే అన్నీఆలోచించి ప్రజా పాలసీగా తీసుకొస్తాను. వచ్చే ప్రభుత్వంలో జవాబుదారీతనం తీసుకువస్తాం, యువతకు మంచి భవిష్యత్ ఇచ్చేలా భరోసాఇస్తాం" అని హామీ ఇచ్చారు.

ఆ నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి: టీడీపీ ఫిర్యాదు

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ నుంచి గెలుపొంది వైసీపీలోకి వెళ్లిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ ఏపీ శాసనసభ కార్యదర్శికి శుక్రవారం ఫిర్యాదు చేసింది. టీడీఎల్పీ విప్ బాలవీరాంజనేయస్వామి పేరుతో ఈ అనర్హత అభ్యర్థనను అందచేశారు. ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్, కరణం బలరాం, మద్దాలి గిరిపై వేటు వేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈసీల చట్టంపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 12: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ), ఎన్నికల కమిషనర్(ఈసీ)ల నియామకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై విచారణ జరపడానికి అంగీకరించింది. గతంలో ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన ప్యానెల్ వీరిని ఎంపిక చేసేది. కేంద్రం తాజాగా చేసిన చట్టంలో ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రికి అవకాశం కలిగించారు. దీనిని సవాలు చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు జయా ఠాకూర్, న్యాయవాది గోపాల్ సింగ్‌లతో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారణ చేపట్టింది. జయా ఠాకూర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ ఈ చట్టం అధికారాల విభజన అన్న సూత్రానికి విరుద్ధంగా ఉందని, అందువల్ల స్టే విధించాలని కోరారు. గోపాల్ సింగ్ వాదిస్తూ..ఈ చట్టం కేంద్ర ప్రభుత్వానికి అపరిమితమైన అధికారాలు ఇచ్చిందని, ఆ కారణంగా దాన్ని కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు.

మళ్లీ అధికారంలోకి వచ్చేందుకే అభ్యర్థుల మార్పు: వైవీ సుబ్బారెడ్డి

విశాఖపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటే కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చాల్సి ఉందని విశాఖ జిల్లా పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, అందులో భాగంగానే గురువారం మరో 20 అసెంబ్లీ స్థానాల్లో మార్పులు జరిగాయన్నారు. ఒకే కుటుంబంలో ఎక్కువ మందికి సీట్లు కేటాయించడంపై ప్రశ్నించగా.. అర్హులు, గెలవగలరని పార్టీ భావిస్తే తప్పకుండా ఇస్తామన్నారు. దానిని అభ్యర్థుల బలంగానే చూడాలి తప్ప కుటుంబంగా కాదన్నారు.

బీజేపీ నాయకత్వం ఆదేశిస్తే బెజవాడ నుంచి పోటీ: సుజనా

న్యూఢిల్లీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో ఏపీలో పొత్తులపై అధిష్ఠానం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని బీజేపీ నేత సుజనా చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హైకమాండ్ ఆదేశిస్తే విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తా. నేను విజయవాడ నుంచి పోటీ చేస్తే బీజేపీకి గెలుపు ఖాయం. ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుంది. బీజేపీ కూడా అమరావతికే అనుకూలం. ఏపీలో ఈ సారి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరుగుతాయి. బీజేపీ ఫిర్యాదులతో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. వలంటీర్లను ఎన్నికల విధులకు ఈసీ దూరంగా ఉంచడం హర్షణీయం' అని సుజనా అన్నారు.

వచ్చేనెలలో పదవికి, పార్టీకి... రాజీనామా: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి రెండో వారంలోగా ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తానని నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం రచ్చబండలో భాగంగా ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. తనపై అనర్హత పిటిషన్ వేసిన వైసీపీ నాయకత్వం అనర్హుడిగా ప్రకటించేలా చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. అయినా గత ఎన్నికల్లో తన చరిష్మాతోనే గెలిచానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలసి పోటీచేయాలని ప్రజలు కోరుకుంటున్నారని, తాను కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తానన్నారు. నరసాపురం సీటును కోరుకునే పార్టీలో చేరి బరిలోకి దిగుతానని చెప్పారు.

నాకు టికెట్.. జగన్ ఇష్టం: డొక్కా

తిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): 'నా టికెట్ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇష్టం. ఇంకా ఆయన నుంచి ఎలాంటి సందేశం రాలేదు' అని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ నుంచి పోటీ చేసే విషయం జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించాలి. టికెట్ కోసం నేను ప్రయత్నాలు చేయడం లేదు. ఎవరినీ అడగను కూడా. రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే పరిపాలన రావాలని స్వామిని కోరుకున్నా. ఒంటిమిట్టలో రామాలయాన్ని నిర్మించిన ఆదిజాంబవంతుడుకి ఆలయం లేకపోవడం బాధాకరం. 22న అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ జరుగుతోంది. నేను కూడా వెళుతున్నా. అక్కడా ఆదిజాంబవంతుడి ఆలయాన్ని నిర్మించే అంశాన్ని అయోధ్య రామాలయ ట్రస్టుతో మాట్లాడతాను' అని తెలిపారు.



వైసీపీలో బీసీలకు గుర్తింపు వట్టిమాటే!

- నన్ను గన్నవరం వెళ్లమన్నారు
- అక్కడ పార్టీ గెలిచే పరిస్థితి లేదు
- బీసీని కాబట్టి ఓడినా పర్లేదనుకున్నారు
- ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు, దూషణలు
- చేయకపోవడమే నా అసమర్థతా?
- అందుకే మంత్రి పదవి ఇవ్వలేదా?
- వైసీపీ నాయకత్వంపై పార్థసారథి ఫైర్
- త్వరలో టీడీపీలో చేరతానని ప్రకటన

విజయవాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో బీసీలకు అగ్రతాంబూలం నేతి బీరలో నెయ్యి చందమేనని కృష్ణా జిల్లా పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి వ్యాఖ్యానించారు. బలహీన వర్గాలకు పార్టీలో గుర్తింపు ఉంటుందని గతంలో చెప్పానని, అది తప్పని తెలుసుకోవడానికి తనకు ఎంతో సమయం పట్టలేదన్నారు. 'ప్రతిపక్షాలపై దౌర్జన్యాలు చేయకపోవడం, అసభ్యపదజాలం వాడకపోవడమే నా అసమర్థతా? అందుకే మంత్రి పదవి ఇవ్వలేదా' అని వైసీపీ పెద్దలను ప్రశ్నించారు. పార్థసారథిని పక్కనపెట్టి వైసీపీ అధిష్ఠానం మంత్రి జోగి రమేశ్‌ను పెడన నుంచి తీసుకొచ్చి పెనమలూరులో పోటీలోకి దింపుతున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆయన శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. 'గన్నవరంలో పార్టీ గెలిచే పరిస్థితి లేదని నన్ను అక్కడకు వెళ్లి పోటీ చేయమన్నారు. బీసీ నేతను కాబట్టి ఓడినా పర్లేదని భావించారు. నేను విభేదించడంతో పక్కన పెట్టారు' అని వ్యాఖ్యానించారు. బీసీ, ఎస్సీలు ఎవరి కాళ్లపై వారు నిలబడాలనుకుంటారని, మరొకరి పెత్తనం కింద పనిచేయాల్సి వస్తే ఆత్మాభిమానం చంపుకోరని స్పష్టం చేశారు. త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. తాను ఏనాడూ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. ఏ అర్హత లేదని తనకు మంత్రి పదవి ఇవ్వలేదని మాత్రమే ప్రశ్నించానని.. ప్రజలు తనను గుర్తించినా పార్టీ అధినేత గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశానని పార్థసారథి తెలిపారు.



పెత్తందార్లకే జగన్ మొగ్గు

- ఏ పదవీ ఆశించకుండా ఐదేళ్లు పనిచేస్తే.. అధిష్ఠానం నన్ను రోడ్డుపై నిలబెట్టింది
- నాకు జరిగింది మాత్రం అన్యాయమే..
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా తీవ్ర ఆవేదన
- కార్యకర్తలు, అనుయాయులతో సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై త్వరలోనే నిర్ణయం

చింతలపూడి, జనవరి 12: 'నేను మోసపోయాను.. అధిష్ఠానం పెత్తందార్లకే మొగ్గు చూపింది. ఐదేళ్ల ఏ పదవీ ఆశించకుండా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించా. ఎంపీ కోటగిరి శ్రీధర్ వర్గీయులు తనపై కక్ష కట్టి ముఖ్యమంత్రి జగన్‌కు నాపై లేనిపోని విషయాలు చెప్పారు. నాకు సీటు ఇస్తే ఓడిపోతానని పక్కదోవ పట్టించారు. పార్టీ పెద్దలు కూడా ఇరువురినీ కూర్చోబెట్టి సమన్వయం చేయకుండా.. వేరొకరిని ఇన్‌చార్జిగా నియమించారు. అధిష్ఠానం నన్ను నడిరోడ్డుపై నిలిపింది. అనుయాయులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులతో చర్చించి తదుపరి ఆలోచన చేస్తా. నాకు మాత్రం అన్యాయమే జరిగింది' అని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తన ఆవేదనను వెళ్లగక్కారు. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయరాజును నియమిస్తూ గురువారం రాత్రి ప్రకటన వెలువడడంతో ఆయన తీవ్ర ఆవేదన, అసంతృప్తికి గురయ్యారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట నాయకులు, కార్యకర్తలను పిలిపించి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తదుపరి ఏం చేయాలనే దానిపై చర్చించారు. కొద్ది రోజులుగా ఏలూరు జిల్లాలో చింతలపూడి ఎస్సీ నియోజకవర్గంలో వైసీపీ టికెట్ ఎవరికి ఇస్తారనేదానిపై ఉత్కంఠ రేగింది. ఎంపీ కోటగిరి శ్రీధర్ వర్గం సీఎం జగన్‌ను కలిసి ఎలీజాకు ఇస్తే ఓడిపోవడం ఖాయమని చెప్పడంతో ఇన్‌చార్జిగా వేరేవారిని నియమించాలని అధిష్ఠానం భావించి విజయరాజుకు అవకాశమిచ్చింది. పార్టీలోని సీనియర్ నాయకులు, అభిమానులు ఎలీజాకే టికెట్ ఇవ్వాలంటూ ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ కో-ఆర్డినేటర్ మిధున్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లినా ఆయనను కలవలేకపోయారు. చింతలపూడి నియోజకవర్గంలో గతంలో ఉన్న వర్గ రాజకీయమే తనను రోడ్డున పడేలా చేసిందని ఎలీజా ఆవేదన వ్యక్తం చేశారు. తాను పెత్తందార్లకు దాసోహం అనలేదని, పార్టీలోని వారే తనకు సీటు రాకుండా చేశారని, ఇప్పటికీ తాను పార్టీకి విధేయుడిగానే ఉన్నానని చెప్పారు. పెత్తందార్లకు, పేదలకు మధ్య పోటీ అని సీఎం జగన్ పదేపదే చెబుతుంటారని, ఇక్కడ పెత్తందార్లకే ఆయన మొగ్గు చూపారని విమర్శించారు. ఏది ఏమైనా తాను మోసపోయానని, తన భవిష్యత్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యకర్తలతో మాట్లాడుకుని తగిన నిర్ణయం తీసుకుంటానని ఆయన చెప్పుకొచ్చారు.

ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి!



(మొదటి పేజీ తరువాయి)

కూడా ఆమోదించారు. అంతేకాదు.. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అభిప్రాయం తెలుసుకునేందుకు, మద్దతు కోరడానికి హుటాహుటిన హైదరాబాద్ వెళ్లారు. ఆయన్ను కలిసి.. తాను ఒంగోలు లోక్‌సభకు పోటీ చేద్దామనుకుంటున్నానని.. ఇద్దరం కలిసి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులుగా బరిలోకి దిగుదామని చెప్పారు. ఇందుకు ఆయన అంగీకరించలేదు. ఒంగోలు ఎంపీ టికెట్ ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఇస్తేనే తాను మద్దతిస్తానని స్పష్టం చేశారు. టికెట్ కావాలంటే రూ.180 కోట్లు డిపాజిట్ చేయాలని.. విలేకరుల సమావేశం పెట్టి టీడీపీ అధినేతలు చంద్రబాబు, లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను తిట్టిపోయాలని తాను విధించిన షరతులకు తలొగ్గని మాగుంటపై జగన్ మండిపడుతున్న సంగతి తెలిసిందే. ఆయనతో సంబంధాలు చెడడంతో జగన్ ఒంగోలులో ప్రత్యామ్నాయ అభ్యర్థి కోసం అన్వేషిస్తున్నారు. వైసీపీ తరఫున మాగుంట ఎంపీగా పోటీ చేస్తేనే తాను ఒంగోలు నుంచి అసెంబ్లీకి బరిలోకి దిగుతానని బాలినేని ఇప్పటికే సీఎంకు, ప్రాంతీయ సమన్వయకర్తలకు తేల్చిచెప్పారు. మధ్యలో ఎంపీ విజయసాయిరెడ్డి జోక్యం చేసుకుని.. మాగుంటకు సీటు కోసం కొంత ప్రయత్నం చేశారు. సీఎం మండిపడడంతో ఆయన జోలికి వెళ్లడం మానేశారు. ఇంకోవైపు.. ఒంగోలు ఎంపీగా పోటీచేసేందుకు వైసీపీకి సరైన అభ్యర్థి కనిపించడం లేదు. రూ.180 కోట్ల డిపాజిట్, విపక్ష నేతలను బూతులు తిట్టాలన్న నిబంధనలు పాటించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఐప్యాక్ సర్వే నివేదికలేవీ.. టీడీపీని తట్టుకోగలిగిన గట్టి ప్రత్యర్థి పేరును సూచించడం లేదు. దీంతో మాగుంట, బాలినేనికి చెక్ పెట్టేందుకు.. తన సన్నిహితుడు చెవిరెడ్డిని ఒంగోలు బరిలో దింపాలని జగన్ యోచించారు.

చొక్కాలు చించుకుంటున్నారట!

వైసీపీలో టికెట్లకు భారీ డిమాండ్ ఉందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతున్నారు. టికెట్ల కోసం కొట్టుకుంటున్నారని.. చొక్కాలు చించుకుంటున్నారని అంటున్నారు. ఆయనది బిల్డప్ మాత్రమేనని.. క్షేత్రస్థాయిలో అలాంటి వాతావరణమే లేదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. వైసీపీలో అభ్యర్థుల కొరత తీవ్రంగా ఉందని, అందుకే ఇతర జిల్లాల నుంచి నేతలను దిగుమతి చేసుకుంటున్నారని చెబుతున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి అయితే రూ.20-30 కోట్లు, ఎంపీ అభ్యర్థులైతే రూ.180 కోట్ల దాకా డిపాజిట్ చేయాలని షరతు పెట్టడంతో.. వైసీపీలో అత్యధిక నేతలు చేతులెత్తేశారు. టికెట్ రాదన్న ఆందోళన సిటింగ్‌లలో కనిపించడం లేదు. రాకపోవడమే మహద్భాగ్యమని ఇంట్లో కూర్చుంటున్నారు.

అభ్యర్థుల మార్పు..

కొందరు ఎమ్మెల్యేలను వేరే నియోజకవర్గాలకు ఇన్‌చార్జులుగా పంపడం వైసీపీ నేతలనూ కలవరపెడుతోంది. జగన్‌కు సన్నిహితుడని ముద్రపడిన మంత్రి ఆదిమూలపు సురేశ్‌ను యర్రగొండపాలెం నుంచి కొండపికి పంపారు. మరో మంత్రి మేరుగ నాగార్జునను వేమూరు నుంచి సంతనూతలపాడుకు, ఆరోగ్య మంత్రి విడదల రజినిని చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు బదిలీచేశారు. మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను తాడికొండకు మార్చి.. అక్కడ బాలసాని కిరణ్‌కుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును తప్పించి.. ఎక్కడో రాజాం ఎమ్మెల్యేగా ఉన్న కంబాల జోగులును అక్కడకు బదిలీచేశారు. విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ భార్య, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీని విశాఖ లోక్‌సభ బరిలో నిలుపుతున్నారు. మంత్రి జోగి రమేశ్‌ను పెడన నుంచి పెనమలూరుకు మార్చారు. స్థానికంగా దీటైన అభ్యర్థులు లేకపోవడం వల్లే ఇలా మార్పులు చేస్తున్నారు. పైగా .. అప్పటికప్పుడు వైసీపీ కండువా కప్పుకొన్న కర్ణాటక మాజీ మంత్రి శ్రీరాములు సోదరి శాంతను బళ్లారి నుంచి తీసుకొచ్చి హిందూపురం ఎంపీ టికెట్ కేటాయించారు. పార్టీలో ఇంకా చేరని విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని నానికి అదే టికెట్ ప్రకటించారు. దీనినిబట్టి వైసీపీలో అభ్యర్థుల కొరత ఎంత ఉందో అర్థమవుతోందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

కాకినాడ జిల్లాలో జగన్‌పై ధిక్కారం

- పార్టీ జెండా, సీఎం ఫొటో లేకుండా ఎమ్మెల్యేల కార్యక్రమాలు

కాకినాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్‌పై కాకినాడ జిల్లాలో ధిక్కార స్వరం మొదలైంది. పిఠాపురం, ప్రత్తిపాడుల్లో సిటింగ్‌లకు టికెట్లు నిరాకరించి వేరే వాళ్లను ఇన్‌చార్జులుగా నియమించడంతో.. అక్కడి ఎమ్మెల్యేలు బలప్రదర్శనకు దిగారు. పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఘనంగా తన పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మహిళలు భారీగా తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చిన వారందరికీ విందు ఏర్పాటు చేశారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో ఎక్కడా జగన్ ఫొటోలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గ ప్రజలు తనను మళ్లీ చూడాలని కోరుకుంటున్నారని, టికెట్ విషయంపై జగన్ పునరాలోచించాలని దొరబాబు కోరారు. లేదంటే కేడర్, ప్రజల అభిప్రాయం మేరకు తన నిర్ణయం ఉంటుందని చెప్పారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సీఎంపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ప్రజాదీవెన పేరుతో నియోజకవర్గంలోని రౌతులపూడి మండలం పి.చామవరంలో శుక్రవారం సభ నిర్వహించారు. కార్ల ర్యాలీతో ఇక్కడకు చేరుకున్నారు. సభలో గానీ, కార్లకు గానీ ఎక్కడా వైసీపీ జెండాలు కనిపించలేదు. టికెట్ రాకపోతే ఒంటరి పోరాటం చేస్తానని పర్వత ప్రకటించారు.

మేజిస్ట్రేట్‌వి యాంత్రిక ఉత్తర్వులు

- కృష్ణారెడ్డిని బెదిరించడం వాస్తవం కాదు
- వివేకాకుమార్తె, అల్లుడు, సీబీఐ వాదనలు
- వివేకా వద్ద పనిచేసిన కృష్ణారెడ్డికి నోటీసులు
- హైకోర్టు విచారణ ఈనెల 22కి వాయిదా

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ దాఖలుచేసిన వ్యాజ్యాలపై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ప్రతివాది కేవీ కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది. దిగువ కోర్టు చార్జిషీట్‌ను కాగ్నిజెన్స్‌లోకి తీసుకొంటే తమ వ్యాజ్యాలు నిరర్థకం అవుతాయని, మేజిస్ట్రేట్ కోర్టులో తదుపరి ప్రక్రియను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న పిటిషనర్ల అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఉత్తర్వులు జారీచేసే ముందు ఫిర్యాదుదారు కృష్ణారెడ్డి తరపు వాదనలు కూడా వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. తదుపరి విచారణను జనవరి 22కు వాయిదావేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలని, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఒత్తిడికి చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయడం లేదని ఆరోపిస్తూ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు, కేసు నమోదు చేసి జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దీంతో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా చార్జ్‌షీటు వేశారు. పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు, దాని ఆధారంగా పోలీసులు నమోదుచేసిన కేసును కొట్టివేయాలని వీరు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు. "ప్రైవేటు ఫిర్యాదుపై ప్రాథమిక విచారణకు ఆదేశించి, వివరాలు తెప్పించుకోకుండానే కేసు నమోదుకు పోలీసులను పులివెందుల మేజిస్ట్రేట్ ఆదేశించారు. మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఉత్తర్వులు ఇచ్చారు. సీబీఐ ఎస్పీ కోరిన విధంగా వాంగ్మూలం ఇవ్వాలని పిటిషనర్లు ఒత్తిడి చేశారన్న కృష్ణారెడ్డి ఫిర్యాదులో వాస్తవం లేదు. మృతుడు వివేకానందరెడ్డి వద్ద ఉద్యోగి అయిన కృష్ణారెడ్డిని దర్యాప్తునకు సహకరించాలని మాత్రమే పిటిషనర్లు కోరారు. మేజిస్ట్రేట్ ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు దర్యాప్తు పూర్తిచేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఆ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకొంటే మా పిటిషన్ నిరర్థకం అవుతుంది. దిగువ కోర్టులో తదుపరి ప్రక్రియను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వండి"అని ఆయన కోరారు. సీబీఐ దర్యాప్తు అధికారి రామ్‌సింగ్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ స్పందించారు. "ఫిర్యాదుదారుడి ప్రమాణపూర్వక వాంగ్మూలాన్ని నమోదు చేయకుండానే మేజిస్ట్రేట్ యాంత్రికంగా కేసు నమోదు చేసి తుది నివేదిక దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎస్పీపై ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోలేదు. అందువల్ల ఆయన పై కేసు నమోదు చెల్లదు. మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఆదేశాలు ఇచ్చారు. సీబీఐ ఎస్పీపై గతంలో కూడా కేసు నమోదు చేయగా, హైకోర్టు స్టే విధించింది" అని తెలిపారు. ఆ వివరాలను కోర్టు ముందు ఉంచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. "తాము చెప్పిన విధంగా సాక్ష్యం చెప్పాలని పిటిషనర్లు కృష్ణారెడ్డిని ఒత్తిడి చేశారు. పోలీసులు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం మేజిస్ట్రేట్ వద్ద కృష్ణారెడ్డి ప్రైవేటు ఫిర్యాదు ఇచ్చారు. పిటిషనర్ల కారణంగా కృష్ణారెడ్డి కుమారుడి పెళ్లి కూడా నిలిచిపోయింది. రాజకీయ పెద్దల పేర్లు చెప్పాలని ఎస్పీ రామ్‌సింగ్.. కృష్ణారెడ్డిని తీవ్రంగా కొట్టారు. సీబీఐ ఎస్పీపై కేసు నమోదుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. హత్య కేసు దర్యాప్తు నుంచి ఎస్పీ రామ్ సింగ్‌ను సుప్రీం కోర్టు తప్పించింది" అని తెలిపారు. ఈ వాదనలపై సునీత, రాజశేఖర్‌రెడ్డి తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తప్పుడు వివరాలు చెబుతున్నారని, కృష్ణారెడ్డి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు. నేరుగా ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చారని చెప్పారు. పిటిషనర్ల కారణంగా కుమారుడి పెళ్లి నిలిచిపోయిందని కృష్ణారెడ్డి తన ఫిర్యాదులో ఎక్కడా పేర్కొనలేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి....ప్రతివాది కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది.

అ'ధర్మ' సామంతరాజు

అమ్మో ఎమ్మెల్యే

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే! మరోవైపు చూస్తే.. నదులను, కొండగుట్టలను కొల్లగొడతారు. ల్యాండ్ సెటిల్మెంట్లు చేస్తారు. భారీగా ఆదాయం వచ్చే పనులు చేస్తున్నవారు ఆయనకు వాటా ఇవ్వాల్సిందే. ఎమ్మెల్యే అవినీతి చిట్టా బయటపెట్టినా, పల్లెత్తు మాటన్నా, ప్రశ్నించినా భౌతికదాడులు తప్పవు. అక్రమ కేసులతో ఇరికించేస్తారు. ఇక ఇసుక తవ్వకాల్లో లెక్కలేనంత సొమ్ము వెనకేసుకున్నారు. సొంత నియోజకవర్గంలో పార్టీలో తనకు పోటీకి వచ్చే నాయకుడే లేకుండా చక్రం తిప్పుతున్నారు. ఆయన దందాలకు అధికారగణమంతా సహకారం అందిస్తోంది.

ఇసుకలో కుమ్ముడే కుమ్ముడు

నియోజకవర్గంలో నదీ పరివాహక ప్రాంతంలో కనుచూపు మేర ఇసుక మేటలు భారీగా ఉన్నాయి. ఎమ్మెల్యే అనుచరుల అనుమతి లేనిదే నది నుంచి ఇసుక రేణువు కూడా బయటకు వెళ్లదు. నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఆయన కనుసైగల్లోనే ఇసుక దందా సాగుతోంది. తన అనుచరులు నలుగురిని బినామీలుగా పెట్టుకుని, వారి ద్వారా వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటకకు తరలిస్తున్నారు. ప్రతి రోజు రూ.50 లక్షల విలువైన ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎమ్మెల్యేకు ఎప్పటికప్పుడు వాటా సొమ్ము చేరుతోంది. ఇటీవల వాటాలు కుదరక ఎమ్మెల్యే అనుచరులు పరస్పర దాడులు చేసుకునే దాకా వెళ్లింది. ఎమ్మెల్యే జోక్యంతో పోలీసు కేసు కాకుండా సద్దుమణిగింది.

ఎకరా 5 లక్షలు.. నేడు 80 లక్షలు

నియోజకవర్గంలోనే 20 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఏపీసీఎంసీ సోలార్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 106 ఎకరాల భూమిని కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ 106 ఎకరాలను ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులు భాగస్వాములుగా ఉన్న సంస్థ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సోలార్ కంపెనీ యజమానులను బెదిరించి ఎకరా రూ.5 లక్షల చొప్పున కొనుగోలు చేశారు. ఈ భూమి విలువ ప్రస్తుతం ఎకరా రూ.80 లక్షల నుంచి రూ.కోటి దాకా పలుకుతోంది. నియోజకవర్గంతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లా, తెలంగాణలో వందలాది ఎకరాల భూములను ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యుల పేరిట కొనుగోలు చేశారని సమాచారం.

గుట్టనూ చెరబట్టారు

నియోజకవర్గంలో ఓ గ్రామ పరిధిలో తమ్ముడి భార్య పేరుతో 25.38 ఎకరాలు కొనుగోలు చేశారు. కానీ ఈ భూమి విస్తీర్ణం గూగుల్ మ్యాప్ ఆధారంగా 45.47 ఎకరాలు చూపిస్తోంది. దీన్నిబట్టి గుట్టపై 20 ఎకరాలకు పైగా ఆక్రమించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ భూములున్న గుట్టపై నుంచి నియోజకవర్గ కేంద్రం, చెరువు వ్యూ కన్పించేలా విలాసవంతమైన ఫామ్‌హౌస్ నిర్మించారు.

ఎటు చూసినా మామూళ్లే!

నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో నిత్యం వచ్చే అక్రమార్జనలో ప్రతి నెలా ఎమ్మెల్యేకు వాటా పంపాల్సిందే. రియల్టర్లు ఎక్కడ వెంచర్ వేయాలన్నా మొదట ఎమ్మెల్యే అనుచరులను కలవాలి. అప్పుడే అనుమతులు వస్తాయి. లేకుంటే అంతే సంగతులు. ప్రతి వెంచర్‌లో విలువను బట్టి 10 నుంచి 15 శాతం కప్పం చెల్లించాల్సిందే. నియోజకవర్గ కేంద్రంలో రెండు బార్లలో ఎమ్మెల్యేకు వాటా ఉంది. ఎమ్మెల్యేను అడ్డుపెట్టుకుని ఆయన అనుచరులు కూడా ఖాళీ స్థలాలను కబ్జా చేసి కోట్లు దండుకుంటున్నారు. అసైన్డ్ భూముల పంపిణీలో విలువైన భూములన్నీ ఎమ్మెల్యే అనుచరులకే దక్కాయి. నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రతి మండలంలో ఎమ్మెల్యే అనుచరగణం భారీగా ప్రభుత్వ స్థలాలు, భూములను కొట్టేశారు.

అమూల్.. అభాసు'పాలు'!

(మొదటి పేజీ తరువాయి)

వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసింది. అమూల్‌తో ఒప్పందాన్ని అమలు చేయడానికి 'జగనన్న పాలవెల్లువ' పథకాన్ని తెచ్చింది. ఇంత చేసినా అవేవీ అమూల్ పాల సేకరణకు పెద్దగా ఉపకరించింది లేదు. కారణం.. పాడి రైతుల్లో జగన్‌పై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలు. లీటర్ పాలకు రూ.4 బోనస్ ఇస్తామంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించి మాట తప్పడంపై పాడి రైతులు గుర్రుమంటున్నారు. దీంతో అమూల్‌కే పాలు పోయాలన్న జగన్ కోరికని పాడి రైతులు పట్టించుకోవడం లేదు.

లెక్కలు గల్లంతు..

రాష్ట్రంలో పాల వ్యాపారం కోసం 2020 జూలైలో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థతో అమూల్ ఒప్పందం చేసుకుంది. 2020 డిసెంబరు 2న సేకరణ ప్రారంభించింది. తొలి దశలో మూడు ఉమ్మడి జిల్లాల్లో పాల సేకరణ మొదలుపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 9,899 గ్రామాల్లో పాలు సేకరించాలనేది లక్ష్యం.. దీనికోసం తెచ్చిన జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా అనేక శాఖల యంత్రాంగాన్ని ప్రభుత్వం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేసింది. అమూల్‌కు పాలు పోసేందుకు మహిళా పాడి రైతులతో పాల ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయించారు. చేయూత, ఆసరా పథకాల కింద ఇచ్చిన సొమ్ముతో గేదెలు, ఆవులు కొనుగోలు చేసి,ఉత్పత్తి చేసిన పాలను అమూల్‌కే అమ్మాలని ప్రభుత్వ పెద్దలు హుకుం జారీచేశారు. కానీ 4.60లక్షల మంది లబ్ధిదారుల్లో అత్యధిక శాతం డెయిరీ యూనిట్లను ఎత్తేశారు. దీంతో ప్రభుత్వ పెద్దలు ఊహించినట్లు అమూల్‌కు పాలు రావట్లేదు. అయినా 4,900 బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లు(బీఎంసీయూలు), 11,690 ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల (ఏఎంసీయూలు)ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,600 కోట్లు వెచ్చించింది. దీంతో మొత్తం 19 జిల్లాల్లో అమూల్ అడుగుపెట్టింది. కానీ నాలుగైదు జిల్లాలు వినహా మిగతా జిల్లాల్లో నామమాత్రంగానే పాలు కొనుగోలు చేస్తోంది. అమూల్ కొనే పాలల్లో అన్నమయ్య జిల్లా నుంచి 21.1%, ప్రకాశం నుంచి 12.9%, పల్నాడు నుంచి 11%, చిత్తూరు జిల్లా నుంచి 10% మాత్రమే వస్తుండగా, విగతా 15జిల్లాల నుంచి 1నుంచి 8శాతంలోపే ఉన్నాయి.

ఆదరించని పాడి రైతు

ఉత్పత్తి అయ్యే పాలలో అధిక భాగం ఆర్గనైజింగ్ సెక్టార్‌లోకి తీసుకొచ్చే లక్ష్యంతో అమూల్‌తో ఒప్పందం చేసుకున్నామని సీఎం జగన్ అప్పట్లో చెప్పుకొచ్చారు. అమూల్ రాక ముందు ప్రైవేటు డెయిరీలు లీటర్‌కు రూ.10.95 వరకు తక్కువ చెల్లించాయని, ఇప్పుడు లీటరుకు రూ.4నుంచి రూ.15వరకు అదనంగా పాడి రైతుకు వస్తోందని ప్రభుత్వం ప్రచారం చేసింది. కానీ రాష్ట్రంలోని ఇతర ప్రైవేట్ డెయిరీలకు పాలు అమ్మే రైతుల కంటే, అమూల్‌కు పాలు పోసే పాడి రైతులకు లభించే ధరలో ఏ మాత్రం వ్యత్యాసం లేదనేది వాస్తవం. సహజంగా ఏటేటా పశుపోషణకు అయ్యే ఖర్చులు, పాల ఉత్పత్తి, ప్యాకింగ్ ఖర్చు, పాల ఉత్పత్తుల డిమాండ్ మేరకు పాల సేకరణ ధరను డెయిరీలు పెంచడం జరుగుతుంది. కొన్ని డెయిరీలు పాడి రైతులకు బోనస్‌లు, ఇతర సేవలు అందిస్తున్నాయి. అమూల్ మాత్రం పాలల్లో వెన్నశాతం బట్టి పాడి రైతులకు సొమ్ము చెల్లించడం తప్ప, ఇతర సహాయ కార్యక్రమాలు అందించడం లేదని పాలు పోసే వారే చెప్తున్నారు. అందుకే వినియోగదారులు ఎక్కువగా వాడే గేదె పాలను అమూల్‌కు అమ్మడానికి పాడి రైతులు ఆసక్తి చూపడంలేదు. అమూల్ మూడేళ్లలో సేకరించిన మొత్తం పాలల్లో ఆవుపాలు కన్నా గేదె పాలు చాలా తక్కువ. వెన్నశాతం తక్కువగా ఉండే ఆవు పాలనే అమూల్ ఎక్కువగా కొనుగోలు చేస్తోంది.

బోనస్ బుస్సే!

లీటరు కిన్లే వాటర్ బాటిల్ ఖరీదు రూ.23 ఉంటే, లీటరు పాలకు రూ.23కూడా రావడం లేదని ప్రైవేట్ డెయిరీలకు పాలు పోసే అక్కచెల్లెమ్మలు తన పాదయాత్రలో చెప్పారని గత ఎన్నికల ప్రచారంలో అప్పట్లో జగన్ అనేవారు. తాను అధికారంలోకి వచ్చాక డెయిరీలకు పాలు పోసే ప్రతి పాడి రైతుకు ప్రతి లీటరుకు రూ.4బోనస్ ఇస్తానని పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక పొరుగు రాష్ట్రం గుజరాత్‌కు చెందిన అమూల్‌తో ఒప్పందం చేసుకుని, ఈ డెయిరీ అధిక ధరకు పాలు కొనుగోలు చేస్తుందని, ఆ వ్యత్యాసమే బోనస్‌గా భావించాలని నాలుక మడతేశారు. జగన్ చెప్పిన బోనస్ బుస్ అని చివరకు తేలిపోవడంతో అమూల్‌కు పాలు పోయడానికి పాడి రైతులు ఆసక్తి చూపడం లేదు.

బీఈడీ కాలేజీలకు ఊరట

- ఉన్నత విద్యామండలికి తనిఖీల అధికారం లేదు
- జీవో 1 చట్ట విరుద్ధమంటూ కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు బీఈడీ కళాశాలల యాజమాన్యాలకు హైకోర్టులో ఊరట లభించింది. రాష్ట్రంలోని బీఈడీ కాలేజీల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఏపీ ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తప్పుపట్టింది. జీవో 1ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ దాన్ని కొట్టివేసింది. తనిఖీలు నిర్వహించాలని భావిస్తే ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్‌లోని సెక్షన్ 31 ప్రకారం అధికారిని నియమించవచ్చని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఏపీ ఉన్నత విద్యామండలికి అప్పగిస్తూ ఈ ఏడాది జనవరి 1న ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ ప్రైవేటు బీఈడీ కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గుండారెడ్డి, మరికొన్ని కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించారు. ఏపీ ఎడ్యుకేషన్ యాక్ట్-1982, ఏపీ యూనివర్సిటీస్ యాక్ట్-1991 నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ జీవోను కొట్టివేయాలని కోరారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపిస్తూ.. చట్టనిబంధనల ప్రకారం బీఈడీ కళాశాలలను తనిఖీ చేసే అధికారం యూనివర్సిటీలకు మాత్రమే ఉందన్నారు. ఇప్పటికే విశ్వవిద్యాలయాలు నియమించిన త్రిసభ్య కమిటీ కళాశాలల్లో తనిఖీలు పూర్తి చేసి నివేదిక సమర్పించిందన్నారు. ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి సలహాలు మాత్రమే ఇవ్వగలదని, ప్రభుత్వ జీవో చెల్లుబాటు కాదని అన్నారు. జనవరి నెల వచ్చినా ఏపీ ఎడ్‌సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను ఇప్పటివరకు ప్రకటించలేదన్నారు. సాధ్యమైనంత త్వరగా షెడ్యూల్ ప్రకటించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఉన్నత విద్యాశాఖ తరఫు న్యాయవాది కేవీ రఘువీర్ వాదనలు వినిపిస్తూ... కళాశాలల్లో విద్యాప్రమాణాలు పెంచే ఉద్దేశంతో తనిఖీల నిర్వహణ అధికారాన్ని ఉన్నత విద్యామండలికి అప్పగించామన్నారు. నిబంధనలకు అనుగుణంగానే జీవో ఇచ్చామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ప్రభుత్వం జారీచేసిన జీవో చట్టనిబంధనలకు విరుద్ధంగా ఉందని పేర్కొంటూ దాన్ని కొట్టివేశారు.



:కోతకు గురైన ఏటిగట్టును పరిశీలిస్తున్న మాధవ నాయుడు

ఏటిగట్టు పనులు నీటిపాలు!

- వరదల్లేకున్నా 50మీటర్ల మేర నదిలోకి కోత
- భయంగుప్పిట్లో పొన్నపల్లి వాసులు
- 2022లో సాక్షాత్తూ సీఎం శంకుస్థాపన
- నాసిరకం పనులపై గతంలోనే ఫిర్యాదు..

నరసాపురం టౌన్, జనవరి 12: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద చేపట్టిన ఏటిగట్టు పనుల్లో డొల్లతనం బయటపడింది. సుమారు రూ.28 కోట్ల అంచనాతో చేపట్టిన గట్టు పటిష్ట పనులు ఇటీవల గోదావరిలో కొట్టుకుపోయాయి. సుమారు 50 మీటర్ల మేర గట్టుకు కోత పడింది. ప్రస్తుతం గట్టుపై ఉన్న 8మీటర్ల వెడల్పు రోడ్డు మాత్రమే విగిలింది. ఇది కూడా క్రమంగా కోతకు గురవుతూ వస్తుండటంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గోదావరి పక్కనే ఉన్న పొన్నపల్లి వాసులు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. 2022 జూన్‌లో గోదావరికి వరద పోటెత్తినప్పుడు పట్టణంలోని అమరేశ్వరస్వామి ఆలయం నుంచి బుడితల రేవు వరకు ఏటిగట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50లక్షలు వెచ్చించి తాత్కాలికంగా అడ్డుకట్ట పనులు చేపట్టారు. 2022 నవంబరులో రూ.28 కోట్ల అంచనాతో చేపట్టే గట్టు పటిష్ట పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. 2023 మేలో పనులు చేపట్టారు. అమరేశ్వరస్వామి నుంచి బుడితలరేవు వరకు 100 మీటర్ల గట్టును పటిష్టపర్చి కోతకు గురికాకుండా రాళ్లతో గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి స్వామి ఆలయం నుంచి శ్మశానం వరకు 200 మీటర్ల గట్టు పటిష్ట పర్చాల్సి ఉండగా 100 మీటర్లు మాత్రమే ఇప్పటికి పూర్తయింది. ఇక్కడ వినియోగించిన రాళ్లు నాసిరకమైనవని అంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఈపనులకు బినామీలుగా వ్యవహరిస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని గత ఆగస్టులో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో.. కోట్లాది రూపాయల పనులు నేడు నీటిపాలయ్యాయి. ప్రస్తుతం వరద లేకుండానే గట్టు 50 మీటర్లు కొట్టుకుపోవడం ప్రజల్ని విస్మయానికి గురి చేసింది. మరోవైపు కోతకు గురైన ప్రదేశంలో తాత్కాలికంగా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు కోతకు గురైన గట్టును శుక్రవారం పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మరోసారి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరిపై ఫైర్ అయ్యారు. కోతకు ముదునూరి బాధ్యత వహించాలని, చేసిన పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు కొవ్వలి రామ్మోహన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఏటి గట్టును పరిశీలించారు.

మళ్లీ వాట్సా్‌ప్‌లో ప్రశ్నపత్రాలు

- ఎఫ్ఏ-4 పరీక్షలకు పంపుతామన్న పాఠశాల విద్య
- ఎస్ఏ-2 పరీక్షలకే ముద్రించిన ప్రశ్నపత్రాలు
- ఫిబ్రవరి 23 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వాట్సా్‌ప్‌లో ప్రశ్నపత్రాలు పంపించే విధానాన్ని జగన్ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంది. ఈ విద్యా సంవత్సరంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలకు వాట్సా్‌ప్‌లోనే ప్రశ్నపత్రాలు పంపగా వచ్చే నెలలో జరిగే ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4 పరీక్షలకూ అలాగే పంపనున్నట్లు తెలిపింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 23 నుంచి 28 వరకు ఎఫ్ఏ-4 పరీక్షలు, ఏప్రిల్ 8 నుంచి 22 వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలు జరుగుతాయని తెలిపింది. పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 4 వరకు జరుగుతాయని పేర్కొంది. ఇందులో ఎస్ఏ-2 పరీక్షలకు, ప్రీఫైనల్ పరీక్షలకు ముద్రించిన ప్రశ్నపత్రాలు సరఫరా చేస్తారని, అందుకోసం జిల్లా కామన్ పరీక్షల బోర్డులకు నిధులు ఇవ్వాలని సమగ్రశిక్ష కార్యాలయాన్ని ఆదేశించింది. కాగా, ఎన్ని విమర్శలు వచ్చినా వాట్సా్‌ప్‌లో ప్రశ్నపత్రాలు పంపే విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. గతంలో అన్ని పరీక్షల ప్రశ్న పత్రాలను ముద్రించి ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిధులు మిగుల్చుకునే ఉద్దేశంతో ఏడాదికి రెండు పరీక్షలకు ప్రశ్నపత్రాలు ముద్రించడం లేదు. ప్రతిరోజూ ఉదయం ఆ ప్రశ్నపత్రాలను ప్రధానోపాధ్యాయులకు వాట్సా్‌ప్‌లో పంపుతారు. వాటిని సంబంధిత టీచర్లు బోర్డులపై రాస్తారు. వాటిని చూస్తూ విద్యార్థులు సమాధానాలు రాయాలి. చాలా చోట్ల ప్రశ్నపత్రాలు రాసేందుకు బోర్డులు సరిపోవడం లేదు. ఈ విధానం మార్చాలని ప్రశ్నపత్రాలు ముద్రించి ఇవ్వాలని టీచర్లు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో చాలాచోట్ల హెచ్‌ఎంలే సొంత డబ్బులతో జిరాక్స్‌లు తీయించి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

పాఠ్య ప్రణాళికలో ఫ్యూచర్ స్కిల్స్

- ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన కల్పించాలి
- విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి జగన్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ స్కిల్స్ అంశాన్ని వీలైనంత త్వరగా పాఠ్య ప్రణాళికలో పొందుపరచాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ (ఆర్థిక అక్షరాస్యత)పైనా అవగాహన పెంచాలన్నారు. దీంతో విద్యార్థులకు ఆర్థిక అంశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై ఆయన సమీక్షించారు. ఇప్పటికే 2,066 మంది ఇంజనీరింగ్ విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్స్ నిపుణులుగా నియమించామని, వారికి గౌరవ వేతనం ఇస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఫ్యూచర్ స్కిల్స్‌పై ఒక సెమిష్టర్‌కు సిలబస్ రూపొందించామన్నారు. ఈనెల 31న ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుందని అధికారులు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఐబీ బోధనపై శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని, టీచర్లు, అధికారులకు శిక్షణ ఇస్తారని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతికి ఐబీ విద్యా బోధన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

టీడీపీ నాయకులను వేధించడమే వైసీపీ లక్ష్యం: బండారు

నగరి, జనవరి 12: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి విమర్శించారు. కేసులు పెట్టి తిప్పలు పెడుతున్నారన్నారు. తనను అసభ్యంగా దూషించారని మంత్రి రోజా నగరి మేజిస్ట్రేట్ కోర్టులో పెట్టిన కేసుకు సంబంధించి శుక్రవారం హాజరయ్యారు. ఈ కేసును ఫిబ్రవరి 13కి వాయిదా వేస్తూ నగరి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి విష్ణువర్మ ఆదేశాలిచ్చారు. ఆ సందర్భంగా నగరిలో బండారు మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ కేసులు పెట్టి బెదిరించాలని వైసీపీ చూస్తోందని, వాటికి బెదిరేది లేదని స్పష్టం చేశారు.

జగన్‌ను తల్లి, చెల్లి ఛీ కొడితే...

- కేశినేని నానిని తమ్ముడు ఛీ కొట్టాడు: బుద్దా వెంకన్న

విజయవాడ, జనవరి 12: 'జగన్‌ను తల్లి, చెల్లి ఛీ కొడితే... కేశినేని నానిని అతని సోదరుడు చిన్ని ఛీ కొట్టాడు. కేశినేని నాని ఓ ఛీటర్. వ్యక్తిత్వం లేని ఊసరవెల్లి' అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. విజయవాడ వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కేశినేని నాని ఓ శాడిస్టు. ముదురు సైకోలా మారాడు. కొవ్వు బలిసి కొట్టుకుంటున్నాడు. అతనో కబ్జాదారు, అవినీతి పరుడు. అతని అవినీతిని బయటపెట్టేందుకు నేను సిద్ధం. అతనో బచ్చాగాడు, కోస్ కిస్కో గొట్టంగాడు. కండువా కప్పుకోకుండానే వైసీపీలో అతనికి సీటు ఇచ్చారంటే ఇక ఆ పార్టీ పరిస్థితి ఏమిటో ఊహించుకోవచ్చు. ఇప్పటిదాకా నాని వెంట ఉన్న వారంతా అతను పార్టీ మారినా అతని వెంట వెళ్లలేదు. అతనిని తిరస్కరించిన టీడీపీ కార్యకర్తలకు సెల్యూట్ చేస్తున్నా. టీడీపీలో ఉండగా ఇన్‌చార్జ్‌లను పక్కన పెట్టుకోని నాని ఇప్పుడు దేవినేని అవినాశ్‌ను వెంట పెట్టుకుంటున్నాడు. అతను పక్కన లేకపోతే తంతారని నానీకి తెలుసు' అని వెంకన్న అన్నారు.



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయిన వైసీపీ సర్పంచ్ నరేంద్ర



నరేంద్రను విడిచిపెట్టాలని వత్సవాయి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

లంచం వయా వైసీపీ సర్పంచ్!

- ఏసీబీ వలలో వత్సవాయి తహసీల్దారు!
- లంచం వసూలు చేసిన వైసీపీ సర్పంచ్ కూడా..
- ఇనాం భూమి పట్టా కోసం రూ.50వేలు వసూలు
- ఇద్దరూ పోలీసుల అదుపులో..

వత్సవాయి, జనవరి 12: ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం ఆళ్లూరుపాడులో ఇనాం భూమికి పట్టాలు ఇచ్చేందుకు వైసీపీ సర్పంచ్ ద్వారా వత్సవాయి తహసీల్దార్ వైకుంఠరావు రూ.50,400 లంచం వసూలు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆళ్లూరుపాడుకు చెందిన బాధితుడు ఫణితి కొండాకు చెందిన 84 సెంట్ల ఇనాం భూమికి పట్టా ఇచ్చేందుకు స్థానిక వైసీపీ సర్పంచ్ యలవర్తి నరేంద్ర ద్వారా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. ఈ మేరకు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఏసీబీ ఏఎస్పీ ఎం.స్నేహిత కథనం మేరకు.. తొలుత బాధితుడు ఫణితి కొండా తన కుమారుడు వరసయ్యే వైసీపీకి చెందిన ఎంపీటీసీ గోపాలకృష్ణ ద్వారా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు మూడు రోజులపాటు వల పన్ని శుక్రవారం రైతు కొండా ద్వారా తొలుత సర్పంచ్ నరేంద్రకు ఇప్పించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు తీసుకున్నానని సర్పంచ్ నరేంద్ర చెప్పడంతో అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే, అతడిని విడిపించేందుకు వైసీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. వత్సవాయి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అప్పటికే సమాచారం అందుకున్న సీఐ జానకీరాం పోలీసు సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నారు. నందిగామ ఏసీపీ కె.జనార్దన్ నాయుడు అక్కడకు పరిస్థితిని అదుపు చేశారు. ఏసీబీ అడిషనల్ ఏఎస్పీ ఎం.స్నేహిత, డీఎస్పీ డి.శ్రీనివాస్, శరత్ కుమార్, సీఐ శివకుమార్, శ్రీనివాస్ మొత్తం 25 మంది అధికారులు శుక్రవారం సాయంత్రం ఈ పథకాన్ని అమలు చేశారు.



వత్సవాయి తహసీల్దారు వైకుంఠరావు(ఫైల్)

కాపులపై బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ విమర్శ

- పీకే రావును చుట్టుముట్టిన కాపు యువకులు
- బహిరంగ క్షమాపణ చెప్పిన పేరి



అంబాజీపేటలో పీకే రావుతో వాగ్వాదం చేస్తున్న కాపు నేతలు

అంబాజీపేట, జనవరి 12: బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు (పీకే రావు) కాపులపై చేసిన వ్యాఖ్యలు స్వల్ప ఉద్రిక్తతకు దారితీశాయి. కాపు యువకులు చుట్టుముట్టి నిలదీయడంతో చివరకు ఆయన బహిరంగ క్షమాపణలు కోరారు. కోనసీమ జిల్లా అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సమక్షంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు (పీకేరావు) కాపు కులాన్ని తూలనాడుతూ వ్యాఖ్యానించారు. 'జనసేన పార్టీ కాపుల పార్టీ. టీడీపీ వేసే ముష్టి 25 అసెంబ్లీ సీట్లలో ఎంత మందికి కాపులు కేటాయిస్తారు? వారిలో ఎంత మంది విజయం సాధిస్తారు? రెండా... మూడా..! కాపు కులస్తుల భర్తలు చెప్పిన మాటలు వారి భార్యలే వినరు. దీంతో ఓటమి పాలవుతున్నారు' అని పీకే రావు అన్నారు. ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో కాపు నాయకులు, యువకులంతా పీకే రావును చుట్టుముట్టారు. కాపులను విమర్శిస్తే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తిని కాపు నేతలు నిలదీశారు. ఇటువంటి వారిని వెంట బెట్టుకుని కార్యక్రమాలకు వెళితే ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. దీంతో కాపులను విమర్శించడాన్ని వేణుగోపాలరావు ఖండించారు. ఒక దశలో జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పీకే రావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తక్షణం కాపులకు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అక్కడ ఉన్న కాపు నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ఆరోగ్యశ్రీపై సందేహాలు ఉండకూడదు

- బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులపై దృష్టిపెట్టండి
- ఆరోగ్యశాఖ సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు అందిస్తున్నామని, వాటిని ఎలా పొందాలన్న విషయంలో ఎవ్వరికీ సందేహాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. దీనిపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ... గ్రామాల్లో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని, మంచానికే పరిమితమైన వారికి కావాల్సిన మందులు ఇవ్వాలని చెప్పారు. ప్రతి 6 నెలలకోసారి రికార్డులు అప్‌డేట్ చేయాలని, ఇవన్నీ కూడా మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఈ ప్రక్రియ గ్రామాల్లో 100 శాతం జరగాలని చెప్పారు. ప్రివెంటివ్ కేర్ ముఖ్యమని, క్యాంపుల ద్వారా ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి అవసరమైన వారికి వైద్య సేవలందించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని డ్రైవ్ చేయాలని ఆదేశించారు. కాగా, జగనన్న ఆరోగ్య సురక్ష అమలు, పురోగతిని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. నూతన మెడికల్ కాలేజీలకు సంబంధించిన స్టేటస్‌ను వివరించారు. వాటికి కావాల్సిన ఎక్విప్‌మెంట్‌పై దృష్టిపెట్టాలని సీఎం జగన్ వారికి సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



నిర్మానుష్యంగా ఉన్న శ్రీవారి ఆలయ ప్రాంతం

తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో వరుస సెలవులు రావడంతో సొంతూళ్లకు పయనమవుతుండటంతో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య శుక్రవారం మధ్యాహ్నం నుంచి తగ్గింది. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు కేవలం 13 కంపార్టుమెంట్లు మాత్రమే భక్తులతో నిండిఉన్నాయి. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ వెలుపల క్యూలైన్లు, పరిసర ప్రాంతాల్లో భక్తులు పలుచగా కనిపిస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు 5జీ టెక్నాలజీ కోర్సు

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం '5జీ కమ్యూనికేషన్ టెక్నాలజీపై మార్గదర్శక కోర్సును రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. తాడేపల్లిలోని ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ వినోద్‌కుమార్ ఈ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. టెలికాం సెక్టార్ కౌన్సిల్ (టీఎస్ఎస్‌సీ), జర్మన్ అకాడమీ ఆఫ్ డిజిటల్ ఎడ్యుకేషన్ (డీఏడీఈ) సహకారంతో ఈ నూతన కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

పంచాయతీల నిధులన్నీ విడుదల చేశాం: కమిషనర్

కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి సంబంధించి డిసెంబర్ 28న రెండో విడత కింద బేసిక్ గ్రాంట్ రూ.393 కోట్లు, జనవరి 3న టైడ్ గ్రాంట్ రూ.594 కోట్లు విడుదల చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్ గ్రాంట్ మొత్తం రూ.393 కోట్లు ఈ నెల 6న స్థానికసంస్థల ఖాతాలకు పంపామని, టైడ్ రెండో విడత మొత్తం రూ.594 కోట్లు శుక్రవారం అన్ని స్థానికసంస్థలకు జమచేశామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.988 కోట్లు స్థానికసంస్థలకు బదిలీ చేశామని వెల్లడించారు.

ఏడేళ్ల చిన్నారిపై యువకుడి అత్యాచారం

దేవనకొండ, జనవరి 12: ఏడేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కోటకొండ గ్రామానికి చెందిన మునిరంగడు(26) డిగ్రీ వరకు చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. అతని భార్య ప్రసవం నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. అదే గ్రామంలో మూడో తరగతి చదువుతున్న బాలికకు మాయమాటలు చెప్పి శుక్రవారం మధ్యాహ్నం గ్రామ సచివాలయం పక్కకు తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ ఘటనలో చిన్నారికి తీవ్ర రక్తస్రావమైంది. కుటుంబ సభ్యులు వైద్యచికిత్స నిమిత్తం కోడుమూరు వైద్యశాలకు తీసుకెళ్లారు. బాలిక అపస్మారక స్థితికి చేరుకోవడంతో కర్నూలు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేస్తామని దేవనకొండ ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు.

సహకార సంస్థల కమిటీల గడువు పొడిగింపు

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు (ఆప్కాబ్)తో సహా 13 డీసీసీబీలు, 13డీసీఎంఎస్‌ల ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీల పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీ కాలం ఈ నెల 18తో ముగియనున్న నేపథ్యంలో ఈ ఏడాది జూలై 17వరకు పొడిగించారు. అలాగే ఆప్కాబ్, డీసీఎంఎస్‌లకు గడువు ముగిసిన రోజు నుంచి 6 నెలలపాటు పొడిగింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. కృష్ణా, నెల్లూరు, ఏలూరు డీసీసీబీల కమిటీల్లో స్వల్ప మార్పులు చేసినట్లు సహకారశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు వేల పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల గడువు ఈ నెలాఖరుతో ముగియనున్నది.

చనిపోయిన మూడేళ్లకు ఆరోగ్యశ్రీ కార్డు

- సర్కారు నిర్వాకంపై విమర్శలు

బొమ్మనహాళ్, జనవరి 12: బతికుండగా వైద్యానికి ఉపయోగపడాల్సిన ఆరోగ్యశ్రీ కార్డు.. ఓ వ్యక్తి చనిపోయిన మూడేళ్లకు వచ్చింది. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్‌కు చెందిన బోలినేని జయప్రకాశ్ మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన పేరిట మంజూరైన ఆరోగ్యశ్రీ కార్డును అధికారులు మృతుడి తండ్రి మల్లప్పకు శుక్రవారం అప్పగించారు. చనిపోయిన తరువాత ఆరోగ్యశ్రీ కార్డు ఇస్తే ఎవరికి ఉపయోగమని మల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మనుషులు బతికున్నదీ లేనిదీ చూడకుండానే ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులు జారీ చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.



జయప్రకాశ్ పేరిట వచ్చిన ఆరోగ్యశ్రీ కార్డు చూపిస్తున్న మల్లప్ప

వేపచెట్టుపై రెండు కొండ చిలువలు

పాణ్యం, జనవరి 12: నంద్యాల జిల్లా పాణ్యంలో పొలాల్లోకి వెళ్లిన రైతులు అక్కడ కనిపించిన దృశ్యం చూసి బెంబేలెత్తారు. శుక్రవారం పాణ్యం అటవీ సమీపంలోని స్టీల్ ప్లాంట్ వద్ద పంట పొలాల్లోని వేపచెట్టుపై సుమారు 15 అడుగుల పొడవున్న రెండు కొండ చిలువలు వేలాడుతూ కనిపించాయి. వాటిని గుర్తించిన రైతులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న డీఆర్వో చంద్రహాసన్, రెస్క్యూ టీం సభ్యులు కొండ చిలువలను స్వాధీనం చేసుకుని పాణ్యం బీటులోని కంచన్‌బోడు కంపార్ట్‌మెంట్ 101లోని సురక్షిత అటవీ ప్రాంతంలో వదిలేశారు.



పాణ్యంలో చెట్టుపై ఉన్న కొండచిలువలు

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు ఊరట

- ఎస్టీ కుల ధ్రువపత్రం రద్దు జీవో నిలిపివేత..
- ఎనిమిది వారాలు ఆపేయాలన్న హైకోర్టు
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం



అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీతకు హైకోర్టులో ఊరట లభించింది. ఆమె ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దుచేస్తూ ఈ నెల 4న రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో2 అమలును కోర్టు 8వారాల పాటు సస్పెండ్ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తన కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దుచేస్తూ జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ గీత హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా ఆమె తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. "సమగ్ర విచారణ తరువాతే కొత్తపల్లి గీతది ఎస్టీ కులమని నిర్ధారిస్తూ 2016లో జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్ ఇచ్చారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అదే ఏడాది ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం.. గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి వద్ద అప్పీల్ వేసింది. దీనిపై నిర్ణయం తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించింది. పిటిషనర్‌కు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకున్న తర్వాత ఉత్తర్వులు ఇవ్వాలని ముఖ్యకార్యదర్శిని ఆదేశిస్తూ గతేడాది డిసెంబర్‌లో హైకోర్టు ఆదేశించింది. వివరణ ఇచ్చేందుకు రెండువారాల గడువు ఉన్నప్పటికీ అప్పీల్‌పై ముఖ్యకార్యదర్శి నిర్ణయాన్ని వెల్లడించారు. ఇది కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమే" అని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, జీవో అమలును తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు.

రాజ్యాంగ హక్కులు కాలరాస్తోన్న కేంద్రం

- రాష్ట్రానికి బీజేపీ ద్రోహం చేసింది
- సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాల కన్నా స్వప్రయోజనాలే ముఖ్యం
- వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి రానీయొద్దు
- అందుకు పత్రికలు, పౌరసమాజం ఐక్యంగా పనిచేయాలి
- భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నిర్వహించిన మోదీ హఠావో-దేశ్ బచావో రాష్ట్ర సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు రాకేష్ తికాయత్, వేదికపైన చలసాని శ్రీనివాసరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, బీవీ రాఘవులు

మొగల్రాజపురం, జనవరి 12: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని, మౌలికసూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ప్రాథమిక హక్కులు, పత్రికాస్వేచ్ఛను హరిస్తోందని, న్యాయవ్యవస్థ పాత్రను నిర్లక్ష్యం చేస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మోదీ హఠావో-దేశ్ బచావో పేరుతో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో శుక్రవారం రాష్ట్రసదస్సు నిర్వహించారు. సదస్సులో వక్తలు మాట్లాడారు. కాగ్ సెంట్రల్ ఇన్‌ఫర్మేషన్ కమిషన్ వంటి స్వయం ప్రతిపత్తి సంస్థల పాత్రను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని అన్నారు. బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి తీసుకున్న లక్షల కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేయడం, మహిళలు, షెడ్యూల్‌కులాలు, దళితులు, మైనార్టీలపై దాడులను ప్రోత్సహించడం, రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలకు రాష్ట్రంలో వైసీపీ, జనసేన, టీడీపీ మద్దతు ఇస్తున్నాయని, రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని వక్తలు పేర్కొన్నారు. సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని, రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా నిరోధించడానికి పత్రిక, మీడియా, పౌర సమాజం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించడానికే ఇండియా కూటమి వచ్చిందన్నారు. మణిపూర్‌లో దారుణ మారణకాండ జరిగితే ప్రజలు మాట్లాడలేని దుస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలు, నిధుల కోసం పోరాటం చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, వారిపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని ఎత్తేయాలని తీర్మానం చేశారు. జనవరి 17 నుంచి 22వ తేదీ లోపు తిరుపతి, కర్నూలు, విశాఖ, రాజమండ్రిలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించాలని రాజ్యాంగ పరిరక్షణ హక్కుల వేదిక పిలుపునిచ్చింది. కార్యక్రమానికి వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షత వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు రాకేష్ తికాయత్, రాజ్యాంగ పరిరక్షణ హక్కుల వేదిక కన్వీనర్ కె.విజయరావు, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ నాయకుడు అజీజ్ పాషా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ఆల్ ఇండియా కిసాన్ జాతీయ అధ్యక్షుడు రావుల వెంకయ్య, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ, ఐటీయూసీ జాతీయ నాయకురాలు వహీదా నిజాం, ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కమిటీ నాయకుడు చలసాని శ్రీనివాసరావు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తదితరులు మాట్లాడారు.

ఆటోనగర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇక్కట్లు

- టెర్మినల్‌లో ద్విచక్రవాహనాల పార్కింగ్
- పూర్తి బస్టాండ్ అందుబాటులో ఉంచాలని కోరుతున్న ప్రయాణికులు

ఆటోనగర్(పెనమలూరు): నిత్యం వందలాది బస్సుల రాకపోకలతో రద్దీగా ఉండే ఆటోనగర్ బస్ టెర్మినల్ బస్టాండు వసతుల లేమితో క్రమేణా ప్రయాణికులకు దూరమవుతోంది. బస్టాండులో కనీస వసతులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వందలాది బైక్‌లు టెర్మినల్ లోనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో బస్టాండులో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. పార్సిల్ బుకింగ్‌కు వచ్చిన కస్టమర్ల వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో బస్టాండు నిండిపోయి వచ్చేపోయే వాహనాలకు తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారుల స్పందించి బస్టాండును పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటులో ఉంచాలని స్థానికుడు సుంకాని వెంకట త్రినాథ్, ప్రయాణికులు కోరుతున్నారు.



బైక్‌లతో నిండిన ఆటోనగర్ బస్టాండును

ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

కార్గో బుకింగు కోసం వచ్చే కస్టమర్ల వాహనాలు బస్టాండులోనే పార్కింగు చేయడంతో ఇబ్బందులు తలెత్తుత్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ప్రయాణికులకు కావాల్సిన మంచినీటి సౌకర్యం, వాష్‌రూంలను త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

-ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్

వైసీపీ నుంచి టీడీపీలోకి..



లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న దళిత నాయకుడు పేటేటి రాజమోహన్

చిట్టినగర్, జనవరి 12: పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైసీపీ దళిత నాయకుడు పేటేటి రాజమోహన్ శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆధ్వర్యంలో ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో లోకేశ్ వద్దకు వెళ్లి ఆయన పార్టీలో చేరారు. త్వరలో నాగుల్‌మీరా, తన ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో దళిత నాయకులు, యువత టీడీపీలో చేరతారని రాజమోహన్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

టీటీ జాతీయ పోటీలకు అర్షియా

విజయవాడస్పోర్ట్సు, జనవరి 12: ఇండోర్‌లో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ లెవెల్ టేబుల్ టెన్నిస్ అండర్-19 చాంపియన్‌షిప్‌కు నగరానికి చెందిన పి.అర్షియా ఎంపికైంది. అర్షియాను ఏపీటీటీఏ సెక్రటరీ పి.విశ్వనాథ్, ప్రెసిడెంట్ కేవీఎస్.ప్రకాష్, జిల్లా సెక్రటరీ కె.బలరామ్, జాయింట్ సెక్రటరీ బి.శ్రీనివాస్ అభినందించారు.

సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు రాష్ట్ర జట్ల పయనం

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 12: మధ్యప్రదేశ్‌లోని దేవస్‌లో ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే 20వ జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ సీనియర్ బాల, బాలికల టీమ్‌లు శుక్రవారం పయనమయ్యాయని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దారం దిలీప్‌కుమార్ తెలిపారు. పురుషుల విభాగంలో ఎం.సుధానవ్ రవినందన్, ఎం.హేమంత్‌కుమార్, ఎస్.విహీత్, బీఎంఎన్‌వీ కార్తీక్, ఎస్.ఆరోన్ రొనాల్డినో, వై.భానుప్రకాష్, బి.తేజ, మహిళలు ఎన్.అనూష, ఎం.భావన, పి.లావణ్య, ఏఎస్.వైశాలి, వైష్ణవి, జి.మేధోశ సాయి, ఎస్.విభావరి, సీహెచ్ అంజుప్రియ పాల్గొంటారని తెలిపారు.

23, 24 తేదీల్లో పారిశ్రామికవేత్తలకు

'ఐపీ యాత్ర'పై వర్క్‌షాప్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) నిర్వాహకులకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్)పై అవగాహన కల్పించేందుకు కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ చాంబర్స్) తెలిపింది. ఇండస్ట్రియల్ డిజైన్స్, కాపీరైట్స్, పేటెంట్స్, ట్రేడ్‌మార్క్, ట్రేడ్ సీక్రెట్స్, జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ) రిజిస్ట్రేషన్స్‌పై ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ అధికారులు, ఆయా రంగాల నిపుణులు సలహాలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించనున్నట్లు వివరించింది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఈల మేథోసంపత్తిని ప్రోత్సహించడంతోపాటు దేశ, విదేశాల్లో ఈ-ఫైలింగ్స్ సంఖ్యను పెంచడమే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ 'ఐపీ యాత్ర' పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. వర్క్‌షాపులో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తారని ప్రకటించింది.

స్వరాజ్యమైదానంలో

సీపీ భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ

విజయవాడ క్రైం, జనవరి 12: నగరంలోని స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ స్మృతివనాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19న ప్రారంభించనున్నందున భద్రతా ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ కాంతి రాణా శుక్రవారం పర్యవేక్షించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. పోలీసుశాఖతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సలహాలు సూచనలు తీసుకుని, సమన్వయంతో ఏర్పాట్లు చేస్తే ఇబ్బందులు తలెత్తవన్నారు. అతిథుల వాహనాల పార్కింగ్‌కు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణలో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సౌత్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, డీసీపీలు విశాల్ గున్ని, అజిత పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ సాధనలో

'గోళ్లమూడి' పోరాటాన్ని గుర్తించాలి

- ప్రభుత్వాన్ని కోరిన దళిత సంఘాల నేతలు

ధర్నాచౌక్, జనవరి 12: విజయవాడ స్వరాజ్య మైదానంలో ప్రారంభించబోతున్న అంబేడ్కర్ విగ్రహ సాధనకు గోళ్లమూడి రాజసుందరబాబు చేసిన పోరాటాన్ని గుర్తించి ఆయనను తగిన విధంగా సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు దళిత, గిరిజన, ప్రజా, ఉద్యోగ, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. 2014 నుంచి 2016 వరకు రాజసుందరబాబు నాయకత్వంలో చేసిన నిరంతర పోరాటం కారణంగానే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్థాపనపై 2016 మార్చి 19న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. తర్వాత 2017 ఏప్రిల్ 14న అమరావతిలో టీడీపీ ప్రభుత్వం విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందని తెలిపారు. 2020 అక్టోబరు 9న సీఎం జగన్ స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి జాతికి అంకితం చేయబోతున్నారన్నారు. చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలి యమ్స్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్ బాబు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు సాంబయ్య, బేతపూడి భారతి, దారా వెంకటరత్నం పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీల్లో రాష్ట్రానికి కాంస్యం

విజయవాడస్పోర్ట్సు, జనవరి 12: రాజస్థాన్‌లో నిర్వహిస్తున్న జాతీయ బాలుర హ్యాండ్‌బాల్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు కాంస్యంతో సరిపెట్టుకుంది. శుక్రవారం హర్యానాతో సెమీస్‌లో ఏపీ టీమ్ పరాజయం పాలైందని, 3,4 స్థానాల కోసం యూపీ తో మ్యాచ్‌లో ఏపీ జట్టుగెలిచి కాంస్యం వశం చేసుకుందని ఏపీ హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పెన్మత్స సత్యనారాయణరాజు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి

రూ.2,15,000 విరాళం

భారతీనగర్, జనవరి 12: గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో 1971-74, 1979-82 సంవత్సరాలలో చదువుకున్న 20మంది విద్యార్థులు కళాశాల ఎలక్ట్రికల్ లాబొరేటరీలో ఫ్లోరింగు, రంగులు వేయడం, తలుపులు, కిటికీల మరమ్మతులకు 2,15,000 రూపాయలను శుక్రవారం విరాళంగా ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి భీమానాయక్, లెక్చరర్లు, అల్యూమినో అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వి.బాబు, సెక్రటరీ గోపిచంద్, ట్రెజరరీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. విజయవాడకు చెందిన దాసరి జ్యోతి మహి(15), సతీష్ మరో ఇద్దరు కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వెళ్లారు. దర్శనం ముగించుకుని జీఎన్‌సీ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తుండగా తిరుమలలో వ్యాపారం చేసే ఓ వ్యక్తి బైక్‌లో తిరుపతికి వెళుతుంటే లిఫ్ట్ అడిగారు. జ్యోతి మహి, సతీష్‌ను ఎక్కించుకుని వెళుతుండగా 16వ మలుపు వద్ద అదుపు తప్పి బైక్ కిందపడిపోయింది. వెనుక కూర్చున్న జ్యోతి తల రోడ్డుకు తగిలి తీవ్ర గాయాలపాలైంది. వెంటనే తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

టాలెంట్ స్ప్రింట్ మహిళా ఇంజినీర్స్ ప్రారంభం

కృష్ణలంక, జనవరి 12: మహిళా ఇంజినీర్స్ (డబ్ల్యూఈ) ప్రోగ్రాం ఆరో ఎడిషన్‌ను తమ సంస్థ ప్రారంభించిందని, దేశవ్యాప్తంగా మొదటి ఏడాది మహిళా ఇంజినీరింగ్ విద్యార్థులకు 200 సీట్లను అందిస్తోందని ఈ ప్రోగ్రాంలో చేరే విద్యార్థులకు వందశాతం స్కాలర్‌షిప్ ఉందని టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈవో, ఎండీ డాక్టర్ శాంతనుపాల్ తెలిపారు. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ జనవరి 18 అని ఆయన తెలిపారు. మరింత సమాచారానికి 'టాలెంట్‌స్ప్రింట్.కామ్'ను సందర్శించాలని, మరిన్ని వివరాలకు 9963980259/9959154371 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆంధ్రా కబడ్డీ సంఘంపై కేసు కొట్టివేత

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 12: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్(రిజిస్టర్ 115/2010) అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరెడ్డి, యలమంచిలి శ్రీకాంత్‌పై పలువురు వేసిన కేసును సుప్రీం కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ సంఘంపై నిర్వహించిన ఎన్నికలపై స్టే కోరుతూ కబడ్డీ క్రీడాకారులు కోర్టును ఈనెల 9న ఆశ్రయించారని, పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం దీన్ని అనర్హమైందిగా ప్రకటిస్తూ కేసును డిస్మిస్ చేసిందని శ్రీకాంత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టును వారు ఆరునెలలు క్రితం ఆశ్రయించగా పిటిషనర్ల తరపు వాదనల్లో స్పష్టత లేదని హైకోర్టు ఈకేసును ఈనెల 5న కొట్టివేసింది.

కానిస్టేబుల్ తులసీచైతన్యకు అభినందన



పోలీస్ స్విమ్మర్ తులసీచైతన్యను అభినందిస్తున్న సీపీ కాంతిరాణా

విజయవాడ క్రైం, జనవరి 12: మూడు జలసంధులైన ట్రిపుల్ క్రోన్‌ను ఈదిన మొట్టమొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డును సాధించడమే కాకుండా టెన్సింగ్ నార్కే నేషనల్ అవార్డును అందుకున్న కానిస్టేబుల్ మోతుకూరి తులసీచైతన్యను పోలీస్ కమిషనర్ కాంతిరాణా అభినందించారు. ఈనెల 9న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ దర్బార్‌హాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి టెన్సింగ్ నార్కే నేషనల్ అవార్డును అందుకున్న తులసీ చైతన్య శుక్ర వారం సీపీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తులసీ చైతన్య మరిన్ని విజయాలు చేరుకోవాలని సీపీ ఆకాంక్షించారు.

క్రైం ఏడీసీపీగా కృష్ణమూర్తి నాయుడు

విజయవాడ క్రైం, జనవరి 12: రాజమండ్రి సీఐడీ విభాగంలో ఏసీపీగా పనిచేస్తున్న ఎం.కృష్ణమూర్తినాయుడు పదోన్నతిపై విజయవాడ క్రైం ఏడీసీపీగా బదిలీపై వచ్చారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీపీ కాంతి రాణాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. నగరంలో క్రైం రేటు తగ్గించేందుకు అందు బాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. పాత నేరస్థుల కదలికలపై డేగకన్ను వేసి ఉంచాలని, నగరంలో సైబర్ నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించరాదని సూచించారు.

ఏసీఏ ఉమెన్ ఫీల్డింగ్ కోచ్‌గా రామ్‌కుమార్



రామ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందిస్తున్న త్రినాథ్‌రాజు, శంకర్

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 12: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-23 ఉమెన్ వన్డే టీమ్ ఫీల్డింగ్ కోచ్‌గా 2024 సంవత్సరానికి కేడీ సీఏ కోచ్ ఎస్.రామ్‌కుమార్ (గాంధీ) నియమితులయ్యారు. కేడీసీఏ అడ హక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు, కన్వీనర్ ఎం.రవి శంకర్ నుంచి ఉత్తర్వులను శుక్రవారం రామ్‌కుమార్ అందుకున్నారు. బీసీసీఐ ఉమెన్ వన్డే మ్యాచ్‌లు ఈనెల 26 నుంచి కోల్‌కతాలో జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లకు బరిలో దిగే ఏపీ టీమ్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా కోల్‌కతాలోనే వారికి సేవలను అందించనున్నారు.

చిత్రకారుడు జగన్మోహనరావుకు లెజెండరీ అవార్డు

విద్యాధరపురం, జనవరి 12: కోల్‌కతాకు చెందిన డ్రీమ్ పెయింట్ బ్రష్ సంస్థ ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీలో గిరిజన గీతశిల్పిగా పేరుపొందిన భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన బొండా జగన్మోహనరావుకు లెజెండరీ అవార్డు దక్కింది. ఆయన గీసిన చిత్రాలతో ముద్రించిన టేబుల్ క్యాలెండర్, శాలువను పోస్టుద్వారా అందించారు.



అవార్డును చూపుతున్న చిత్రకారుడు బొండా జగన్మోహనరావు

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



మంత్రి రోజాకు జ్ఞాపిక అందిస్తున్న యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న

వన్‌టౌన్, జనవరి 12: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని మంత్రి ఆర్కే రోజా సూచించారు. జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఏడాది థీమ్ యూత్ ఫర్ డిజిటల్ ఇండియాను అమలు చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో విజేతలను ఈ నెల 12 నుంచి 16వతేదీ వరకు నాసిక్‌లో జరిగే జాతీయ యువజనోత్సవాలకు పంపుతామన్నారు. యువజనశాఖ ఆధ్వర్యంలో మంత్రి రోజాను సత్కరించారు. ఈ ఏడాది రాష్ట్రం సాధించిన లార్జెస్ట్ యూత్ ఐకాన్ ఫెస్టివల్ అవార్డును మంత్రికి అందజేశారు. చెస్‌మాస్టర్ లలిత్‌బాబును సత్కరించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, రామకృష్ణ మిషన్‌కు చెందిన తాతా మహరాజ్, యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి, డిప్యూటీ మేయర్ శైలజారెడ్డి మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ షేక్ ఆసిఫ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ మహేష్ పాల్గొన్నారు.

మా ఊళ్లోకి రావద్దు... జెండా ఎగరేయద్దు

» వైసీపీ నేతలను అడ్డుకున్న పొనుగుటివలస గ్రామస్థులు



వైసీపీ నాయకులను నిలదీస్తున్న యువత

రాజాం రూరల్, జనవరి 12: వైసీపీ నిర్వహిస్తున్న 'జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామస్థులు అడ్డుకున్నారు. పార్టీ కోసం, ఎమ్మెల్యే గెలుపు కోసం కష్టపడి పనిచేసిన తమకు, తమ గ్రామానికి ఏం మిగిలిందంటూ నేతలను నిలదీశారు. గ్రామానికి మంజూరయిన పింఛన్లు రద్దు చేశారని, రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్పీలు నిధులు స్వాహా చేస్తే డ్వాక్రా మహిళలు రూ.లక్షల్లో నష్టపోయారని, ఏ ఒక్కరూ వచ్చి సాయం చేయలేదని మండిపడ్డారు. వైసీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్‌తో పాటు రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు వారికి నచ్చచెప్పడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 'మరో మూడు నెలల్లో ప్రభుత్వమే పోతుంది. ఇంకెప్పుడు చేస్తారు? ఏం చేస్తారు? గ్రామంలో జెండా ఎగురవేస్తే ఊరుకునేది లేదు. సమావేశం పెట్టడానికి కుదరదు, మా గ్రామం నుంచి వెళ్లిపోండి' అంటూ ఆగ్రహం ప్రదర్శించారు. జెండా కర్రను పీకేసి పక్కన పడేశారు. కొద్దిసేపు వేచి చూసిన నేతలు చేసేదేం లేక వెళ్లిపోయారు.

జగన్‌తో రాష్ట్రానికి తీరని అన్యాయం: కాంగ్రెస్



అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆక్షేపించింది. శుక్రవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రత్యేక హోదా, ప్రత్యేక రైల్వే జోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చర్యలు నిలుపుదల, కడపకు స్టీల్‌ప్లాంట్, పారిశ్రామికీకరణ, వెనుకబడ్డ జిల్లాకు ప్రత్యేక నిధులు రప్పించడంలో జగన్ విఫలయ్యారు. ఆయన వైఫల్యాలు రాష్ట్ర ప్రజలకు శాపంగా పరిణమించాయి. జగన్ పాలనా వైఫల్యాలతో ఉద్యోగులు, కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మునిసిపల్ కార్మికులు, పాధ్యాయులు, ప్రభుత్వోద్యోగులు ఆందోళన బాట పట్టారు' అని గిడుగు అన్నారు.

వైసీపీకి కాలం చెల్లింది

» వందల ఎకరాలను కబ్జా చేసిన పెద్దిరెడ్డి, గడికోట: సత్యకుమార్



రైల్వేకోడూరు, జనవరి 12: అరాచక పాలన సాగించిన వైసీపీకి కాలం చెల్లిందని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... 'ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో వైసీపీ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేసింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వందలాది ఎకరాలను కబ్జా చేశారు. తిరుపతిలోని స్విమ్స్‌కు సంబంధించి ఏజెన్సీల ద్వారా వైవీ సుబ్బారెడ్డి కుమారుడికి నెలకు రూ.50 లక్షలకు పైగా వాటాలు అందుతున్నాయి. శిల్పారామంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమార్తె నెలకు రూ.12 లక్షలు ఆదాయాన్ని పొందుతున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శేషాచల అడవులను దోచుకుని తింటున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు గమనించాలి. డీకేటీ భూములను వైసీపీ నేతలు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. రానున్న రోజుల్లో జగన్ మాజీ ముఖ్యమంత్రిగా మిగిలిపోతారు' అని సత్యకుమార్ అన్నారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శులు కోలా ఆనంద్, నాగోతు రమేశ్ నాయుడు, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ తదితరులు ప్రసంగించారు.

కృష్ణా ట్రైబ్యునల్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల కోసం కేంద్రం తెచ్చిన కృష్ణా ట్రైబ్యునల్-2 టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీవోఆర్) అంశంపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలు వాయిదా వేసింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై కృష్ణా ట్రైబ్యునల్ విచారణ కొనసాగించాలని కేంద్రం గతేడాది గజిట్ తెచ్చిన విషయం తెలిసిందే. ఈ గజిట్‌లోని కృష్ణా ట్రైబ్యునల్-2 టీవోఆర్ అంశాన్ని ఏపీ ప్రభుత్వం వ్యతిరేకిస్తూ స్టే విధించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. శుక్రవారం, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఏపీ సర్కారు పిటిషన్‌లో ప్రతివాదులుగా ఉన్న కేంద్రం, తెలంగాణకు కోర్టు గతంలో నోటీసులు జారీ చేసిన దృష్ట్యా కేంద్ర జలశక్తి శాఖ కౌంటర్ దాఖలు చేసింది. ఈ కౌంటర్‌కు రిజైండర్ దాఖలు చేసేందుకు తమకు సమయం కావాలని ఏపీ ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టును కోరారు.

75వ రిపబ్లిక్ డేకు విస్తృత ఏర్పాట్లు: సీఎస్

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 26న జరిగే 75వ భారత గణతంత్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయంలో గణతంత్ర వేడుక ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. గణతంత్ర వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ జాతీయ జెండాను ఆవిష్కరించనుండగా, సీఎం జగన్మోహన్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొనున్న దృష్ట్యా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే, విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 19న చేయాల్సిన ఏర్పాట్లు, మున్సిపల్ స్టేడియంలో బహిరంగ సభ ఏర్పాట్లపై సీఎస్ అధికారులతో సమీక్షించారు.

చింతపల్లి అత్యాచారం దోషులను శిక్షించాలి: నరహరి

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): చింతపల్లి గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్ పాలనలో గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరమవ్వడమే కాకుండా వారికి రక్షణ కరువైందని విమర్శించారు.

కుల ధ్రువీకరణ పత్రాలపై సీఎం బొమ్మ తొలగించండి: వర్ల

అమరావతి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుల ధ్రువీకరణ పత్రాలపై సీఎం జగన్ బొమ్మ ముద్రించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య లేఖ రాశారు. రాష్ట్రంలో కుల ధ్రువీకరణ పత్రాలపై రెవెన్యూ అధికారులు ముఖ్యమంత్రి జగన్ బొమ్మ ముద్రిస్తున్నారని, ఇది ఎన్నికల సంఘం తలపెట్టిన నిష్పాక్షిక ఎన్నికలకు గండి కొట్టడమేనన్నారు. రాజకీయ లబ్ధి కోసమే సీఎం బొమ్మను ముద్రిస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనంతో రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూడటం ప్రజాస్వామ్య విలువలకు ప్రమాదకరమన్నారు. కాగా, భూమి పత్రాలు, పాస్ పుస్తకాలపై సీఎం బొమ్మ ముద్రించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు టికెట్లపై ఇప్పటికే 55% రాయితీ: అశ్వనీవైష్ణవ్

అహ్మదాబాద్, జనవరి 12: రైలు టికెట్‌పై ప్రతి ప్రయాణికుడికి ఇప్పటికే 55 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొవిడ్‌కు ముందు విలేకరులకు, సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన రాయితీ పునరుద్ధరణపై మీడియా అడిగిన ప్రశ్నలకు "రైలు టికెట్ ధర రూ.100 అయితే రైల్వే రూ.45 మాత్రమే వసూలు చేస్తోంది. ఇప్పటికే 55% రాయితీ కల్పిస్తున్నాం" అని మంత్రి సమాధానమిచ్చారు. గతంలో సీనియర్ సిటిజన్లు, విలేకరులకు రైలు టికెట్లపై 50% రాయితీ ఉండేది. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఆ రాయితీ ఎత్తివేశారు. లాక్‌డౌన్ అనంతరం రాయితీని పునరుద్ధరించాలని పార్లమెంట్ ఉభయసభలు సహా పలుచోట్ల డిమాండ్లు వచ్చాయి. అయినా పునరుద్ధరించ లేదు. కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరానికి దాదాపు 15 కోట్ల మంది సీనియర్ సిటిజన్ల ద్వారా రైల్వేకు రూ.2,242 కోట్ల ఆదాయం చేకూరింది.

సాములోరి భూమాయ!

నచ్చినట్టు చేసుకుంటాం...జీవో మార్చండి



కొండపైకి వెళ్లేందుకు వీఎంఆర్‌డీఏ నిర్మించిన రహదారి

» జగన్ సర్కారుకు శారదాపీఠం లేఖ
» సంస్కృత పాఠశాల,వేద విద్య కోసం భూమి
» భీమిలి వద్ద నాడు 15ఎకరాలు కేటాయింపు
» ఇప్పుడు మాట మార్చిన విశాఖ పీఠం
» మార్కెట్ విలువ ఇచ్చామని లేఖలో వెల్లడి
» కానీ అప్పటి రేటు 1.89కోట్లు.. ఇచ్చింది 15 లక్షలే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో శారదా పీఠాధిపతి భీమిలి భూములపై బుకాయిస్తున్నారు. మార్కెట్ రేటు చెల్లించి తీసుకున్నందున వాటిని నచ్చినట్టు ఉపయోగించుకోవడానికి వీలుగా జీవో మార్చి ఇవ్వాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇది అమరావతిలో రెవెన్యూ వర్గాల్లో చర్చకు దారితీసింది. శారదా పీఠం కార్యకలాపాలు విస్తరించడానికి, సంస్కృత పాఠశాల ఏర్పాటుకు, వేద విద్య బోధనకు అవసరమైన భూమి కావాలని పీఠాధిపతి గతంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భీమిలిలో సాగర తీరాన అయితే ప్రశాంతంగా ఉంటుందని, అక్కడే ఇవ్వాలని ప్రభుత్వ పెద్దలకు తన మనసులో మాట చెప్పారు. ఈ మేరకు భీమిలి మండలం కొత్తవలస కొండపై సర్వే నంబర్లు 102/2లో 7.7 ఎకరాలు, 103/2లో 7.3 ఎకరాలు కలిపి మొత్తం 15 ఎకరాలు కేటాయించారు. అక్కడ ప్రస్తుతం భూమి విలువ ఎకరా రూ.15 కోట్లు ఉంది. ఆ లెక్కన మొత్తం భూమి విలువ రూ.225 కోట్లు. ఈ కొండ పక్క నుంచే విశాఖపట్నం-భోగాపురం కోస్టల్ కారిడార్ వెళుతోంది. దాంతో దాని విలువ మరింత పెరిగింది. ఈ భూమిని కేటాయిస్తున్నప్పుడు ధర నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం విశాఖ జిల్లా కలెక్టర్‌ను కోరితే..ఎకరా రూ.1.89 కోట్లు చొప్పున ఇవ్వవచ్చునని సిఫారసు చేశారు. అంటే పదిహేను ఎకరాలకు సుమారుగా రూ.30 కోట్లు రేటు నిర్ణయించారు. కానీ పీఠాధిపతి.. సీఎం జగన్‌కు సన్నిహితులు కావడంతో ఎకరా కేవలం రూ.లక్షకే ఇచ్చేశారు.

కొండపైకి రహదారి

కొండపై భూమి కేటాయించినందున అక్కడికి వెళ్లడానికి మార్గం లేదని, రహదారి వేయాలని ప్రభుత్వాన్ని శారదా పీఠాధిపతి కోరారు. అప్పటికే తక్కువ ధరకు భూమి ఇచ్చారని విమర్శలు రావడం, మళ్లీ రహదారి వేయిస్తే ఇబ్బందులని జిల్లా అధికారుల ద్వారా విశాఖ మహా నగర ప్రాంతం అభివృద్ధి సంస్థను(వీఎంఆర్‌డీఏ) రంగంలోకి దించారు. ఆ సంస్థకు అదే కొత్తవలస కొండపై సర్వే నంబరు 105లో 50 ఎకరాలు కేటాయించారు. దానిని లేఅవుట్‌గా అభివృద్ధి చేసి ప్లాట్లుగా విక్రయించాలని పురమాయించారు. ఇవన్నీ జరగాలంటే ముందు కొండపైకి రహదారి నిర్మించాలని రూ.1.75 కోట్ల వ్యయంతో 1.2 కిలోమీటర్ల పొడవైన దారిని ఆగమేఘాలపై కొండను తవ్వి, ర్యాంపులు వేసి మరీ నిర్మించారు. ఇది జరిగి ఆరు నెలలు దాటింది. ఇప్పటివరకు లేఅవుట్ లేదు. ప్లాట్లు లేవు. పీఠానికి అవసరమైన రోడ్డు నిర్మాణం పూర్తయిపోవడంతో తదుపరి కార్యాచరణకు పీఠం ఉపక్రమించింది.

జీవో మార్చాలని డిమాండ్

శారదా పీఠం దేశంలో 60కి పైగా కేంద్రాల్లో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్నదని, వాటిన్నింటిని నిరాటంకంగా కొనసాగించడానికి అవసరమైన నిధుల కోసం భీమిలి భూములను ఉపయోగించుకోవాలనుకుంటున్నామని, కాబట్టి దానిని నచ్చినట్టు ఉపయోగించుకునేలా జీవో మార్చి ఇవ్వాలని పీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

లేఖలో ఏమి రాశారంటే..?

"భీమిలిలో భూమిని కేటాయించిన ఉత్తర్వులో సంస్కృత పాఠశాల ఏర్పాటు, వేద విద్యా బోధన కోసమని పేర్కొన్నారు. కానీ మా ఉద్దేశం అది కాదు. పొరపాటున జీవోలో అలా రాశారు. అది తీసేసి కొత్త జీవో ఇవ్వండి. మార్కెట్ రేటు రూ.15 లక్షలు చెల్లించి తీసుకున్నందున పీఠం నిర్వహణకు అన్ని రకాలుగా ఉపయోగించుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలి" అని ఆ లేఖలో శారదా పీఠం పేర్కొంది. దీని అర్థం ఏమిటో మరి! ప్రభుత్వం కూడా ఆ దిశగా ఆగమేఘాలపై ఉత్తర్వులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది. మళ్లీ ఎన్నికల ప్రకటన వస్తే ఇలాంటివి చేయడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈలోగానే ఆ కార్యక్రమం మమ అనిపించేయడానికి ఇరువర్గాలు ప్రయత్నిస్తున్నాయి.

అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌కు చర్యలు

» పొడిగించిన మూడు రైళ్లు
గుంటూరులో ప్రారంభించిన కిషన్ రెడ్డి

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన రైల్వే నెట్‌వర్క్ ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని, దీనిని అగ్రస్థానానికి తీసుకెళ్లే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం రోజుకు 16 కిలోమీటర్ల నూతన రైలుమార్గం దేశంలో నిర్మాణం జరుగుతోందని, దీనిని మరింత పెంచే దిశగా చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. పొడిగించిన మూడు రైళ్లను ఆయన శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. విశాఖపట్టణం- విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు, హుబ్లీ-విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్ నరసాపూర్ వరకు, నంద్యాల-కడప రైలు రేణిగుంటవరకు పొడిగించారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, ప్రధాని మోదీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు

తిరుమల ఘాట్‌లో డ్రోన్ కలకలం

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా హర్యానాకు చెందిన దినేష్ అనే భక్తుడు డ్రోన్ కెమెరాతో తిరుమలకు రావడమే కాకుండా శుక్రవారం మొదటి ఘాట్‌రోడ్డులో డ్రోన్‌తో వీడియో తీయడం కలకలం సృష్టించింది. మీడియా ద్వారా సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు అతన్ని అలిపిరిలో అదుపులోకి తీసుకుని తిరుమల పోలీసులకు అప్పగించారు. కాగా, దినేష్ ఆర్మీలో ఎస్పీ స్థాయి అధికారి కావడంతో వివరణ తీసుకుంటున్నారు. తనకు నిబంధనలు తెలియకపోవడతోనే డ్రోన్‌ను వినియోగించినట్టు దినేష్ చెప్పినట్టు తెలిసింది. అయితే ఆ డ్రోన్‌తో తిరుమలలో కూడా ఏమైనా వీడియోలు తీశాడా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కొద్ది నెలల క్రితం ఆలయంపై ఓ డ్రోన్ వెళ్లిన ఘటన కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో మరోసారి టీటీడీ విమర్శలపాలయ్యింది. భద్రతా కారణాలతో పాటు ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం డ్రోన్‌ను ఎగరవేయడాన్ని టీటీడీ కొన్నేళ్ల క్రితమే నిషేధించింది.

కనుగోలు వ్యూహం రాష్ట్రాలకే!

లోక్‌సభ ఎన్నికలకు సునీల్ దూరం?.. సుదీర్ఘ లక్ష్యంతో కాంగ్రెస్ అడుగులు



దక్షిణాదిలోని రెండు ముఖ్య రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ పార్టీని గెలుపు బాటపట్టించిన ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు కేవలం రాష్ట్రాలకే పరిమితం కానున్నారా? లోక్‌సభ ఎన్నికల వ్యూహానికి ఆయన దూరం కానున్నారా? అంటే ఔననే అంటున్నారు జాతీయ రాజకీయ విశ్లేషకులు. మొదట్లో కాంగ్రెస్ పార్టీకి వ్యూహకర్తగా ఉన్న ప్రశాంత్ కిశోర్ 2022 తర్వాత కాంగ్రెస్‌ను వీడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సునీల్ కనుగోలు కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు చేపట్టి.. కీలకమైన కర్ణాటకలో కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కృషి చేశారు. తర్వాత తెలంగాణలోనూ తన వ్యూహాలతో పార్టీని అధికారంలోకి తెచ్చారు. ఇక, ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లోనూ ఆయన సేవలు పార్టీకి అత్యంత అవసరం అని భావిస్తున్నప్పటికీ.. రాష్ట్రాల్లో బలోపేతం కావాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ లక్ష్యం మేరకు ఆయన ఆ బాధ్యతలకే పరిమితం కానున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఈ ఏడాది జరగనున్న హరియాణ, మహారాష్ట్ర ఎన్నికల్లో ఆయన పార్టీకి సేవలందిస్తారని సునీల్ వర్గం పేర్కొంది. ప్రశాంత్ కిశోర్ తర్వాత దేశంలో సునీల్ కనుగోలుకు మంచి వ్యూహకర్తగా పేరుంది. రెండేళ్ల కిందట ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత సునీల్ కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్తగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన బృందం హరియాణ, మహారాష్ట్ర ఎన్నికలపై దృష్టి పెట్టింది. "లోక్‌సభ వ్యూహాలకు సునీల్ దూరం కావడం ఒకింత ఇబ్బందే. అయితే, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గెలవాలంటే.. ఆయన వాటిపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది" అని కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.


గత ఏడాది జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో కాంగ్రెస్ దారుణ ఓటమిని చవిచూసింది. దీనికి కారణం ఆయా రాష్ట్రాల్లోని ముఖ్య నాయకులు కమల్‌నాథ్, అశోక్ గెహ్లోత్ వంటివారు సునీల్ కనుగోలు డిమాండ్లకు అంగీకరించలేదనే వాదన ఉంది. దీంతో ఆయా రాష్ట్రాలకు కనుగోలు దూరంగా ఉన్నారు. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా దెబ్బతిందని అంటున్నారు. అదేసమయంలో కర్ణాటక, తెలంగాణల్లో సునీల్‌కు స్వేచ్ఛ ఇచ్చారని, దీంతో ఈ రెండు రాష్ట్రాల్లోనూ పార్టీ విజయం సాధించిందనే వాదన కూడా ఉంది. ఇదిలావుంటే, కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు సునీల్ కనుగోలు ప్రస్తుతం సలహాదారుగా ఉన్నారని, ఆయనకు కేబినెట్ ర్యాంకు కూడా కల్పించారని, ఆయన కొనసాగుతారని సునీల్ వర్గం తెలిపింది.

ఏపీ బాధ్యతలు అప్పగించాలని!

ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న ఆంధ్రప్రదేశ్(ఏపీ)లోనూ సునీల్ కనుగోలుకు బాధ్యతలు అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ భావించినట్టు తెలిసింది.నవాస్తవానికి ఏపీలో కాంగ్రెస్ ఉనికి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను రంగంలోకి దింపేందుకు సిద్ధమైంది. అయినప్పటికీ.. సునీల్ సేవలను ఇక్కడ వినియోగించుకోవాలని పార్టీ భావించింది. ఇక, బీజేపీకి పెద్దగా బలం లేని హరియాణలోనూ, గత ఏడాది కాలంగా రాజకీయ వివాదాలు కొనసాగుతున్న మహారాష్ట్రలోనూ ఈ ఏడాదే ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల్లోనూ కీలక పాత్ర పోషించాలని, దీనికి కనుగోలు సేవలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇక, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం సహా జార్ఖండ్‌లలోనూ ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు, ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి జమ్ము కశ్మీర్‌లోనూ త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకంగా మారాయి.

'తోపు' ధనదాహం

» అక్రమార్జన కోసం అడ్డదారులు
» జగనన్నలే అవుట్ కాంట్రాక్టర్‌కు బెదిరింపులు.. డబ్బుల డిమాండ్
» కప్పం కట్టలేమని చెప్పిన కాంట్రాక్టర్
» జగనన్నలే అవుట్ కార్మికుల నిర్బంధం
» మా కూలీల ఆచూకీ లేదు.. కాపాడండి...
» కలెక్టర్, ఎస్పీని వేడుకున్న కాంట్రాక్టర్
» కలెక్టర్, ఎస్పీకి లేఖ రాసిన పశ్చిమ బెంగాళ్ ఎంపీ



ఎమ్మెల్యే, కాంట్రాక్టర్ మధ్య ఫోన్ కాల్స్ జాబితా



అనంతపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలోని ఓ నియోజకవర్గ ఎమ్మెల్యే 'తోపు' ధన దాహానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమార్జన కోసం ఆయన పదే పదే అడ్డదారులు తొక్కుతున్నారు. కాసులే పరమావధిగా దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. ఆయన ఆగడాలపై పశ్చిమ బెంగాళ్‌కు చెందిన ఓ ఎంపీ అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీకి లేఖ రాశారు. అనంతపురం రూరల్ మండలం కొడిమి వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును పశ్చిమ బెంగాళ్‌కు చెందిన సర్వర్ జహాన్ పొందాడు. ప్రస్తుతం కాంట్రాక్టర్ తన ప్రాంతానికి చెందిన కూలీలతో ఇళ్ల నిర్మాణాల పనులు చేయిస్తున్నాడు. ఇళ్ల నిర్మాణాలు పలు దశల్లో ఉన్నాయి. ఆ కాంట్రాక్టర్‌ను స్థానిక ఎమ్మెల్యే (తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి), ఆయన వర్గీయులు డబ్బులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ డబ్బులు అప్పనంగా చెల్లించేందుకు నిరాకరించారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానిక పోలీసులు పశ్చిమ బెంగాళ్‌కు చెందిన 11 మంది కూలీలను అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. దీనిపై బాధిత కాంట్రాక్టరు అనంతపురం జిల్లా ఎస్పీకి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎంపీ ఏహెచ్ ఖాన్ చౌదరి అనంతపురం జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. జగనన్న లే అవుట్ కాంట్రాక్టర్‌కు స్థానిక ఎమ్మెల్యే పలుమార్లు ఫోన్ చేశారు. డబ్బులు డిమాండ్ చేసేందుకే ఇలా చేశాడని సమాచారం.

కార్మికులను విడిపించండి...
ఎస్పీకి కాంట్రాక్టర్ సర్వర్ జహాన్ వినతి

తమ కార్మికులను విడిపించాలని అనంతపురం జిల్లా ఎస్పీకి కాంట్రాక్టర్ సర్వర్ జహాన్ వాట్సాప్ మెసేజ్ పంపించారు. 'నేను కొడిమి వైఎస్సార్ జగనన్న కాలనీలో కాంట్రాక్టరుగా పనిచేస్తున్నాను. స్థానిక ఎమ్మెల్యే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి. ఎమ్మెల్యే నా నుంచి అక్రమంగా డబ్బులు డిమాండ్ చేశారు. నేను ఆ డబ్బులు చెల్లించేందుకు నిరాకరించాను. దీంతో స్థానిక ఎమ్మెల్యేతో కలిసి అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్‌లోని కొందరు పోలీసులు నా వద్ద పనిచేసే 11 మంది కూలీలను నిర్బంధించారు. ఇది చట్ట విరుద్ధం. స్థానిక ఎమ్మెల్యే డిమాండ్ చేసిన మేరకు డబ్బులు చెల్లించాలని, ఆ తర్వాతనే కూలీలను వదిలిపెడతామని పోలీసులు అంటున్నారు. ఈ విషయంలో చట్టానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నాను. నా కార్మికులను విడిపించాలని కోరుతున్నాను' అని కాంట్రాక్టర్ ఎస్పీకి వాట్సాప్ మెసేజ్ పంపించారు.

వారిని విడిపించండి: కలెక్టర్‌కు పశ్చిమ బెంగాళ్ ఎంపీ లేఖ

'మా పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు, కొడిమి జగనన్న లే అవుట్ ఇళ్ల నిర్మాణ కూలీలను అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. పోలీసులు నిర్బంధించిన వారిలో అనరుల్ మోమిన్, ఆసిఫ్, అనిల్‌కూల్ మోమిన్, అక్తర్ మోమిన్, సోహిమ్ మోమిన్, రబూల్, మోతీ, కమల్ ఉన్నారు. వీరంతా నా ప్రాంతానికి చెందిన వారు. కొడిమి వైఎస్ఆర్ జగనన్న కాలనీలో పనిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు అక్రమంగా డబ్బులు చెల్లించాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చినట్లు నా దృష్టికి వచ్చింది. కాంట్రాక్టర్ డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకోనందున కార్మికులను నిర్బంధించారు. దీంతో కార్మికుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. మీరు దయతో కార్మికులను విడుదల చేయించి, వారికి రక్షణ కల్పించాలని విన్నవిస్తున్నాను' అని ఆ ప్రాంత ఎంపీ ఏహెచ్ ఖాన్ చౌదరి అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీకి లేఖ రాశారు.

కూలిన ఎనిమిదేళ్లకు తెలిసిన ఆచూకీ

» వీడిన వాయుసేన విమానం మిస్టరీ
» బంగాళాఖాతంలో శకలాల గుర్తింపు

న్యూఢిల్లీ, జనవరి 12: బంగాళాఖాతంపై ఎనిమిదేళ్ల క్రితం అదృశ్యమైన భారత వాయు సేన విమానం మిస్టరీ ఎట్టకేలకు వీడనుంది. సముద్రంలో అది కూలిపోయినట్టు భావించినా ఇంతవరకు నిర్ధారణ జరగలేదు. తాజాగా చెన్నైకు 310 కి.మీ.దూరంలో సముద్రం అడుగుభాగంలో 3,400 అడుగుల లోతున ఆ విమానం శకాలాలను గుర్తించడంతో అది ఏమయిందన్నదానిపై సందేహాలు తొలగినట్టయింది. భారత వాయుసేన పరిధిలోని ఎఎన్-32 రవాణా విమానం (కె-2743) 2016 జులై 22న చెన్నైలోని తాంబరం ఎయిర్ బేస్ నుంచి ఉదయం 8.30 గంటలకు 29మందితో అండమాన్‌లోని పోర్ట్‌బ్లెయిర్ బయలుదేరింది. ఆరోజు ఉదయం 11.45 గంటలకు విమానం పోర్టుబ్లెయిర్ చేరాల్సిఉండగా 9.12 గంటల తరువాత నుంచి రాడార్‌కు ఎలాంటి సంకేతాలు రాలేదు. చెన్నైకు 280 కి.మీ. దూరంలో 23వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్నప్పుడు గ్రౌండ్ స్టేషన్‌తో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. ప్రతికూల వాతావరణం వల్ల ప్రమాదానికి గురయినట్టు భావించినా, కచ్చితంగా ఏమి జరిగిందన్నది తెలియరాలేదు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ సంస్థ అటానమస్ యుటిలిటీ వెహికల్ (ఏయూవీ)ని రూపొందించింది. అది సముద్రం లోతుల్లోకి వెళ్లి.. మల్టీ బీమ్ సోనార్ టెక్నాలజీ, హైరిజల్యూషన్ ఫొటోగ్రఫీ సాయంతో ఆ విమాన శిథిలాలను గుర్తించింది.

ఆకాశ్-ఎన్‌జీ క్షిపణి పరీక్ష విజయవంతం



అల్వాల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తతరం ఆకాశ్-ఎన్‌జీ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ అధునాతన మిసైల్‌ను డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఒడిసా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి శుక్రవారం ఉదయం 10:30 గంటలకు పరీక్షించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే ఈ న్యూ జనరేషన్ (ఎన్‌జీ) ఆకాశ్ క్షిపణి 80 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదని, ఈ పరీక్ష సందర్భంగా తక్కువ ఎత్తులో అత్యంత వేగంగా ప్రయాణిస్తున్న మానవ రహిత విమానాన్ని ఇది ధ్వంసం చేసిందని పేర్కొంది. "పరీక్ష సమయంలో ఆకాశ్-ఎన్‌జీ మిసైల్ లక్ష్యాన్ని విజయవంతంగా అడ్డుకుని పేల్చివేసింది" అని తెలిపింది.

వైసీపీ కార్యక్రమాలకు మాగుంట, బాలినేని డుమ్మా

» వారి అనుచరులు సైతం గైర్హాజరు
» వెలవెలబోయిన మంత్రుల పరిచయ కార్యక్రమాలు
» మాగుంట పేరే ఎత్తని నేతలు
» అభిమానులతో ఎంపీ మంతనాలు
» మహీధర్‌రెడ్డికి జగన్ మొండిచేయి

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి)



ఒంగోలులో నిర్వహించిన సంతనూతలపాడు సమావేశం వెలవెల

ప్రకాశం జిల్లాలో వైసీపీ కార్యక్రమాలకు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దూరంగా ఉంటున్నారు. కొండపి, సంతనూతలపాడు ఇన్‌చార్జులుగా నియమితులైన ఇద్దరు మంత్రులు ఆదిమూలపు సురేశ్, మేరుగ నాగార్జునల పరిచయ కార్యక్రమాలకు గైర్హాజరయ్యారు. ఆ రెండు నియోజకవర్గాలకు చెందిన ఆ ఇద్దరు నాయకుల అనుచరులు సైతం దూరంగా ఉండిపోయారు. దీంతో విజయసాయిరెడ్డి సారథ్యంలో సదరు పరిచయ సమావేశాలు వెలవెలబోయాయి. దాదాపు నెల క్రితం ఆ ఇద్దరినీ ఇన్‌చార్జులుగా జగన్ ఖరారు చేశారు. అయితే వారికి స్థానికంగా పరిస్థితులు అనుకూలించకపోవడంతో తీవ్ర కసరత్తులు చేసి ఆ నియోజకవర్గాల్లో మంత్రుల పరిచయ కార్యక్రమాలను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఉదయం కొండపిలో, సాయంత్రం సంతనూతలపాడు సమావేశం ఒంగోలులో నిర్వహించారు. రెండు సమావేశాలకు విజయసాయిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండపి సమావేశానికి మాగుంట, బాలినేనితోపాటు నియోజకవర్గంలోని వారి అనుచరులెవరూ రాలేదు. సంతనూతలపాడు సమావేశానికి ఎమ్మెల్యే సుధాకర్‌బాబు కూడా గైర్హాజరయ్యారు. ఆయనపై క్రమశిక్షణ చర్య తీసుకుంటుందని విజయసాయిరెడ్డి ప్రకటించారు. సంతనూతలపాడు సమావేశంలో మాత్రం మంత్రి నాగార్జున.. బాలినేని శ్రీనివాసరెడ్డి మద్దతుతో గెలుస్తానంటూ మాట్లాడారు. రెండు సమావేశాల్లోనూ ఎంపీ మాగుంట పేరును నాయకులెవ్వరూ ప్రస్తావించలేదు. వైసీపీలో సీనియర్ నాయకుడైన చెంచిరెడ్డితోపాటు మరికొందరు నాయకులు కనిపించ లేదు. విజయసాయిరెడ్డి మాట్లాడే సమయానికి వందమంది కూడా లేకపోవడంతో సమావేశం హాలు వెలవెలబోయింది. కొండపి సమావేశం అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బాలినేని ఈ జిల్లాకు నాయకుడని వ్యాఖ్యానించారే తప్ప ఎంపీ మాగుంట పేరు ప్రస్తావించలేదు.

మహీధర్‌రెడ్డికి మొండిచేయి

ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డికి సీఎం జగన్ చెక్ పెట్టారు. వైసీపీ టికెట్ ఇవ్వాలంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను విమర్శించాలని సీఎం పెట్టిన షరతు ను మహీధర్‌రెడ్డి తిరస్కరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం తాడేపల్లికి కొండపి నియోజకవర్గానికి చెందిన బొట్ల రామారావు అనే వైసీపీ బీసీ విభా గం నాయకుడిని పిలిచి జగన్‌మాట్లాడారు. 'కందుకూరు వెళ్లి పని చేసుకో.. మహీధర్‌రెడ్డి విషయం నేను చూసుకుంటా. మీరే పోటీ చేయాలి' అని ఆయనకు సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇది తెలిసి మహీధర్‌రెడ్డి అనుచరులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తోంది. ఒంగోలులోని తన కార్యాలయంలో ఉన్న మాగుంటను శుక్రవారం లోక్‌సభ పరిధిలోని ఆయా నియోజకవర్గాల నేతలు కలిశారు. 'అంతా మీకు తెలుసు. ఏం చేద్దామో చెప్పండి' అని ఆయన కోరినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 13 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ఆరో తరగతిలో ఉన్న సీట్లు, ఏడు నుంచి పదోతరగతి వరకు మిగిలిన సీట్లు భర్తీ చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇస్తారు. ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తారు. బాలికలకు ఉచిత వసతి సౌకర్యం ఉంది. సైన్స్, కంప్యూటర్ ల్యాబ్స్; స్కూల్ లైబ్రరీ; క్రీడా మైదానాలు అందుబాటులో ఉంటాయి. ఐఐటీ జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, టీపీటీ, సీఎస్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇస్తారు. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి పాఠశాలలో రెండు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 50 చొప్పున మొత్తం 100 సీట్లు ఉంటాయి.

తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో
ప్రవేశాలు

రిజర్వేషన్‌లు

- ప్రతి పాఠశాలలో 15 శాతం సీట్లను ఎస్సీ విద్యార్థులకు, 6 శాతం సీట్లను ఎస్టీ విద్యార్థులకు, 29 శాతం సీట్లను బీసీ విద్యార్థులకు, మిగిలిన 50 శాతం సీట్లను జనరల్ అభ్యర్థులకు కేటాయించారు.
- ప్రతి కేటగిరీకి కేటాయించిన సీట్లలో 3 శాతం సీట్లను దివ్యాంగులకు ప్రత్యేకించారు. అలాగే 33.33 శాతం సీట్లను బాలికలకు నిర్దేశించారు.

అర్హత: విద్యార్థులు ప్రవేశం పొందాలనుకొన్న తరగతికి కింది స్థాయి తరగతి చదువుతూ ఉండాలి. ఆరో తరగతిలో చేరే విద్యార్థి వయసు 2024 ఆగస్టు 31 నాటికి పదేళ్లు నిండాలి. అలాగే ఏడోతరగతికి 11 ఏళ్లు, ఎనిమిదో తరగతికి 12 ఏళ్లు, తొమ్మిదో తరగతికి 13 ఏళ్లు, పదోతరగతికి 14 ఏళ్లు నిండాలి.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. మొత్తం 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. లాంగ్వేజెస్ మినహా అన్ని సబ్జెక్టుల్లో ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు.

- ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అయిదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, మేథమెటిక్స్, సైన్స్ అండ్ సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు.
- ఏడు నుంచి పది తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, మేథమెటిక్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు అడుగుతారు. కింది తరగతుల సిలబస్ ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **పరీక్ష ఫీజు:** జనరల్ కేటగిరీ విద్యార్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.125
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 22
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 1 నుంచి
- **అడ్మిషన్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 7
- **విద్యార్థుల సెలెక్షన్ లిస్ట్ విడుదల:** మే 25
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్, అడ్మిషన్స్:** మే 27 నుంచి 31 వరకు
- **తరగతులు ప్రారంభం:** 2024-25 అకడమిక్ ఇయర్‌కు నిర్దేశించిన ప్రకారం
- **వెబ్‌సైట్:** telanganams.cgg.gov.in



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎస్ఎంఎస్) - ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

సీట్లు: మొత్తం 75 సీట్లు ఉన్నాయి. వీటిలో ఓబీసీ అభ్యర్థులకు 27 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 10 శాతం, దివ్యాంగులకు 3 శాతం, డిఫెన్స్ ఉద్యోగుల పిల్లలకు 5 శాతం సీట్లు ప్రత్యేకించారు. విదేశీ విద్యార్థుల కోసం అదనంగా మరో 15 శాతం సీట్లు కేటాయించారు.

స్పెషలైజేషన్‌లు: మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, బిజినెస్ అనలిటిక్స్, బ్యాంకింగ్.


ప్రోగ్రామ్ వివరాలు: ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. ఏడాదికి రెండు చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కోర్ కోర్సులు, ఫౌండేషన్ కోర్సులు ఉంటాయి. వీటిలో మేనేజ్‌మెంట్ కాన్సెప్ట్స్ అండ్ అప్రోచెస్, మేనేజీరియల్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్, బిజినెస్ అనలిటిక్స్, ఎకనామిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ అండ్ పర్సనల్ ఎఫెక్టివ్‌నెస్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాలు బోధిస్తారు. మొదటి సెమిస్టర్‌లో అయిదు రోజులపాటు 'సెల్ఫ్ అవేర్‌నెస్ అండ్ గ్రోత్ ల్యాబ్' సెషన్స్ నిర్వహిస్తారు. రెండు, మూడు సెమిస్టర్ల మధ్య ఎనిమిది వారాలపాటు సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఇందులో మేనేజ్‌మెంట్ విధానాలు, వర్క్ ఎన్విరాన్‌మెంట్, ఆర్గనైజేషనల్ కల్చర్ అంశాలపై అవగాహన కల్పిస్తారు. రెండో ఏడాది అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న రెండు స్పెషలైజేషన్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. చివరి రెండు సెమిస్టర్లలో అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌లకు సంబంధించిన కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి.

క్రెడిట్స్: ప్రోగ్రామ్ మొత్తానికి 111 క్రెడిట్స్ నిర్దేశించారు. మొదటి రెండు సెమిస్టర్లకు ఒక్కోదానికి 36 క్రెడిట్స్; మూడో సెమిస్టర్‌కు 24 క్రెడిట్స్; నాలుగో సెమిస్టర్‌కు 15 క్రెడిట్స్ ప్రత్యేకించారు.

- డ్యూయెల్ స్పెషలైజేషన్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, లాంగ్ టర్మ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఈ ప్రోగ్రామ్ ప్రత్యేకతలు.

అర్హత: 2024 జూన్ నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 2023 జూన్ నాటికి చివరి సంవత్సర పరీక్షలు రాసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించి



అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. విదేశీ విద్యార్థులకు అకడమిక్ ప్రతిభ, టోఫెల్ స్కోర్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** మొదటి సెమిస్టర్‌కు రూ.50,580; మిగిలిన సెమిస్టర్లకు ఒక్కోదానికి రూ.33,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31(విదేశీ విద్యార్థులకు 2024 ఏప్రిల్ 30)
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in

నీలిట్‌లో
సర్టిఫికెట్ కోర్సు



కాలికట్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- సర్టిఫికెట్ కోర్స్ ఆన్ సైబర్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. దీని వ్యవధి ఆరు వారాలు. ప్రతి రోజూ రెండు గంటల ఆన్‌లైన్ సెషన్, రెండు గంటల ప్రాక్టికల్ సెషన్ ఉంటాయి. అభ్యర్థులకు రికార్డెడ్ వెబ్ లింక్స్ పంపుతారు. అభ్యర్థులకు కనీసం 60 శాతం అటెండెన్స్ తప్పనిసరి. కోర్సు చివరలో ఎండ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మాత్రమే నిబంధనల ప్రకారం మెయిల్ ద్వారా ఈ-సర్టిఫికెట్ పంపుతారు.

కోర్సులోని అంశాలు: లీనక్స్ & నెట్‌వర్కింగ్ బేసిక్స్, ఇంట్రడక్షన్ టు వర్చువలైజేషన్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఫండమెంటల్స్, థ్రెట్స్, వెబ్ సర్వర్ అండ్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ ఫైర్‌వాల్, ఐడీఎస్, యాక్సెస్ మేనేజ్‌మెంట్, ఐఏఎం, ప్రివెన్షన్ అండ్ ప్రొటెక్షన్-క్రిప్టోగ్రఫీ, పీకేఐ, పెనెట్రేటింగ్ టెస్టింగ్, క్లౌడ్ కాన్సెప్ట్, స్కానింగ్ అండ్ అసెస్‌మెంట్, సెక్యూరిటీ స్కానింగ్ & స్టాండర్డ్.

అర్హత: ఈ కోర్సుపై ఆసక్తి ఉన్నవారు, ఇంటర్/పన్నెండోతరగతి లెవెల్ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్, ఆపరేటింగ్ సిస్టమ్-నెట్‌వర్కింగ్ నాలెడ్జ్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.9500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 15
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఫిబ్రవరి 16
- **కోర్సు ప్రారంభం:** ఫిబ్రవరి 19 నుంచి
- **వెబ్‌సైట్:** www.nielit.gov.in

'మహీంద్రా'లో మార్చి 1న అంతర్జాతీయ లా సెమినార్

హైదరాబాద్‌లోని మహీంద్రా యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ లా మార్చి 1న అంతర్జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తోంది. 'రివల్యూషనరీ టెక్నాలజీస్ అండ్ ఎవల్యూషనరీ లాస్: చాలెంజెస్ అండ్ ఆపర్చ్యూనిటీస్'పై ఈ సెమినార్‌ను జరుపుతున్నారు. దీనికి ఒక రోజు ముందు అంటే ఫిబ్రవరి 29న 'డేటా గవర్నెన్స్ ఇన్ ద ఏజ్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'పై వర్క్‌షాప్ ఉంటుంది. మార్చి 2, 3 తేదీల్లో మూట్ కోర్టు పోటీలు ఉంటాయి. ఈ వివరాలతో కూడిన బ్రోచర్‌ని వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి, స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి విడుదల చేశారు. ఆ వివరాలతో వెబ్‌పేజీని కూడా రిలీజ్ చేశారు. మహీంద్రా వర్సిటీకి తోడు బెల్జియమ్‌లోని గ్రేస్పేస్ లా అండ్ పాలసీ కన్సల్టింగ్, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్, లా చాంబర్స్ అలాగే ఏపీ సురేష్ అండ్ అసోసియేట్స్ ఈ సెమినార్ నిర్వహణలో పాలుపంచుకుంటున్నాయి.

వెబ్‌సైట్:
https://www.mahindrauniversity.edu.in/one-day-international-conference-on-revolutionary-technologies-and-evoloutionary-laws-challenges-and-opportunities/

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో
ప్రవేశానికి ఏటీఎంఏ

అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్(ఏఐఎంఎస్)- టెస్ట్ ఫర్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్స్(ఏటీఎంఏ) 2024 ఫిబ్రవరి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న పలు బిజినెస్ స్కూళ్లలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంహెచ్ఏ, పీజీడీఎం తదితర ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షకి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; సీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఏటీఎంఏ వివరాలు: దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. అనలిటికల్ రీజనింగ్ స్కిల్స్, వెర్బల్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్ అంశాలకు సంబంధించి ఒక్కో దానిలో రెండు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 30 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. మొత్తం మార్కులు 180. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 15 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్/సికింద్రాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం
- **ఏటీఎంఏ 2024 తేదీ:** ఫిబ్రవరి 18
- **ఫలితాలు విడుదల:** ఫిబ్రవరి 23
- **వెబ్‌సైట్:** atmaaims.com

జాబ్ కార్నర్

ఈసీఐఎల్‌లో జూనియర్ టెక్నీషియన్లు

ఖాళీలు 1100

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ టెక్నీషియన్(గ్రేడ్-2)

ట్రేడుల వారీ ఖాళీలు: ఎలక్ట్రానిక్స్ మెకానిక్-275, ఎలక్ట్రీషియన్-275, ఫిట్టర్-550,

అర్హత: ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ఎలక్ట్రీషియన్/ఫిట్టర్ ట్రేడ్స్‌లో ఐటీఐ ఉత్తీర్ణత. ఏడాది అప్రెంటిస్‌షిప్‌తో పాటు ప్రభుత్వ రంగ ఎలక్ట్రానిక్ సంస్థల్లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 16 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: నెలకు రూ.22,528

ఎంపిక విధానం: ఐటీఐ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జనవరి 16

వెబ్‌సైట్: https://www.ecil.co.in/

ఎంఆర్‌పీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్లు

మంగళూరు(కర్ణాటక)లోని ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ- మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్(ఎంఆర్‌పీఎల్)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అసిస్టెంట్ ఇంజనీర్: 4 పోస్టులు

విభాగాలు: ఫైర్, సెక్రటేరియల్, సేఫ్టీ

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ(ఫైర్/ఫైర్ అండ్ సేఫ్టీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియాలో అసోసియేట్ మెంబర్‌షిప్, డిగ్రీతో పాటు ఇండస్ట్రియల్ సేఫ్టీలో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 27 సంవత్సరాలు మించరాదు.

దరఖాస్తు రుసుము: రూ.118. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 10

వెబ్‌సైట్: www.mrpl.co.in/

నాల్కోలో స్పెషలిస్టులు

భువనేశ్వర్‌లోని నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 10

1. స్పెషలిస్ట్/ఇ02 గ్రేడ్: 4 పోస్టులు
2. స్పెషలిస్ట్/ఇ03 గ్రేడ్: 6 పోస్టులు

విభాగాలు: ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, రేడియాలజీ, మెడిసిన్, ఆప్తల్మాలజీ

అర్హతలు: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



వయోపరిమితి: ఇ03 పోస్టులకు 38 ఏళ్లు; ఇ02 పోస్టులకు 35 సంవత్సరాలు మించకూడదు.

పే స్కేల్: C03 పోస్టులకు రూ.80,00-రూ.2,20,000. C02 పోస్టులకు రూ.70,000-రూ.2,00,000.

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జనవరి 16

వెబ్‌సైట్: https://nalcoindia.com/

రైట్స్‌లో ఇంజనీర్లు

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఇంజనీర్(కెమికల్): 2 పోస్టులు

అర్హత: బీఈ/బీటెక్(కెమికల్/పెట్రోకెమికల్/కెమికల్ టెక్నాలజీ/పెట్రోకెమికల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 సంవత్సరాలు మించకూడదు.

బేసిక్ పే: నెలకు రూ.23,340

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్ అప్లికేషన్‌కు చివరి తేదీ: జనవరి 25

రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 4

వెబ్‌సైట్: nalcoindia.com/

యూపీఎస్సీ సీడీఎస్ఈ(1)-2024

ఖాళీలు 457

త్రివిధ దళాల్లో ఉన్నతోద్యోగాల భర్తీకి ఉద్దేశించిన కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)(1)-2024 నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. డిగ్రీ పూర్తి చేసుకున్న అవివాహిత పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవాలి.

విభాగాల వారీ ఖాళీలు

1. ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్: 100
2. ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ), ఎజిమల: 32
3. ఎయిర్ ఫోర్స్ అకాడమీ(ఏఎఫ్ఏ), హైదరాబాద్: 32
4. ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ మెన్ నాన్ టెక్నికల్: 275

విద్యార్హత: మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నేవల్ అకాడమీ ఉద్యోగాలకు ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులు. ఎయిర్ ఫోర్స్ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్‌లో మేథ్స్; ఫిజిక్స్ చదివి ఉండాలి. ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు.

వయసు: ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీలకు 2001 జనవరి 2 కంటే ముందు; 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఉండరాదు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పోస్టులకు 2001 జనవరి 2 కంటే ముందు, 2005 జనవరి 1 తర్వాత జన్మించి ఉండరాదు. ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ పోస్టులకు 1999 జనవరి 2 కంటే ముందు, 2005 జనవరి 1 తర్వాత జన్మించి ఉండరాదు.

ఎంపిక ప్రక్రియ: రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

చివరి తేదీ: జనవరి 16

పరీక్ష తేదీ: ఏప్రిల్ 21

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, అనంతపురం

వెబ్‌సైట్: https://upsc.gov.in/

లిటిల్స్



గాడిద గారం

ఒక ఊరిలో ఓ వ్యాపారి ఉండేవాడు. అతని దగ్గర ఓ గాడిద, కుక్క ఉండేవి. గాడిద మీద వ్యాపారి రోజూ కుండలు తీసుకుని వెళ్లి ఇతర గ్రామాల్లో అమ్ముకునేవాడు. ఇంటికి వచ్చి గాడిద బాగోగులు ఆలోచించేవాడు కాదు. పైగా ఇంటికి వచ్చిన తర్వాత కుక్కతో ఆడుకునేవాడు. ఆ యజమాని తీరును చూసి గాడిద బాధపడేది. తననెందుకు అలా చూడడని అనుకుండేది. దానికి సమాధానం దొరికేది కాదు.

ఒక రోజు కుండలతో వేరే ఊరు వెళ్తోంది. గాడిదకు కాస్త ఆరోగ్యం బాగలేదు. మెల్లగా నడుస్తోంది. అవేమీ పట్టించుకోకుండా కర్రతో బాదాడు. కదలకుండా ఉంటే కాలితో తన్నాడు. ఆ తర్వాత గమ్యస్థానానికి వెళ్లారు. గాడిదకు ప్రతి రోజూ కుళ్లిపోయిన ఆహారం పెట్టినట్టే.. ఆ రోజు కూడా అలాంటి ఆహారాన్నే పెట్టాడు యజమాని. కనీసం కుక్క కంటే కొద్దిగా, లేకుంటే కుక్కకు ఇచ్చిన విలువ నాకు ఇవ్వాలి కదా! అనుకుంది. బాధతో గాండ్రించింది.




ఒక రోజు వేరే గ్రామం వెళ్లి ఇంటికొచ్చాక కుక్కకు మాంసం ముక్కలు వేశాడు. దాని జుట్టును నిమిరాడు. ఆ కుక్క యజమాని వేళ్లను నాకుతోంది. అలా తన ప్రేమను చాటుకుంటోంది. ఆ తర్వాత కుక్కకు పాలన్నం పెట్టాడు. ఇవన్నీ చూస్తూ ఎంతో బాధతో గాడిద ఊరికే ఉంది. చివరికి కాస్త కోపం వచ్చింది. ఇక లాభం లేదనుకుని కుక్కలా ఉండాలనుకుంది. అలాగనైనా మర్యాద ఇస్తాడు. అప్పుడు చూపిస్తా నా ప్రతిభ అనుకుంది గాడిద. ఒక రోజు ఆదివారం గాడిద దగ్గరకు మేపు వేయటానికి యజమాని వచ్చాడు. కుక్క కాళ్లు ఎత్తినట్లు గాడిద అనుకరించింది. పైగా తను మరింత ప్రేమ చూపిస్తున్నట్లు నటించాలని.. తద్వారా తన పట్ల యజమాని గారం చూపిస్తాడనుకుంది. యజమానికి కాళ్లతో తాకితే తన తల నిమురుతాడని ఊహించింది. యజమాని దగ్గరకు వెళ్లింది. ఇదేదో తన మీద పడి చంపేట్టుందని భావించిన యజమాని పక్కన ఉండే ఓ దుడ్డుకర్రతో గట్టిగా బాదాడు. 'నేను గారం చూపించటానికి కూడా పనికిరానా?' అనుకుంటూ బాధపడింది. ఎదురుగా కుక్క ఉన్నది. గాండ్రింపుతో తన స్థలంలోకి వెళ్లింది గాడిద. క్షణంలో యజమాని కుక్కను పిలిచి గారాబంతో నిమురుతూ ఇన్ని మాంసం ముక్కలు వేశాడు. గాడిద పస్తుతో నకనకలాడింది.


దారి కనుక్కోండి



5 తేడాలు గుర్తించండి



రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 203

								7
	4		7			1		
3		7		9	1			4
		8		5		2	1	
				3				
	9	2		7		5		
4			5	1		3		8
		1			6		2	
2								

సుడోకు - 202 సమాధానం

4	7	6	8	2	3	1	5	9
5	3	1	9	4	7	8	2	6
9	2	8	5	1	6	4	3	7
8	4	2	3	9	5	6	7	1
1	5	9	6	7	2	3	8	4
7	6	3	1	8	4	5	9	2
3	9	7	4	5	1	2	6	8
2	1	5	7	6	8	9	4	3
6	8	4	2	3	9	7	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.